
RNI.No. APTEL/2014/57702
ESTD: 1999
www.voodayam.com




# వుదయం

మీ ఆర్థిక అవసరాల ఆశయసాధన
KAPIL GROUP
కపిల్ చిట్స్
Visit Us: www.kapilchits.com
46 Years
కపిల్ చిట్స్ మీ కలలకు సాకారం

గుంటూరు | 07-05-2026 గురువారం | సంపుటి : 13 | సంచిక : 65 | SINCE 25 YEARS CIRCULATED TELUGU DAILY | రూ. 3.00 | పేజీలు : 12 | VOODAYAM Telugu DAily
Simultaneously Published from Guntur, Hyderabad, Adilabad, Karimnagar, Khammam & Warangal | Postal Regd. No. GTR/117/2025-27 | Follow us on



టీవీకే అధినేత విజయ్ తమిళనాడు గవర్నర్ విశ్వనాథ్ ఆర్లేకర్ ను బుధవారం కలిశారు. ప్రభుత్వ ఏర్పాటునకు గవర్నర్ అనుమతి కోరారు. నేడు లేదా రేపు విజయ్ ప్రమాణస్వీకారం చేయనున్నారు. నెహ్రూ స్టేడియంలో ప్రమాణస్వీకారానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. ప్రమాణస్వీకారానికి రాహుల్ గాంధీ సహా ప్రముఖులు హాజరుకానున్నారు.

# నేడా.. రేపా..?

## డోలాయమానంలో విజయ్ ప్రమాణ స్వీకారం?

- సంఖ్యా బలం పట్ల గవర్నర్ అసంతృప్తి?
- మెజార్టీ మార్క్ కోసం ప్రయత్నాలు
- మిత్రపక్షాల కోసం అన్వేషణ
- టివికెకి మద్దతు ప్రకటించిన కాంగ్రెస్
- అసెంబ్లీని రద్దు చేసిన గవర్నర్

తమిళగ వెట్రి కజగం (టివికె) పార్టీ మిత్రపక్షాల కోసం అన్వేషణ సాగిస్తున్న తరుణంలో, ఇంకా పూర్తిగా మెజారిటీ సంఖ్యను సాధించని క్రమం లో తమిళనాడులో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు తమకు అవకాశం కల్పించాలంటూ గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్‌ను కలిసి విజ్ఞప్తి చేసినప్పటికీ గవర్నర్ అంత సుముఖతను వ్యక్తం చేయనట్టు సమాచారం. అధికార వర్గాల కథనం ప్రకారం, ముఖ్యమంత్రి పదవికి విజయ్ ను తమ అభ్యర్థిగా సమర్థిస్తూ, టివికెకి చెందిన 108 మంది ఎమ్మెల్యేల సంతకాలు కూడా ఆ లేఖలో ఉన్నాయి. అయితే, విజయ్ తన ముం దు ప్రస్తావించిన సంఖ్యాబలం పట్ల గవర్నర్ అర్లే కర్ సంతృప్తి చెందలేదని ఆ వర్గాలు వెల్లడించాయి.

**చెన్నై, మే 6 (వుదయం) :** తమిళనాడు శాసనసభలో మెజారిటీ మార్కును అధిగమించేందుకు అవసరమైన మద్దతును, తమిళగ వెట్రి కజగం (టివికె) అధినేత విజయ్ ఇంకా పటిష్టం చేసుకుంటున్నందున, ఆయన రేపు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసే అవకాశం లేదని బుధవారం అధికార వర్గాలు తెలిపాయి. ప్రస్తుతానికి టివికె వద్ద "అధికారిక గణాంకాలు ఏవీ లేవని", అలాగే ఇప్పటి వరకు ఉన్న సంఖ్యల పట్ల గవర్నర్ సంతృప్తి చెందలేదని ఆ వర్గాలు పేర్కొన్నాయి. 234 మంది సభ్యులు కలిగిన అసెంబ్లీలో టివికె 108 స్థానాలను గెలుచుకుంది,

మిగతా 2లో

## తెలుగు రాష్ట్రాల మధ్య
# కొత్త రైల్వే లైన్


- కీలక దశకు కాచిగూడ - జగ్గయ్యపేట ప్రాజెక్టు పనులు
- విజయవంతంగా లైడార్ సర్వే
- వచ్చే నెలాఖరులోగా ప్రాజెక్టు డీపీఆర్ రెడి



**హైదరాబాద్, మే 06 (వుదయం ప్రతినిధి) :** ఏపీ, తెలంగాణ రాష్ట్రాలను కలుపుతూ ప్రతిపాదించిన కాచిగూడ – జగ్గయ్యపేట నూతన రైల్వే లైన్ ప్రాజెక్టు పనులు కీలక దశకు చేరుకున్నాయి. ఈ ప్రాజెక్టులో కీలకమైన లైడార్ సర్వే ప్రక్రియను రైల్వే అధికారులు విజయవంతంగా పూర్తి చేశారు. ఈ సర్వే ఆధారంగా ప్రాజెక్టుకు అవసరమైన అంచనా వ్యయం, భూసేకరణ అవసరాలు, ఇతర సాంకేతిక అంశాలతో కూడిన సమగ్ర నివేదికను సిద్ధం చేసే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. ఈ ప్రాజెక్టు సర్వే కోసం రైల్వే బోర్డు 2023 జూలైలో ప్రాథమిక ఆమోదం తెలిపింది. దాదాపు మూడేళ్ల సుదీర్ఘ ప్రక్రియ తర్వాత ప్రస్తుతం సర్వే పనులు కొలిక్కి వచ్చాయి. ప్రాథమిక అంచనాల ప్రకారం.. ఈ కొత్త రైల్వే లైన్ మొత్తం దూరం సుమారు 228 కిలోమీటర్లుగా ఉండనుంది. ఈ మార్గం అందుబాటులోకి వస్తే హైదరాబాద్ నుంచి ఏపీలోని పారిశ్రామిక ప్రాంతమైన జగ్గయ్యపేటకు రవాణా సౌకర్యాలు మరింత మెరుగుపడటంతో పాటు, ప్రయాణ సమయం కూడా గణనీయంగా తగ్గనుంది.

## హైదరాబాద్ మెట్రో ఫేజ్-2ను
# ఆమోదించండి

## ప్రాజెక్టులో కేంద్ర ప్రభుత్వం భాగస్వామిగా ఉండాలి



వేగంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్ నగరంలో ప్రయాణికుల సౌకర్యార్థం మెట్రోను మరింతగా విస్తరించాలి. హైదరాబాద్ మెట్రో రైలు ఫేజ్–2, ఫేజ్–3 విస్తరణ సజావుగా సాగాలనే ఉద్దేశ్యంతోనే మెట్రో ఫేజ్–1ను ఎల్ అండ్ టీ హైదరాబాద్ మెట్రో రైలును రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. ప్రస్తుతం ఫేజ్–I ప్రభుత్వం పరిధిలో ఉండడంతో ఫేజ్–2, ఫేజ్–3 విస్తరణ సులువవుతుంది.

– కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు సీఎం రేవంత్ రెడ్డి వివరణ

- ఎయిర్‌పోర్ట్-ఫ్యూచర్ సిటీ కారిడార్‌ను ఫేజ్-3 కింద చేపట్టండి
- భారత ప్రభుత్వం - తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాల జాయింట్ వెంచర్ గా చేపట్టేందుకు త్వరగా ఆమోదం తెలపాలి
- కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు సీఎం రేవంత్ రెడ్డి వినతి

**న్యూఢిల్లీ, మే 6 (వుదయం బ్యూరో) :** హైదరాబాద్ మెట్రో ఫేజ్–2కు ఆమోదం తెలపాలని కేంద్ర పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఏడు కారిడార్లతో కూడిన మెట్రో ఫేజ్–2 సమగ్ర ప్రణాళికను రూపొందించి డీపీఆర్‌ను ఇప్పటికే సమర్పించామని కేంద్ర మంత్రికి సీఎం తెలియజేశారు. ఢిల్లీలో కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌తో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి బుధవారం సాయంత్రం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి హైదరాబాద్ మెట్రో ఫేజ్–2, మెట్రో ఫేజ్–3పై కేంద్ర మంత్రితో చర్చించారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్ నగరంలో ప్రయాణికుల సౌకర్యార్థం మెట్రోను మరింతగా విస్తరించాల్సిన అవసరం ఉందని కేంద్ర మంత్రికి సీఎం తెలియజేశారు. హైదరాబాద్ మెట్రో రైలు ఫేజ్–2, ఫేజ్–3 విస్తరణ సజావుగా సాగాలనే ఉద్దేశ్యంతోనే మెట్రో ఫేజ్–1ను ఎల్అండ్ టీ హైదరాబాద్ మెట్రో రైలును రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకుందని కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు సీఎం వివరించారు. ప్రస్తుతం ఫేజ్–I ప్రభుత్వం పరిధిలో ఉండడంతో ఫేజ్–1, ఫేజ్–3 విస్తరణ సులువవుతుందన్నారు. హైదరాబాద్‌లో మెట్రో రైలు నెట్‌వర్క్‌ను విస్తరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఫేజ్–IIలో ఏడు కారిడార్లతో మొత్తం 122.9 కి.మీ మేర విస్తరణకు, రూ. 38,595 కోట్ల అంచనా వ్యయంతో రూపొందించిన సమగ్ర డీపీఆర్‌ను ఇప్పటికే సమర్పించామని సీఎం తెలిపారు. హైదరాబాద్ మెట్రో రైలు ఫేజ్–2 ప్రాజెక్ట్‌ను భారత ప్రభుత్వం – తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాల జాయింట్ వెంచర్ గా చేపట్టేందుకు

మిగతా 2లో

# నామినేటెడ్ జాతర

- 17 కార్పొరేషన్లకు చైర్మన్లు, 11 వైస్ చైర్మన్లతో జాబితా
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి
- ఇప్పటికే పలు దఫాలుగా నామినేటెడ్ పోస్టులు భర్తీ
- త్వరలోనే మిగిలిన పోస్టులు భర్తీ

**హైదరాబాద్, మే 6 (ఎఎంఎస్) :** రాష్ట్రంలో నామినేటెడ్ పదవుల పండగ మళ్లీ మొదలైంది. ఇప్పటికే పలు దఫాలుగా కొన్ని నామినేటెడ్ పోస్టులను భర్తీ చేసిన అధికార కాంగ్రెస్ పార్టీ... తాజాగా పలు కార్పొరేషన్లకు చైర్మన్లను ప్రకటించింది. ఈ మేరకు టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ బుధవారం మొత్తం 17 కార్పొరేషన్లకు చైర్మన్లు, 11 వైస్ చైర్మన్లతో జాబితా ప్రకటించారు. రాష్ట్ర గ్రామ పంచాయతీ ట్రిబ్యునల్ చైర్మన్ గా సూదిని రామిరెడ్డి ట్రిబ్యునల్ సభ్యులుగా నగులూరి కృష్ణకుమార్, బూసా వేణుగోపాల్‌ను నియమించారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణరావు ఉత్తర్వులు జారీ చేశారు. మిగిలిన పోస్టులను కూడా త్వరలోనే భర్తీ చేయనున్నట్లు కాంగ్రెస్ పార్టీ స్పష్టం చేసింది. దీంతో రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో వచ్చినప్పటి నుంచి నామినేటెడ్ పదవుల కోసం విశ్వప్రయత్నాలు చేసిన ఆ పార్టీ నేతల్లో కొందరికి ఆ పోస్టులు వరించగా ఇంకొందరికి మాత్రం నిరాశే మిగిలింది. మిగతా 2లో

## అసోం 15వ
# శాసనసభ రద్దు

- రాజీనామా సమర్పించిన ముఖ్యమంత్రి హిమంత : నూతన ప్రభుత్వానికి ఏర్పాట్లు



**వుదయం డెస్క్, మే 6 :** ఎన్డీయే సాధించిన నిర్ణయాత్మక ఎన్నికల విజయానంతరం, కొత్త ప్రభుత్వం ఏర్పాటు ప్రక్రియను ప్రారంభిస్తూ అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ బుధవారంనాడు గవర్నర్ లక్ష్మణ్ ప్రసాద్ ఆచార్యకు తన రాజీనామాను సమర్పించారు. దీనితో, అసోం రాజకీయాల్లో నూతన ప్రభుత్వ ఏర్పాటు దిశగా కీలక అడుగు పడింది. అసోం అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి ఘనవిజయం సాధించిన నేపథ్యంలో, ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ తన కేబినెట్ సహచరులతో కలిసి గవర్నర్ లక్ష్మణ్ ప్రసాద్ ఆచార్యను కలిశారు. తన రాజీనామా లేఖను గవర్నర్‌కు అందజేయగా, ఆయన దానిని ఆమోదించారు. రాజ్ భవన్‌కు బయలుదేరే ముందు గువాహతిలో విలేకరులతో మాట్లాడుతూ, ఎన్నికల ఫలితాలు అధికారికంగా సమర్పించిన తర్వాతే తాను గవర్నర్‌ను లాంఛనంగా కలుస్తానని శర్మ తెలిపిన విషయం తెలిసిందే. అయితే, కొత్త ప్రభుత్వం కొలువుదీరే వరకు తాత్కాలిక ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహించాలని గవర్నర్ ఆయనను కోరారు. 126 స్థానాలున్న అసోం అసెంబ్లీలో బీజేపీ కూటమి ఏకంగా 102 స్థానాలను కైవసం చేసుకుని రికార్డు సృష్టించింది.

# రైతు డిక్లరేషన్ ఓ బోగస్

## రాహుల్, రేవంత్ ఫోటోలు పోలీస్ స్టేషన్లలో పెట్టాలి

### కాంగ్రెస్ గ్యాంగ్.. చెడ్డీ గ్యాంగ్ కంటే చాలా ప్రమాదకరం

- రైతు డిక్లరేషన్ ఓ బోగస్ పత్రం
- కాంగ్రెస్ పార్టీ నయవంచనకు పాల్పడింది
- అన్నదాతలకు ఇచ్చిన 34 హామీలు ఏమయ్యాయి
- 69 సార్లు ఢిల్లీ వెళ్లి వచ్చిన సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్ర రైతుల కోసం 69 పైసలైనా తెచ్చారా?
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

*కేసీఆర్ ఎకరాకు రూ. 10 వేలు ఇస్తే, తాము రూ. 15 వేలు ఇస్తామని కాంగ్రెస్ చేసిన వాగ్దానం అమలు కావడం లేదు. అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు అవుతోన్నా ఇప్పటి వరకు రైతులకు పూర్తి స్థాయిలో న్యాయం జరుగడం లేదు. ఇప్పటి వరకు 69 సార్లు ఢిల్లీ వెళ్లి వచ్చిన సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్ర రైతుల కోసం 69 పైసలైనా తెచ్చారా?* - కెటిఆర్



**హైదరాబాద్, మే 06 (వుదయం ప్రతినిధి) :** అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా రాష్ట్ర రైతులకు అనేక వాగ్దానాలు చేసి విస్మరించిన రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి ఫోటోలను పోలీస్ స్టేషన్లలో అంటించి 'దొంగలొస్తున్నారు జాగ్రత్త' అని రాయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ గ్యాంగ్.. చెడ్డీ గ్యాంగ్ కంటే చాలా ప్రమాదకరమని వ్యాఖ్యానించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా వరంగల్ వేదికగా కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన రైతు డిక్లరేషన్.. ఓ బోగస్ పత్రమన్న ఆయన అది కేవలం చిత్తు కాగితమని విమర్శించారు. కాంగ్రెస్ నిర్వహిస్తున్నది 'రైతు మేళా' కాదు, అది ఒక 'దగా మేళా' అని సంబోధించారు. బుధవారం వరంగల్ లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'రైతు సంగ్రామ సదస్సు'లో కేటీఆర్ మాట్లాడారు. రైతు డిక్లరేషన్ పేరిట కాంగ్రెస్ పార్టీ నయవంచనకు పాల్పడిందని ఆరోపించారు. నాలుగేళ్ల క్రితం ఇదే వరంగల్ గడ్డపై కాంగ్రెస్ పెద్దలు వచ్చి 'రైతు డిక్లరేషన్' ప్రకటించారని కేటీఆర్ గుర్తు చేశారు. 60 ఏళ్ల పాటు రైతుల రక్తం తాగిన కాంగ్రెస్ పార్టీ, ఎన్నికల ముందు మాత్రం కొంగజపం చేసిందని ఎద్దేవా చేశారు. రైతు డిక్లరేషన్‌లో అన్నదాతలకు ఇచ్చిన 34 హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. కాంగ్రెస్ మాటలు నమ్మి ఓట్లు వేసిన రైతులు నేడు అరిగోస పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

మిగతా 2లో

## రాష్ట్ర భద్రతా సలహాదారుగా
# శివధర్ రెడ్డి



**హైదరాబాద్, మే 06 (వుదయం ప్రతినిధి) :** మాజీ డీజీపీ శివధర్ రెడ్డి రాష్ట్ర భద్రతా సలహాదారుగా బాధ్యతలు స్వీకరించారు. బుధవారం బంజారాహిల్స్ లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లో ఆయన విధుల్లో చేరారు. హైదరాబాద్ సీపీ వి.సి సజ్జనార్ సహా పలువురు సీనియర్ పోలీస్ అధికారులు ఈ సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శివధర్ రెడ్డి గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను లోక్ భవన్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. గత నెలాఖరున డీజీపీ హోదాలో పదవి విమరణ చేసిన శివధర్ రెడ్డిని రాష్ట్ర ప్రభుత్వం మూడేళ్ల కాల పరిమితితో రాష్ట్ర భద్రతా సలహాదారుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ క్రమంలో పోలీస్ శాఖలో వివిధ హోదాలో పని చేసిన అనుభవాన్ని ఉపయోగించుకోవాలని నిర్ణయం తీసుకున్నది. రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణ, అంతర్గత భద్రత, నేర నియంత్రణ, మాదకద్రవ్యాల నిరోధం, రోడ్డు భద్రత తదితర కీలకమైన పోలీసింగ్ అంశాలపై ప్రభుత్వానికి ఆయన దిశానిర్దేశం చేయనున్నారు.

**రాష్ట్ర భద్రతా సలహాదారుగా శివధర్ రెడ్డి నియామకం చెల్లదు**
హైకోర్టులో పిటిషన్ 2

## 2 ఏండ్లలో తెలంగాణకు
# ఏం ఇచ్చారో చెప్పండి



- ప్రధాని మోడీకి మంత్రి పొన్నం నిలదీత
- తెలంగాణపై కేంద్రం కక్షపూరిత చర్య
- హామీల అమలు, నిధులు కేటాయింపులో అన్యాయం : రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియకు అవమానం

2

# అధైర్యపడొద్దు.. ప్రతి గింజను కొంటాం

- ధాన్యం కొనుగోళ్లపై బీఆర్ఎస్ రాద్ధాంతం
- తప్పుడు ప్రచారంతో రైతుల్లో ఆందోళనకు యత్నం
- వరుస ఎన్నికల్లో ఓటమి పాలైన కనువిప్పు కలగలేదు
- అకాల వర్షాలు, హీట్ వేవ్స్ నుంచి రక్షించేందుకు ఏర్పాట్లు
- 95 లక్షల మె. ట ధాన్యం కొనుగోలుకు సిద్ధంగా ఉన్నాం
- రైతులకు పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ భరోసా



**హైదరాబాద్, మే 06 (వుదయం ప్రతినిధి) :** ధాన్యం కొనుగోలు విషయంలో బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం చేస్తూ.. రైతులను ఆందోళనకు గురిచేస్తోందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.

మిగతా 2లో

## 'ప్రైవేట్' విద్యాసంస్థల దోపిడీని
# అరికట్టాల్సిందే

- ఫీజు పెంచొద్దంటూ జీవో జారీ చేయాలి
- ఫీజుల నియంత్రణ చట్టం ఈ నెలలోనే తేవాలి
- ప్రైవేట్ విద్యాసంస్థల దోపిడీ, హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ లో అవినీతి పై స్పందించాలి
- ఉచిత విద్య, వైద్యం మా పార్టీ విధానం
- మాట తప్పితే అమరవీరుల స్థూపం వద్ద రాళ్లతో కొట్టండి : టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత




**హైదరాబాద్, మే 6 (ఎఎంఎస్) :** రాష్ట్రంలో ప్రైవేట్ విద్యాసంస్థల దోపిడీని అరికట్టటంలో రేవంత్ రెడ్డి సర్కార్ ఘోరంగా ఫెయిల్ అయ్యిందని టీఆర్ఎస్ చీఫ్ కవిత ఆరోపించారు. ఫీజుల దోపిడీ నియంత్రణకు ఈ నెలలోనే చట్టం తేవాలని ఆమె డిమాండ్ చేశారు. హైదరాబాద్ పేరెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నాణ్యమైన విద్య – ఫీజుల నియంత్రణ అనే అంశంపై బుధవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశం లో ఆమె మాట్లాడారు. ప్రైవేట్ విద్యాసంస్థల దోపిడీ, హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ లో అవినీతి పై ప్రభుత్వం స్పందించాలని కోరారు.

మిగతా 2లో

# నా కోసం జనాన్ని ఆపకండి

- ప్రజలు ట్రాఫిక్ ఇబ్బందులు పడొద్దు
- నా కాన్వాయ్ కోసం వాహనదారుల రాకపోకలకు ఆటంకం కలిగించొద్దు
- నిర్లక్ష్యం వహించే అధికారులపై చర్యలు తీసుకోండి
- డీజీపీకి సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు
- పోలీస్ కమిషనర్లతో డీజీపీ వీడియో కాన్ఫరెన్స్
- త్వరలో 'ట్రాఫిక్ బ్యూరో' ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటన



**హైదరాబాద్, మే 06 (వుదయం ప్రతినిధి) :** తన పర్యటనల సమయంలో ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా చూడాలని సీఎం రేవంత్ రెడ్డి డీజీపీ సీవీ ఆనంద్ ను ఆదేశించారు. ప్రజలను గంటల తరబడి రోడ్లపై నిలిపివేయొద్దని డీజీపీకి సూచించారు. బుధవారం ఢిల్లీ పర్యటన సందర్భంగా ఎయిర్‌పోర్టు వద్ద ట్రాఫిక్ జామ్‌పై సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. కాన్వాయ్ కోసం ప్రజల పనులకు ఆటంకం కలిగించవద్దని ఆదేశాలు జారీ చేశారు. ఎదురుగా వచ్చే వాహనాలను కూడా ఆపి ఇబ్బంది పెట్టొద్దని సూచించారు. నిర్లక్ష్యం వహించే అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెచ్చరించారు. మరోవైపు.. సీఎం ఆదేశాలపై స్పందించిన డీజీపీ సీవీ ఆనంద్ రాష్ట్ర వ్యాప్తంగా పోలీస్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ట్రాఫిక్ సమస్యలపై క్షేత్రస్థాయి అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. మిగతా 2లో

## వ్యూహాత్మక రక్షణ సహకారం దిశగా భారత్-యూఏఈ



*మే 18న ప్రధాని మోడీ నెదర్లాండ్స్ పర్యటన నిమిత్తం అబుదాబిలో దిగనున్న నేపథ్యంలో, ముంద్రా–ఫుజైరా–అకాబాను కొత్త వాణిజ్య అక్షంగా ప్రచారం చేస్తూ ఇరు దేశాలు తమ ద్వైపాక్షిక సంబంధాలను పటిష్టం చేసుకుంటుండటంతో అందరి దృష్టి వాటిపైనే ఉంది.*

5

# కొండ ప్రాంత వాసుల చిరకాల కోరిక నెరవేర్చుతున్న కూటమి ప్రభుత్వం

### ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం మా సంస్కృతిని గద్దె క్రాంతి కుమార్





విజయవాడ మే 6 వు వుదయం ప్రతినిధి:- పేదల కోసం పని చేయడం మా బాధ్యతని, ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం మా సంస్కృతిని కూటమి ప్రభుత్వం మాటల్లో కాదు, పనిలో చూపిస్తూ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటోందని గద్దె క్రాంతి కుమార్ తెలిపారు. తూర్పు నియోజకవర్గంలోని కొండ ప్రాంత వాసుల చిరకాల స్వప్నాన్ని సాకారం చేస్తూ కూటమి ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకుందని దశాబ్దాలుగా ఇళ్ల పట్టాల కోసం ఎదురుచూస్తున్న పేదలకు ఇప్పుడు న్యాయం జరుగుతోంది టీడీపీ యువ నాయకులు గద్దె క్రాంతి కుమార్ తెలిపారు.

బుధవారం నాడు 2, 3, 5, 6, 7 డివిజన్ పరిధిలోని కొండ ప్రాంతాలలో టీడీపీ యువ నాయకులు గద్దె క్రాంతికుమార్ విస్తృతంగా పర్యటించి ఇళ్ళ పట్టాల సర్వేను ప్రత్యక్షంగా పరిశీలించారు.

ఈ సందర్భంగా గద్దె క్రాంతి కుమార్ మాట్లాడుతూ ఇళ్ల పట్టాల మంజూరుకు సంబంధించిన సర్వే ప్రక్రియ వేగంగా కొనసాగుతోందని తెలిపారు. పట్టాతో కూడిన సొంత స్థలం ప్రతి పేద కుటుంబానికి గౌరవం, భద్రత, భరోసా అనే లక్ష్యంతోనే 2018లో టీడీపీ ప్రభుత్వం ఇళ్ల పట్టాల మంజూరుకు పునాది వేసిందని తెలిపారు. అప్పుడు సర్వే పూర్తి అయి పట్టాలు ఇచ్చే సమయానికి ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్, వెనువెంటనే సాధారణ ఎన్నికల కోడ్ రావడంతో ఆ ప్రక్రియకు తాత్కాలిక బ్రేక్ పడిందన్నారు. తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం పేదల ఆశలను పూర్తిగా విస్మరించి, ఇళ్ల పట్టాల ప్రక్రియను నిలిపివేసి 5 సంవత్సరాల పాటు ఎటువంటి పురోగతి లేకుండా పేదలను నిరాశలో ముంచిందన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం మాట నిలబెట్టుకుంటూ ఆగిపోయిన ప్రక్రియను తిరిగి ప్రారంభించడంతో కొండ ప్రాంతాలు, ప్రభుత్వ భూముల్లో నివసిస్తున్న వేలాది కుటుంబాలకు ఇది గొప్ప అవకాశం దక్కిందన్నారు. సర్వే పూర్తయ్యాక ఇళ్ల పట్టాల మంజూరు ద్వారా వారికి చట్టబద్ధ హక్కులు లభించనున్నాయని,ఇళ్ల పట్టాలు అంటే కేవలం భూమి కాదని---అది ఒక కుటుంబానికి ఆత్మగౌరవం, ఆర్థిక భద్రత, బ్యాంక్ రుణాల అవకాశం, పిల్లల భవిష్యత్తుకు బలమైన పునాదన్నారు. ఈ నిర్ణయం పేదల జీవితాలను మార్చే దిశగా విప్లవాత్మక అడుగని సర్వే సమయంలో ప్రజలు పూర్తి సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమాలలో రెవిన్యూ అధికారులు, 2, 3, 5, 6, 7 డివిజన్ల కూటమి నాయకులు పాల్గొన్నారు...

# మండల సమస్యలు వివరించిన జనసేన పార్టీ అధ్యక్షుడు

- ఎమ్మెల్యే శిరీష దేవి తో ముఖాముఖీ అధ్యక్షులు ములకాల సాయికృష్ణ!.
- ప్రజల సమస్యలపై పోరాడుతున్న జనసేన పార్టీ అధ్యక్షుడు సాయి కృష్ణ
- పోలవరం నిర్వాసితులు అందరికి న్యాయం జరగాలి ఎమ్మెల్యే కు వినతి పత్రాలు ఓందించుట



వి.ఆర్.పురం,మే6 వుదయం న్యూస్. వరరామచంద్రాపురం, మండలంలోని ప్రధాన సమస్యలను రంపచోడవరం నియోజకవర్గ శాసనసభ్యురాలు మిరియాల శిరీషా దేవికి వివరించానని జనసేన పార్టీ మండల అధ్యక్షులు ములకాల సాయికృష్ణ చెప్పారు. బుధవారం తమ నివాసానికి(స్వగృహానికి)సాదరంగా ఆహ్వానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండలంలో నెలకొన్న ప్రధాన సమస్యలు, పోలవరం నిర్వాసితులు పడుతున్న ఇబ్బందులు పరిష్కరించాలని కోరామని,కూటమి పార్టీకి సంబందించిన కొన్ని ముఖ్యమైన సమస్యలు తమ దృష్టికి తీసుకెళ్లామని అన్నారు. ముఖ్యంగా త్రాగునీటి సమస్యలు ,అన్నవరం వంతెన,రాబోవు వర్షాభావ పరిస్థితులు దృష్టిలో ఉంచుకొని ముందుకు వెళ్లేందుకు సహాకరించాలని విజ్ఞప్తి చేశామన్నారు. కల్మషంలేకుండా ప్రజాసేవచేస్తే ప్రజాభిమానం తప్పకుండా ఉంటుందని అన్నారు. రేఖపల్లి పి.హెచ్.సి,లో పిల్లలు డాక్టర్ ని ఏర్పాటు చేయాలని సూచించారు. పోలవరం నిర్వాసితుల సమస్యల పరిస్కారానికి మీవంతు సహాయ సహకారాలు అందించాలని, ఎవ్వరినీ నొప్పించకుండా పరిహారం, ఆర్అఆర్ ఇవ్వాలని కోరామన్నారు. ఈ సమస్యలు వివరించిన వారిలో జనసేన పార్టీ మండల కమిటీ సభ్యులు బాగుల ప్రమీల రాణి,బాగుల అంజన్ రావు,పెదపెట్ల పవన్ కళ్యాణ్, మాచర్ల వేణుబాబు, ముంజపు సాయిరాం,మాదిరెడ్డి శ్రీనివాస్, ముంజపు శ్రీరామ్,అల్లాడ శ్యామ్,కొత్తూరి శేష,ముత్యాల దుర్గాప్రసాద్, కూటమి నాయకులు తదితరులు హాజరయ్యారు.

# గిరిజనుల ఆచారాలు,అభివృద్ధి విధానాలకై ఆదివాసీ సంఘం సహకారాలు





వి ఆర్ పురం మే 6 వుదయం న్యూస్.

కోయ తెగ ప్రజలు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా మరియు మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాలలో నివసించే అతిపెద్ద మరియు ప్రధాన గిరిజన తెగలలో ఒకటి. వీరు ప్రధానంగా ప్రకృతిని ఆరాధిస్తూ, అటవీ వనరులపై ఆధారపడి ప్రత్యేకమైన జీవన విధానాన్ని కొనసాగిస్తున్నారు. కోయ ట్రైబల్ జీవన విధానం యొక్క ముఖ్య అంశాలు:1. నివాసం మరియు సామాజిక నిర్మాణం:గూడెం జీవనం: గిరిజనులు సాధారణంగా అడవులకు సమీపంలో, కొండ ప్రాంతాల మధ్య 'గూడెం' అని పిలవబడే చిన్న చిన్న గ్రామాలలో నివసిస్తారు. తెగ నిర్మాణం: వీరు ముడవ గట్ట, నల్గవ గట్ట, ఐదోవ గట్ట, అరవ గట్ట, ఏడోవ గట్ట వంటి ఎక్సోగామస్ (సగోత్ర వివాహాలు లేని) ఫ్రాట్రీలుగా విభజించబడ్డారు. సామాజిక ఐక్యత: గిరిజనులలో సామాజిక ఐక్యత కట్టుబాటు ఎక్కువ. ప్రతి విషియాల్లో గ్రామ పెద్దలు నిర్ణయాలు తీసుకుంటారు. వీరు తమ సంస్కృతిని, వారసత్వాన్ని కాపాడుకోవడంలో గర్వపడతారు. 2. వృత్తి మరియు ఆర్థిక జీవనం:వ్యవసాయం: పూర్వం నుండి పోడు వ్యవసాయం చేసినా, ప్రస్తుతం చాలామంది స్థిర వ్యవసాయం (సెటైల్డ్ కల్తీవేషన్) చేస్తున్నారు. అప్పటిలో వీరి పంటలు జొన్న, రాగి, బాజ్రా మరియు ఇతర చిరుధాన్యాలను పండించేవారు. అలాగే వీరి జీవన విధానంలో అటవీ ఉత్పత్తులు: అడవి నుండి తేనె, ఇప్ప పువ్వు, దుంపలు, చీపుర్లు,అడవి పండ్లు,ఎదురు,కట్టెలు సేకరించి జీవనం కొనసాగిస్తారు. హస్తకళలు: వెదురుతో బుట్టలు, ఊతలు,చాపలు, వేట పరికరాలను తయారు చేయడంలో వీరు నిపుణ్యతలు కలిగిన వారు. 3. ఆహారపు అలవాట్లు:తాటి రసం (కల్లు): గిరిజనుల జీవితంలో తాటి రసం (ౘశీసంఎ) ప్రధాన పాత్ర పోషిస్తుంది. ఇది కేవలం పానీయం మాత్రమే కాదు, వారికి ఆహారంగా కూడా తమ ఇంటికి వచ్చిన వారికి విటిద్వారానే మర్యాదాలు చేసేవారు. ఈ కల్లు వారి రాజల మధ్య మంచి చెడ్డలకై ఉపయోగపడుతుంది. స్థానిక ఆహారం: అడవిలో దొరికే దుంపలు, ఆకులు (చెంచెలి, దొగ్గలి), అడవి జంతువుల మాంసాన్ని ఇష్టంగా తింటారు. 4. సంస్కృతి మరియు ఆచారాలు:మేడారం జాతర: గిరిజనుల అతిపెద్ద పండుగ మేడారం సమ్మక్క-సారలమ్మ జాతర. భూమి పండుగ,కులదేవతల పండుగలు. ఇది వారి ధైర్యం, తిరుగుబాటు మరియు ప్రకృతి ఆరాధనకు ప్రతీక. దృశ్య కళలు: కోయల నృత్యాలు, సంగీతం చాలా ప్రత్యేకమైనవి. పురుషులు దున్నపోతు కొమ్ములతో కూడిన టోపీలను ధరించి, నెమలి ఈకలతో అలంకరించుకుని గ్రామల్లో నృత్యం చేస్తారు. వివాహ వ్యవస్థ: వయస్సు వచ్చిన తర్వాతే వివాహాలు జరుగుతాయి. అప్పటిలో మేనరికం పెళ్లిళ్లు వీరిలో సాధారణం. 5. మతం మరియు మూఢ నమ్మకాలు:ఎజ్జతనం,మంత్రాలు,చేతబడులు,మెదలాగినవి. ప్రకృతి ఆరాధన: కోయలు ప్రకృతిని, ముఖ్యంగా "భూమాత"ను అత్యంత పవిత్రంగా ఆరాధిస్తారు. దేవతలు: ముత్యాలమ్మ, సమ్మక్క, సారలమ్మ వంటి దేవతలను గ్రామ దేవతలుగా పూజిస్తారు. గ్రామ పూజారులు ఆచారాలను నిర్వహిస్తారు. 6. కోయ భాష:కోయలు ద్రావిడ భాషా కుటుంబానికి చెందిన కోయ భాష ( మాట్లాడుతారు. దీనిని ఒరియా, తెలుగు లేదా దేవనాగరి లిపిలో రాస్తారు. ప్రస్తుత మార్పులు చూస్తే:ఆధునీకరణ, అడవుల నరికివేత మరియు ఇతర ప్రాంతాల నుండి వలసల వల్ల కోయల సాంప్రదాయ జీవన విధానంలో మార్పులు వస్తున్నాయి. అన్ని గిరిజన ప్రాంతాల్లో విద్య, వైద్య ,ఉద్యోగం లాంటి సదుపాయాలు మెరుగుపడుతున్నప్పటికీ, తమ ప్రత్యేక సాంస్కృతిక గుర్తింపును కాపాడుకోవడానికి వారు కృషి చేస్తున్నారు. ఇప్పటికే గిరిజనులు అనేక విధాలుగా అభివృద్ధి పొందుచు ప్రపంచంలో ఉన్నత స్థాయికి చేరినవారు లేకపోలేదు. ప్రస్తుతం కోఇత్తోరు బాట ద్వారా అక్షర అభ్యాసం పొందుతున్నరు. ఆదివాసీ సంఘాల ద్వారా గిరిజన ప్రజలను తమ హక్కులు తెలియ చేస్తూ అన్ని విధాలా అభివృద్ధి బాటలోకి కొనసాగితున్నారు అంటూ ఆదివాసీ సంఘాలు వివరిస్తున్నాయి.

# ఆత్మీయ సమ్మేళనంలో గాంధి బాబుకు ఘన సన్మానం

- గాంధి బాబు బాలల హక్కుల పరిరక్షణకు చేసిన సేవలు అమోఘం
- బాలల కోసం చేసిన కృషికి గుర్తింపు ఇచ్చిన ప్రభుత్వం
- బేధాలు లేకుండా ఆర్థిక సహకారాలు అందించిన గాంధిబాబు.



వి ఆర్ పురం, మే 6: వుదయం న్యూస్. పోలవరం జిల్లా వి ఆర్ పురం మండలం రేఖపల్లి లో ఉన్నా ఏ ఎస్ డి ఎస్ సంస్థ డైరెక్టర్ ఉండవల్లి గాంధిబాబు చేసిన ఎన్నో అద్భుతమైన సహాయ కార్యక్రమాలు గిర్తించి రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు గాంధిబాబు ను అభినందించారు. చేసిన పనులకు ప్రతిగా ఎన్నో ప్రశంస పత్రాలు అవార్డులు ఇవ్వటమే కాకుండా బాలల హక్కుల కమీషన్ సభ్యుడిగా ప్రభుత్వం మరోసారి నియమించింది. గాంధి బాబును ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు, పేరాబత్తుల రాజశేఖర్ ఎమ్మెల్సీలు ఆత్మీయ సమ్మేళనంలో సన్మానించారు. బాలల కోసం చేసిన కృషికి గుర్తింపు ఇచ్చిన ఈ సందర్భంలో మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ, "గాంధి బాబు బాలల హక్కుల పరిరక్షణకు చేసిన సేవలు అమోఘం. ప్రభుత్వం ఈ సేవలను మరింత బలోపేతం చేస్తుంది" అని అన్నారు. ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు, "బాలల సంక్షేమంలో గాంధి బాబు అందరికీ ఆదర్శం'' అంటూ పేర్కొన్నారు. ప్రభుత్వం గాంధి బాబును బాలల హక్కుల కమీషన్ సభ్యుడిగా మళ్లీ నియమించడం బాలల సంక్షేమ కార్యక్రమాలకు మరింత ప్రోత్సాహం లభిస్తుంది వారి నాయకత్వంలో బాలలు సురక్షితంగా ఉంటారని ఏలాంటి సమస్యలు రాకుండా ముందుగానే జాగ్రత్తలు తీసుకుంటారని సంస్థ డైరెక్టర్ గాంధిబాబు ను కొనియాడారు.

## మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్ రావుని సన్మానించిన మున్సిపల్ చైర్మన్ సీఎం సురేష్



అయిజ మే 06 (వుదయం ప్రతినిధి)జోగులాంబ గద్వాల జిల్లా అయిజ మున్సిపాలిటీ నూతన కమిషనర్‌గా వచ్చిన చంద్రశేఖర్ రావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ సీఎం సురేష్ ని వారి ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చైర్మన్, కౌన్సిలర్లు కో-ఆప్షన్ సభ్యులతో కలిసి కమిషనర్ చంద్రశేఖర్ రావు ని సన్మానించారు. అనంతరం కమిషనర్ కూడా చైర్మన్ ని సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అయిజ పట్టణ అభివృద్ధి కోసం ఒకరికొకరు పూర్తి స్థాయిలో సహకరించుకుంటూ, అందరం కలిసికట్టుగా పని చేసి పట్టణ అభివృద్ధికి సహకరించుకుందామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తో పాటు బిఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు,
తదితరులు పాల్గొన్నారు.



## గజ్వేల్ లో పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో పెరుగన్నం పంపిణీ

గజ్వేల్, 06 మే 2026 : వుదయం

సిద్దిపేట జిల్లా గజ్వేల్ ఇందిరాపార్క్ చౌరస్తా వద్ద బుధవారం గజ్వేల్ ప్రభుత్వ పాఠశాలలో 1983 - 84 సంవత్సరంలో చదువుకున్న పదవ తరగతి పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో పెరుగన్నం పంపిణీ చేశారు ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులకు తోట బిక్షపతి, దూబకుంట లక్ష్మణ్, గందే రమేష్, ఎన్ సీ శ్రీనివాస్ లు మాట్లాడుతూ మానవసేవే మాధవసేవ అని 1983 - 84 లో పదవ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులం అందరం కలిసి గత మూడు సంవత్సరాల క్రితం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసుకోవడం జరిగిందని అందులో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తీసుకున్న నిర్ణయం మేరకు ప్రతి సంవత్సరం వేసవికాలంలో మజ్జిగ, అంబలి, పులిహోర ఇలా వివిధ కార్యక్రమాల నిర్వహించడం జరుగుతుందని, అందులో భాగంగా ఈ రోజు పెరుగన్నం పంపిణీ చేయడం జరిగింది పెరుగన్నం ఆరోగ్యానికి ఎంతో మంచిది అని ఈ కార్యక్రమానికి సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు, ఈ కార్యక్రమంలో , గంగిశెట్టి సుధాకర్, ఓబుల్, జగ్గయ్యగారి శ్రీనివాస్, గుంటుకు యాదగిరి, గౌరిశెట్టి శ్రీనివాస్, ఉప్పల వెంకటయ్య, దేశపతి శంకర్ శర్మ, దూలం వెంకటయ్య, భ్రమరాంబ, రత్నమాల, కృష్ణవేణి, శోభ, శ్రీకాంత్ రెడ్డి, దీనబంధు, వెంకట్ రెడ్డి,హరినాథ్, ధర్మారెడ్డిపల్లి శ్రీనివాస్, జ్ఞానేశ్వర్, నాగరాజు, నేతి శ్రీనివాస్, వేణుగోపాల్, నర్సింలు, రేణిగుంట శ్రీనివాస్, శ్రీనివాస్ రెడ్డి, పెద్ది శ్రీనివాస్, చేతిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, రాందాస్ గౌడ్, భూషణం, తదితరులు పాల్గొన్నారు

## జిల్లా వాసులకు దక్కిన నామినేటెడ్ పదవులు



గద్వాల మే 06(వుదయం ప్రతినిధి):తెలంగాణ రాష్ట్రంలో పలు నామినేటెడ్ పోస్టుల భర్తీకి రేవంత్ రెడ్డి సర్కార్ శ్రీకారం చుట్టింది. ఈ నేపథ్యంలో బుధవారం 17 కార్పొరేషన్లకు చైర్మన్లతోపాటు వైస్ చైర్మన్లను నియమించింది. తెలంగాణలో నామినేటెడ్ పదవులను భర్తీ చేశారు. జోగులంబ గద్వాల జిల్లాకు రెండు పదవులు వరించాయి. గొర్రెలు, మేకల అభివృద్ధి సహకార ఫెడరేషన్ చైర్మన్‌గా సరిత తిరుపతయ్యవాల్మీకి బోయ సహకార కార్పొరేషన్ ఛైర్మన్ గా గట్టు తిమ్మప్పలను జోగులాంబ గద్వాల జిల్లాకు చెందిన వారిని నియమించింది. జిల్లా వాసులకు రెండు నామినేటెడ్ పదవులు దక్కినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి,

## శ్రీ తిమ్మప్ప స్వామిని సందర్శించుకున్న

### జిల్లా పరిశ్రమల శాఖ మేనేజర్ రామలింగేశ్వర గౌడ్

గద్వాల మే 06 (వుదయం ప్రతినిధి) జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండల కేంద్రంలో ని శ్రీ స్వయంభూ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయాన్ని జిల్లా పరిశ్రమల శాఖ మేనేజర్ రామలింగేశ్వర గౌడ్ సందర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ పట్వారి ప్రహ్లాద రావు దేవాలయ విశిష్టతను వివరించి స్వామివారి శేష వస్త్రాన్ని బహుకరించారు. పర్యాటక శాఖ అభివృద్ధిలో భాగంగా డిఎం శ్రీ తిమ్మప్ప స్వామి దేవాలయం తో పాటు చింతల ముని దేవాలయం సందర్శించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు.

## సభ విజయానికి సమన్వయంతో ముందుకు సాగాలి: కొండా విశ్వేశ్వర్ రెడ్డి



చేవెళ్ల,మే 06 (వుదయం)ఈ నెల 10న హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్లో నిర్వహించనున్న ప్రధాని నరేంద్ర మోదీ బహిరంగ సభ విజయవంతం కావడానికి కార్యకర్తలు సమన్వయంతో పని చేయాలని ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం చేవెళ్లలో నిర్వహించిన వాల్ పెయింటింగ్ ప్రచార కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ...కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఈ సభ ముఖ్య వేదికగా నిలుస్తుందని తెలిపారు. నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొనేలా గ్రామ, మండల స్థాయిలో విస్తృత ఏర్పాట్లు చేయాలని సూచించారు. సభకు భారీగా తరలిరావాలని ప్రజలకు విజ్ఞప్తి చేసిన ఆయన, పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేస్తే సభ విజయవంతమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాణిక్య రెడ్డి, శర్వలింగం, అనంత్ రెడ్డి, వైభవ్ రెడ్డి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.




## కాకర్ల ఆధ్వర్యంలో ఘనంగా ఎస్ఆర్ రెడ్డి జన్మదిన వేడుకలు

నారాయణపేట మే6(వుదయం ప్రతినిధి)నారాయణపేట మాజీ ఎమ్మెల్యే,బి ఆర్ ఎస్ జిల్లా అధ్యక్షుడు ఎస్.రాజేందర్ రెడ్డి జన్మదిన వేడుకలు మున్సిపల్ 3వ వార్డు కౌన్సిలర్ కాకర్ల నారాయణమ్మ భీమయ్య ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సింగర్ బేస్ ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎస్ ఆర్ రెడ్డి సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని మళ్ళీ ఎమ్మెల్యేగా గెలవాలని ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేసే అవకాశం కల్పించాలని ప్రార్థించారు. అనంతరం సింగర్ బేస్ తో పాటు మూడో వార్డు లో ప్రజలకు మిఠాయిలు పంపిణీ ,సాయంత్రం శిక్షణలో ఉన్న క్రీడాకారులకు పండ్లు పంపిణీ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ నాయకులు సుదర్శన్ రెడ్డి, చెన్నారెడ్డి,గురులింగప్ప ,కన్న జగదీష్ ,సఖి సూరి ,మహిళా నాయకులు పాల్గొన్నారు.

## గోవింద క్షేత్రానికి ఏ.సీ. బహూకరణ ?

***దాతృత్వం చాటుకున్న విద్యుత్ఉద్యోగి బి.దశరథం ...***



నాగర్ కర్నూల్ మే 06(వుదయం ప్రతినిధి)జిల్లా కేంద్రంలోని హౌసింగ్ బోర్డ్ కాలనీలో గల(గోవింద క్షేత్రం) శ్రీలక్ష్మి వెంకటేశ్వర స్వామి దేవాలయానికి హౌసింగ్ బోర్డ్ లోని వెంకటేశ్వర కాలనీ కమిటీ కార్యదర్శి విద్యుత్ శాఖ ఉద్యోగి బి.దశరథం,వరలక్ష్మి దంపతులు 1.5 టన్నుల ఎల్.జీ.ఏసీని దేవాలయానికి బుధవారం నాడు బహుకరించారు. 50 వేల రూపాయల విలువగల ఏసీని దేవాలయ కమిటీ కార్యదర్శి ఏం.నాగరాజు కోశాధికారి బాలరాజు,కమిటీ సభ్యులు లక్ష్మి నరసింహ గౌడ్,రమేష్, చారి, లక్ష్మా రెడ్డి,చిగుళ్ళపల్లి రమణకుమార్ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆలయ పూజారికి దేవాలయంలో అందజేశారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి,శాలువలు తీర్థ ప్రసాదం అందజేశారు. ఆలయ అభివృద్ధికి తోడ్పడుతున్న వారి కుటుంబానికి స్వామివారి కృపా కటాక్షాలు ఎల్లవేళలా ఉండాలని కోరారు.


ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర కాలనీ సభ్యులు,గోవింద క్షేత్ర కమిటీ సభ్యులు,భజన మండలి సభ్యులు,భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## సబ్ స్టేషన్లలో 3 వ ఆపరేటర్లు నియమించాలి

### తెలంగాణ రాష్ట్ర పవర్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర నాయకులు మరాఠీ కృష్ణమూర్తి

గజ్వేల్, 06 మే 2026 : వుదయంగజ్వేల్ డివిజన్ పరిధిలోని వివిధ సబ్ స్టేషన్లో పనిచేస్తున్న విధులు నిర్వహిస్తున్న ఆపరేటర్లు మర్కుక్, ములుగు, గుర్రాల సోప సబ్ స్టేషన్లలో ఇద్దరు ఆపరేటర్ల తో ఆర్టిజన్ కార్మికులతో విధులు నిర్వహిస్తున్నారు. గత రెండు నెలల నుంచి ఇద్దరు ఆర్టిజన్ కార్మికులు విధులు నిర్వహిస్తూ మానసిక ఆవేదన చెందుతున్నారని తెలంగాణ రాష్ట్ర పవర్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర నాయకులు మరాఠీ కృష్ణమూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం డివిజనల్ ఇంజనీర్ కార్యాలయంలో ఇద్దరు పని చేస్తున్న సమస్యలలో మూడో ఆపరేటర్ను నియమించాలని కోరుతూ డి ఇ కి సమర్పించారు సమర్పించారు. ఈ సందర్భంగా మరాటి కృష్ణమూర్తి మాట్లాడుతూ ఇద్దరు సబ్ స్టేషన్లలో పనిచేయడం వలన అటు కుటుంబాలకు మరియు ఎక్కువ రోజులు సమస్యలను వలన మానసిక ఒత్తిడి గురవుతున్నారని అన్నారు. గతంలో నాలుగో ఆపరేటర్ గా పనిచేసిన వారిని ఫీల్ లోకి తీసుకున్నారని వారిని వెంటనే సబ్ స్టేషన్ లో కాళీ ఉన్న చోట్ల ఫిల్ అప్ చేసి ఈ సమస్యకు పరిష్కారం చూపాలని డి ఈ గని కోరారు.

## వివాహ వేడుకల్లో పాల్గొన్న. జహీరాబాద్ ఎంపీ సురేష్ సెట్కార్



జహీరాబాద్ మే 6 (వుదయం ప్రతినిధి) జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ షెట్కర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు డాక్టర్ సిద్ధం ఉజ్వల్ రెడ్డి జహీరాబాద్ నియోజకవర్గం లో వివిధ శుభకార్యాలు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సీడీసీ ఛైర్మెన్ ముబిన్ మున్సిపల్ ఛైర్మెన్ యూనస్ న్యాల్కల్ మండల అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి జహీరాబాద్ మండల అధ్యక్షులు నర్సింహ రెడ్డి పట్టణ అధ్యక్షులు కండెం నర్సిములు భాస్కర్ రెడ్డి మున్సిపల్ కౌన్సిలర్స్ జంగీర్ జమీల్ అక్రమ్ అతిక్ అరుణ్ జాఫర్ జావేద్ నిజాం సినియర్ నాయకులు రాములు శ్రీకాంత్ రెడ్డి అశ్విన్ హఫీజ్ మహేందర్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు నాగి రెడ్డి హర్షవర్ధన్ రెడ్డి నథానియాల్ జహీర్ బబ్లూ నర్సిమ నాయకులు కార్యకర్తలు తదితరులు. పాల్గొని వదువరులను ఆశీర్వదించారు

# వైవిధ్యమైన సాగు రైతుకు సిరుల పండగు

- భిన్న పంటలు సాగు చేసి రైతులు ఆర్థికంగా ఎదగాలి
- రైతు సంక్షేమ వారోత్సవాల్లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్





గద్వాల మే 06(వుదయం ప్రతినిధి)రైతులు ఒకే పంటను కాకుండా భిన్న పంటలు సాగు చేస్తే ఆర్థికంగా ఎదగవచ్చని, ఆయిల్ పామ్ సాగుతో దీర్ఘకాలిక ప్రయోజనాలు ఉంటాయని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న రైతు సంక్షేమ వారోత్సవాల్లో బుధవారం గద్వాల పిఏసిఎస్ లో సహకార శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమం లో జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథి గా పాల్గొని మాట్లాడారు. వ్యవసాయ రంగం అభివృద్ధి చెందేందుకు సహకార సంఘాల కృషి ఎంతో ఉందని, రైతుల సంక్షేమానికి రుణాలు ఇవ్వడం, సబ్సిడీకి విత్తనాలు, ఎరువులు అందజేయడం జరుగుతుందన్నారు. కొద్ది రోజుల కిందట జిల్లాలోని రైతులకు కొరత లేకుండా యూరియాను సరఫరా చేయడంలో ఆయా మండలాల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు ప్రధాన పాత్ర పోషించాయని కొనియాడారు. జిల్లాలో ఆయిల్ పామ్ సాగును పెంచేందుకు ప్రతి పిఏసిఎస్ కు 100 ఎకరాల లక్ష్యాన్ని నిర్దేశించినందున సంఘాల సభ్యులు సాగు చేసేందుకు సహకరించాలన్నారు. ప్రతి నియోజకవర్గంలో ఆయిల్ పామ్ పంట సేకరణ కేంద్రాన్ని ఏర్పాటు చేసి కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. ఆయిల్ పామ్ పంటను మూడేళ్ల పాటు జాగ్రత్తగా పెంచితే దాదాపు 25 ఏళ్ల పాటు ఫలితాలు పొందవచ్చన్నారు. జిల్లాలోని గ్రౌండ్ వాటర్ నివేదికను ఇటీవల పరిశీలిస్తే నైట్రేట్ శాతం ఎక్కువగా ఉన్నట్లు తెలిసిందన్నారు. యూరియాను అవసరానికి మించి వాడడం వలన నీళ్లు కలుషితం అయ్యే ప్రమాదం ఉందని, రైతులు నానో యూరియాపై దృష్టి సారించాలని సూచించారు. భవిష్యత్తు తరాలను దృష్టిలో ఉంచుకొని నేలను కాపాడుకోవాలంటే ఆర్గానిక్ వ్యవసాయంపై దృష్టి సారించాలని పేర్కొన్నారు. జిల్లా పిఎండిడికేవై కు ఎంపికవడంతో రైతులు వ్యవసాయం, అనుబంధ రంగాల్లో చెప్పుకోదగ్గ ప్రగతి సాధించే అవకాశం ఉందన్నారు. సంప్రదాయ పంటలే కాక మిల్లెట్స్, ఉద్యాన తోటలపై, పశుపోషణపై దృష్టి సారిస్తే ఆర్థికంగా ఎదగవచ్చన్నారు. ప్రభుత్వం అన్నదాతల సంక్షేమానికి రుణమాఫీ, రైతు భరోసా, బీమా వంటి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. గద్వాల పిఏసిఎస్ ఉత్పత్తిదారుల సహకార సంఘంకు ఎంపికవడంతో ప్రభుత్వం నుంచి ప్రత్యేక నిధులు రూ.15 లక్షలు మంజూరవడంతో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా నేల ఆరోగ్యాన్ని కాపాడతామని అందరూ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, పిఏసిఎస్ చైర్మన్ సుభాన్, గద్వాల మున్సిపల్ వైస్ చైర్మన్ శంకర్, జిల్లా కోపరేటివ్ అధికారి శ్రీనివాస్, వ్యవసాయ శాఖ అధికారి వీరప్ప, ఎల్డిఎం శ్రీనివాస రావు, కోపరేటివ్ బ్యాంక్ మేనేజర్ ప్రదీప్ కుమార్, పిఏసిఎస్ సీఈవో వెంకటేశ్వర్ రెడ్డి, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

### దౌల్తాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో రైతు వారోత్సవాలు ఘనంగా నిర్వహణ





దౌల్తాబాద్ మే 06(వుదయం):ప్రజా పాలనలో భాగంగా రైతుల అభివృద్ధి లక్ష్యంగా దౌల్తాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో ప్రగతి ప్రణాళిక కింద రైతు వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. గ్రామీణ వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడం, రైతులకు ఆధునిక సాంకేతికతను చేరవేయడం లక్ష్యంగా ఈ కార్యక్రమాలు నిర్వహించబడినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి మార్కెట్ కమిటీ చైర్మన్ ఐలాపురం కనకయ్య యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై రైతులకు పలు కీలక అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పంటల సాగులో కొత్త పద్ధతులు అవలంబిస్తూ, దిగుబడులు పెంచుకునే దిశగా కృషి చేయాలని సూచించారు. పంటల ఎంపికలో మార్కెట్ డిమాండ్ను పరిగణనలోకి తీసుకుంటే మెరుగైన ధరలు లభిస్తాయని తెలిపారు. రైతులు తమ ఉత్పత్తులను నేరుగా మార్కెట్ యార్డులకు తీసుకురావడం ద్వారా మధ్యవర్తులను తగ్గించుకుని, న్యాయమైన ధరలు పొందవచ్చని చెప్పారు. అలాగే గిడ్డంగి సౌకర్యాలు, తేమ పరీక్షలు, నాణ్యత ప్రమాణాలు వంటి అంశాలపై కూడా వివరించారు. వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు పలు పథకాలపై అవగాహన కల్పిస్తూ, పీఎం కిసాన్, రైతు బంధు, పంట బీమా వంటి ప్రభుత్వ పథకాల ప్రాముఖ్యతను వివరించారు. సహకార బ్యాంకులు, డీసీసీబీ, టీజీవీబీ ద్వారా అందించే పంట రుణాలు, సబ్సిడీ రుణాలపై వివరాలు అందించారు. అదనంగా, సేంద్రీయ వ్యవసాయం, నీటి సంరక్షణ పద్ధతులు, మైక్రో ఇరిగేషన్ (డ్రిప్, స్ప్రింక్లర్) వినియోగం, మట్టి పరీక్షల ప్రాముఖ్యతపై ప్రత్యేకంగా చర్చించారు. రైతులు మట్టి పరీక్షలు చేయించుకుని పంటలకు సరైన ఎరువులు వినియోగిస్తే ఖర్చులు తగ్గి దిగుబడులు పెరుగుతాయని సూచించారు. ఈ సందర్భంగా బ్యాంకు అధికారులు పంట రుణాల సకాల చెల్లింపుల ప్రాముఖ్యతను వివరించారు. రైతులు తీసుకున్న రుణాలను సమయానికి చెల్లిస్తే తక్కువ వడ్డీ రేట్లు, వడ్డీ సబ్సిడీలు, భవిష్యత్తులో అధిక రుణ పరిమితి వంటి లాభాలు పొందవచ్చని తెలిపారు. అలాగే బ్యాంకుల విశ్వాసం పెరిగి, అవసరమైనప్పుడు సులభంగా కొత్త రుణాలు పొందే అవకాశం ఉంటుందని చెప్పారు. ఇదే సమయంలో రుణాలను ఆలస్యంగా చెల్లిస్తే పెనాల్టీ వడ్డీలు పడటం, రుణభారం పెరగడం, తద్వారా ఆర్థిక ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉందని హెచ్చరించారు. బ్యాంకుల వద్ద నమ్మకం తగ్గిపోవడంతో భవిష్యత్తులో రుణాలు పొందడంలో సమస్యలు ఎదురవుతాయని వివరించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ముచ్చుమర్రి అనురాధ రమేష్ మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వ సహాయం పూర్తిగా అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రైతుల సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించేందుకు అధికారులు కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఎంసీ కార్యదర్శి సుగ్రీవ్, వ్యవసాయాధికారులు సాయికిరణ్, నరేష్, ఎంపీఎం మహిపాల్, పాక్స్ కార్యదర్శి మల్లేశం, డీసీసీబీ బ్యాంకు మేనేజర్ ఎల్లయ్య, టీజీవీబీ ఫీల్డ్ ఆఫీసర్ ప్రశాంత్ తదితరులు పాల్గొని రైతులకు సూచనలు అందించారు. పెద్ద సంఖ్యలో రైతులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం,

***రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోలు ప్రక్రియ నిర్వహించాలి,***
***రైతుల ఖాతాల్లో చెల్లింపులు త్వరితగతిన జమ చేయాలి,***
***ఎంపీ డాక్టర్ మల్లు రవి, జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్,***
***ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి,***

నాగర్ కర్నూల్ మే 06 (వుదయం ప్రతినిధి)జిల్లా కేంద్రంలోని నెల్లికొండి మార్కెట్ యార్డ్లో వరి, మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియను బుధవారం నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి, జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్, నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి లు కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మార్కెట్ యార్డ్లో కొనసాగుతున్న మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియను దగ్గరగా పరిశీలించి, రైతులతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి సమస్యలు, గన్ని బ్యాగుల సేకరణ, తూకం తదితర అంశాలపై రైతులు, అధికారులతో ఆరా తీశారు. తిమ్మసానిపల్లి గ్రామానికి చెందిన రైతులు రాముతో ఎంపీ ప్రత్యక్షంగా ఫోన్లో మాట్లాడి రైతు తన పొలంలో ఇంత మొక్కజొన్న పంట పండించారు ఎంత దిగుబడి వచ్చింది కొనుగోలు ప్రక్రియ ఎలా జరిగింది అనే అంశంపై రైతుతో ప్రత్యక్షంగా ఆరా తీశారు. ధాన్యం తూకం, తేమ శాతం కొలతలు, రికార్డు నమోదు విధానం వంటి అంశాలను సవివరంగా పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల్లో ఎటువంటి అవకతవకలు చోటుచేసుకోకుండా పర్యవేక్షణను మరింత కట్టుదిట్టం చేయాలని మార్క్ ఫైడ్ అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ మల్లు రవి మాట్లాడుతూ..., రైతులకు రైతు ప్రజా ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధర (మీస్రా) పూర్తి స్థాయిలో అందేలా చర్యలు తీసుకోవడం అత్యంత ముఖ్యమని ఆయన తెలిపారు. రైతులు తమ పంటను మార్కెట్ యార్డ్కు తీసుకువచ్చిన వెంటనే టోకెన్ల ఆధారంగా నమోదు చేసి, ఆలస్యం లేకుండా కొనుగోలు ప్రక్రియ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రైతులకు అనవసరమైన వేచిచూపులు లేకుండా పారదర్శకంగా వ్యవహరించాలని ఎంపీ స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల నుండి ప్రతి గింజ కొనుగోలు చేస్తుందని రైతులు ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఎంపీ సందర్భంగా కోరారు. అదేవిధంగా, కొనుగోలు అనంతరం రైతుల బ్యాంక్ ఖాతాల్లో చెల్లింపులు త్వరితగతిన జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ మాట్లాడుతూ.....,మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా చేసేందుకు జిల్లా యంత్రాంగం పటిష్ట చర్యలు తీసుకుంటుందని కలెక్టర్ వెల్లడించారు. గన్ని సంచుల కొరతను తీర్చే విధంగా నేరుగా రైతుల నుండే గన్ని సంచులు తీసుకొని గని సంచులకు అవసరమైన రేటు నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేయడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. మార్కెట్ యార్డ్ పరిధిలో త్రాగునీరు, నీడ, విశ్రాంతి కోసం షెడ్లు, నిల్వ గోదాములు, రవాణా సౌకర్యాలు వంటి మౌలిక వసతులను మరింత మెరుగుపరచాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు ప్రక్రియలు చేపట్టాల్సిన అంశాలను కలెక్టర్ అధికారులను స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. కొనుగోలు కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తిగా సిద్ధంగా ఉన్నాయని, రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. తేమ శాతం, నాణ్యత ప్రమాణాలను కచ్చితంగా పాటిస్తూ కొనుగోళ్లు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ సందర్శనలో రైతులు తమ సమస్యలను తెలియజేస్తూ తక్షణ పరిష్కారం కోరగా, సంబంధిత అధికారులు వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తామని కలెక్టర్ రైతులకు హామీ ఇచ్చారు. రైతులకు ఎలాంటి సమస్యలు వచ్చినా తన దృష్టికి నేరుగా తీసుకురావాలని ఎల్లవేళలా అందుబాటులో ఉంటాను కలెక్టర్ ఈ సందర్భంగా రైతులకు తెలిపారు. నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి మాట్లాడుతూ....,కొనుగోలు ప్రక్రియలో మధ్యవర్తుల జోక్యం లేకుండా పూర్తిగా పారదర్శక విధానంలో వ్యవహరించాలని అధికారులకు ఆయన స్పష్టం చేశారు. రైతులకు అనుకూల వాతావరణంలో, వేగవంతమైన, నిష్పాక్షికమైన కొనుగోలు ప్రక్రియను అమలు చేయడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ఆ విధంగానే క్షేత్రస్థాయి లో అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలో ప్రజా ప్రభుత్వం రైతు సంక్షేమానికి పెద్ద పీట వేస్తుందని, రైతులకు నష్టం కలిగించే ఏ విషయంపై ఉపేక్షించమని అధికారులకు ఎమ్మెల్యే స్పష్టం చేశారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు ప్రక్రియలు నిర్వహించాలని ఆయన కోరారు. రైతులు పలు సమస్యలను తీసుకురాగా వాటిని వెంటనే పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అవసరమైతే సిబ్బందిని పెంచుకొని రైతుల సమస్యలను పరిష్కరించాలని వారు అధికారులకు ఆదేశించారు.



## డాక్టర్ అవినాష్‌కు ఘన సన్మానం

కోహెడ, మే 6:(వుదయం ప్రతినిధి )కోహెడ మండల ఆర్.ఎం.పి, పీఎంపీ డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ప్రముఖ క్యాన్సర్ నిపుణుడు డాక్టర్ బస్వరాజు అవినాష్‌ను ఘనంగా సన్మానించారు. తీగలకుంటపల్లి గ్రామానికి చెందిన డాక్టర్ అవినాష్ ప్రస్తుతం పటాన్ చెరువులోని ప్రాచీన్ గ్లోబల్ హాస్పిటల్‌లో క్యాన్సర్ స్పెషలిస్ట్‌గా సేవలందిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్యాన్సర్ బాధితులకు సమయానికి చికిత్స అందించడం అత్యంత కీలకమని పేర్కొన్నారు. అలాగే ఆక్సిడెంట్ మరియు ఎమర్జెన్సీ కేసులకూ తక్షణ వైద్య సేవలు అందించేందుకు తాను ఎప్పుడూ సిద్ధంగా ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల డాక్టర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## రైతు సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట



దుబ్బాక, వుదయం (మే 06) : ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక రైతు వారోత్సవాల్లో భాగంగా దుబ్బాక వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొంగరి రవి, మార్కెట్ కమిటీ కార్యదర్శి సురేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వ్యవసాయ అనుబంధ బ్యాంక్ అధికారులతో పాటు వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రైతులు బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకొని ఆర్థిక అభివృద్ధి సాధించాలన్నారు. ఒకే రకమైన పంటను సాగు చేయకుండా పంట మార్పిడి విధానాన్ని అవలంబించాలని సూచించారు. ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని సబ్సిడీపై పరికరాలు అందించడంతోపాటు పంట రుణాలను అందిస్తుందని తెలిపారు. రాబోయే రోజుల్లో మార్కెట్లో డిమాండ్ ఉండే సన్నరకం వరి ధాన్యాన్ని రైతులు సాగు చేసి అధిక లాభాలు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ సిబ్బంది, బ్యాంక్ అధికారులు, రైతులు పలువురు పాల్గొన్నారు.

## ఎల్మకన్య కోఆపరేటివ్ సొసైటీ పిఐసి కమిటీ చైర్మన్గా రవి గౌడ్ బాధ్యతలు

**-ఉత్తర్వులు జారీ చేసిన జిల్లా సహకార సంఘం కమిషనర్**
**-రైతులకు సేవలందించ దంతోనే మళ్లీ అవకాశం వచ్చింది**
**-పిఐసి కమిటీ చైర్మన్ రవిగౌడ్**



తాండూరువుదయం ప్రతినిధి మే 6 :- గత నాలుగు నెలల క్రితం 19 డిసెంబర్ 2025న రద్దైన పిఏసిఎస్ పాలక వర్గానికి మరో అవకాశం లభించింది. తాజాగా రాష్ట్ర సహకార సంఘం కమిషనర్ ద్వారా ఇది వరకు రద్దైన (పిఏసిఎస్ )ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కమిటీలకే పీఐసీ కమిటీలుగా బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా బుధవారం పిఐ సి కమిటీ చైర్మన్ గా రవీందర్ గౌడ్ బాధ్యతల స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో రైతులకు అందుబాటులో ఉండి సేవలందించడంతోనే మరోసారి ఈ అవకాశం వచ్చిందని గుర్తు చేశారు. ప్రస్తుతం పిఐసి కమిటీల నియమ నిబంధనల ప్రకారం సొసైటీని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు తన వంతు కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో పిఐసి కమిటీ సభ్యులు నర్సింహారెడ్డి, హనుమంత్ రెడ్డి, అమృతయ్య, పార్వతమ్మ, పెండ నర్సింలు, రాఘవేందర్,
వెంకట్ రాం రెడ్డి, పన్నిబాయి, అనంతమ్మ,సహకార సంఘం సీఈవో శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.






"* ప్రజాస్వామ్యంలో ఏ పార్టీకైనా తమకు నచ్చిన నిర్ణయం తీసుకునే హక్కు ఉంటుంది. డీఎంకే-కాంగ్రెస్ కలిసి చాలా ఎన్నికల్లో పనిచేశాయి, ఈసారి ఓటమి చవిచూశాం. కాంగ్రెస్ తన సొంత నిర్ణయం తీసుకుంది. దానిని మేం గౌరవిస్తాం. తమిళనాడులో మరో సెక్యులర్ పార్టీ రావడాన్ని మేం ఆహ్వానిస్తాం. దీనివల్ల డీఎంకేకు ఎలాంటి భయం లేదు. ఈ ఎన్నికల్లో డీఎంకే కేవలం 59 స్థానాలకు పరిమితం కావడం, స్వయంగా స్టాలిన్ కొలత్తూరులో ఓడిపోవడంపై పార్టీ కచ్చితంగా విశ్లేషణ చేసుకుంటుంది. ప్రజలు మార్పును కోరుకున్నారు, అది అంగీకరించవలసిన విషయమే.

* కణిమొళి, డీఎంకె ఎంపీ"

## వే'మన'పద్యం

ఇహపరంబులకును నిది సాధనంబని
వ్రాసి చదివి విన్నవారికెల్ల
మంగళంబు లొనరు మహిలోన నిది నిజము
విశ్వదాభిరామ! వినురవేమ



## సంపాదకీయం

# జాతీయతతో ముడి ముఖ్యం

ధక్షిణాది రాజకీయాలకు, సినిమాలకు ఏదో అవినాభావ సంబంధం ఉంది. తెరపై పౌరాణిక పాత్రల నుంచి నిజ జీవితంలో ఒక రక్షకుడు లేదా నాయకులమవుతామనే హామీల వరకు రాజకీయ రంగంలో అడుగిడిన నటులకు తొలుత నాటకీయ ఫలితాలే లభించడాన్ని విన్నాం, చూశాం. ఎంజీఆర్, జయలలిత, ఎన్టీ రామారావు, పవన్ కళ్యాణ్, నేడు, విజయ్ అందరూ కూడా రాజకీయంగా అద్భుతమైన ఆరంగ్రేటమే చేశారు. అయితే, రాజకీయ నాయకులుగా మారిన నటులందరూ శాశ్వత రాజకీయ విజయాన్ని అందుకున్నారనడం అతిశయోక్తే అవుతుంది. కొద్దిమంది మాత్రమే స్టార్‌డమ్‌ను నిలకడైన రాజకీయ అధికారంగా మార్చుకోగలిగారు. అటువంటి వారిలో రెండు పేర్లు మాత్రం ప్రముఖంగా నిలుస్తాయి. ఎం.జి. రామచంద్రన్ (ఎంజిఆర్) సంక్షేమ ఆధారిత రాజకీయ ఉద్యమాన్ని నిర్మించి, తమిళనాడు రూపురేఖలను మార్చారు. మరొక స్పష్టమైన ఉదాహరణ అయిన ఎన్.టి. రామారావు (ఎన్టీఆర్), తెలుగువారి ఆత్మగౌరవం, ప్రభుత్వ వ్యతిరేక భావనల వెల్లువపై తన పార్టీని స్థాపించిన వెంటనే అధికారాన్ని చేజిక్కించుకున్నారు. కానీ వీరిని మినహాయిస్తే, పరిస్థితి నిరాశాజనకంగా కనిపిస్తుంది. చిరంజీవి ప్రజాదరణను అధికారంగా మార్చుకోవడంలో విఫలమయ్యారు. కమల్ హాసన్ ఎన్నికల పరంగా నామమాత్రంగానే మిగిలిపోయారు. పవన్ కళ్యాణ్ నిర్ణయాత్మక విజయం సాధించడానికి తీవ్రంగా శ్రమించారు. విజయ్ ఆవిర్భావం రాజకీయాల్లో కేవలం మరో సెలబ్రిటీ ప్రయోగం మాత్రమే కాదు. అది అంతకంటే లోతైన, వ్యవస్థాగతమైన విషయాన్ని ప్రతిబింబిస్తుంది. ఇది అలసటను ప్రతిబింబిస్తుంది.కేవలం అధికార వ్యతిరేకత మాత్రమే కాదు, దశాబ్దాలుగా తమిళనాడుకు నిర్వచనం ఇచ్చిన ద్రావిడ రాజకీయాలనే ఆధిపత్య భావజాలం పట్ల ఉన్న విస్తృతమైన విరక్తిని ఇది సూచిస్తుంది. ఒక విషయం స్పష్టం . విజయ్ ఉదంతం కేవలం ఒక సినీ నటుడు రాజకీయాల్లోకి ప్రవేశించడం మాత్రమే కాదు. అలాగే, ఒక కొత్త పార్టీ పాత పార్టీని సవాలు చేయడం కూడా కాదు. ఇది ద్రావిడ రాజకీయాలకే పట్టిన అలసటకు సంబంధించినది. అదే అదే పునరావృతం కావడం, స్తబ్దత, రాజకీయ ఆలోచనా పరిధి సంకుచితం కావడం వల్ల పుట్టిన అలసట ఇది. దశాబ్దాలుగా, తమిళనాడు రాజకీయాలు ద్రావిడ గుర్తింపు, హిందీ వ్యతిరేకత, భారతదేశంలోని మిగతా ప్రాంతాల పట్ల ఒక విధమైన వ్యతిరేక వైఖరి చుట్టూ అల్లుకుని ఉన్నాయి. ఒక సామాజిక న్యాయ ఉద్యమంగా ప్రారంభమైనది ఒక రాజకీయ ఛాందసవాదంగా పరిణామం చెందింది. కాలక్రమేణా, ఆ ఛాందసవాదం ఒక అలవాటుగా గట్టిపడిపోయింది. రాజకీయాల్లో అలవాట్లు చివరికి అలసటను కలిగిస్తాయి. నేడు ద్రావిడ వాతావరణం కుప్పకూలడం లేదు, అది అలసిపోతోంది. సైద్ధాంతిక పదును ఊహించదగిన మాటలుగా మారి మొద్దుబారిపోయింది. పరిపాలన, పనితీరు బాగున్నప్పటికీ, ఇకపై స్ఫూర్తినివ్వడం లేదు. ఈ నేపథ్యంలోనే విజయ్ రంగప్రవేశం జరిగింది. ఇప్పుడు ప్రశ్న విజయ్ ఈ అలసటను అధిగమిస్తాడా, లేదా అన్నదే. చరిత్ర అందిస్తున్న తాజా ఉదాహరణలను విజయ్ గమనించాల్సిన అవసరం ఉంది. పశ్చిమ బెంగాల్‌లో వామపక్ష ఆధిపత్యానికి సవాలుగా నిలిచి, మార్పు తెస్తానని వాగ్దానం చేస్తూ మమతా బెనర్జీ ఎదిగారు. కానీ అధికారంలోకి వచ్చాక, ఆమె పాత నమూనాను కూల్చివేయకపోగా, దాన్నే పునరావృతం చేశారు. వ్యవస్థ రూపు మార్చుకుంది కానీ దాని స్వభావాన్ని కాదు. విజయ్ తప్పించుకోవలసిన ఉచ్చు ఇది. ఎందుకంటే ఆ ప్రలోభం చాలా బలంగా ఉంటుంది. చారిత్రాత్మకంగా నిలవాలంటే, ఆయన మరింత కష్టమైన పని చేయాలి: ఈ చక్రాన్ని కొనసాగించకుండా, దానికి ముగింపు పలకాలి. అంటే కేవలం ద్రావిడ రాజకీయాలను మాత్రమే కాదు, ఇప్పుడు వేర్పాటువాద అలసటను కూడా అధిగమించాలి. భాషాపరమైన, ప్రాంతీయ అభద్రతలను నిరంతరం ప్రస్తావించడం, హిందీ వ్యతిరేక కథనాలను అతిగా ఉపయోగించడం, భారతీయ గుర్తింపుకు వ్యతిరేకంగా తమిళ గుర్తింపును చిత్రీకరించడం వంటివి వేగంగా మారుతున్న భారతదేశంలో క్రమంగా ప్రాధాన్యాన్ని కోల్పోతున్నాయి. నూతన తమిళ ఓటరు తన గుర్తింపును విడనాడటం లేదు, కానీ దానితో పాటు ఆకాంక్షలు ఎక్కువగా ఉంటున్నాయి. పరిశ్రమలు, వృద్ధి, ప్రపంచ స్థాయి అనుసంధానం అవసరం. విజయ్ ఏ జాతీయ కూటమిలోనూ భాగం కానవసరం లేదు. కానీ ఆయన నిరంతరం శత్రుత్వంలో కూడా ఉండకూడదు. తమిళనాడు అభివృద్ధి జాతీయ వృద్ధితో ముడిపడి ఉంది. మౌలిక సదుపాయాలు, పెట్టుబడులు, తయారీ రంగం, ప్రపంచ సరఫరా గొలుసులు, వీటన్నింటికీ న్యూఢిల్లీతో సమన్వయం అవసరం. భారత రాజకీయ చరిత్ర చూస్తే, స్టార్‌డమ్ అవకాశాల తలుపులు తెరుస్తుందని తెలుస్తుంది. కానీ ఆ తలుపుల గుండా ఎవరు నడుస్తారో నిర్మాణం, సిద్ధాంతం, స్పష్టత నిర్ణయిస్తాయి. ఎన్టీఆర్ స్టార్ అయినందువల్ల విజయం సాధించలేదు, కానీ ఆయన భావోద్వేగాన్ని సంస్థాగతంగా, గుర్తింపును రాజకీయ ఊపుగా మార్చడం వల్ల విజయం సాధించారు. చాలామంది ప్రజాదరణతోనే ఆగిపోయి విఫలమయ్యారు. విజయ్ కూడా సరిగ్గా అదే సంధిస్థానంలో నిలబడి ఉన్నారు.



## రచనలు పంపండి

వుదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను, సంపాదక లేఖలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.

voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020

# నేపాల్ ప్రజల మౌలిక సమస్యలు : బాలేంద్ర షా ప్రభుత్వ వైఖరి !

నేపాల్ లో కే పీ శర్మ ఓలీ ప్రజా వ్యతిరేక విధానాలు, అవినీతి వెడల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఏర్పడింది. ఓలీ పాలనలో ఉపాధి లేమి, నిరుద్యోగం వల్ల యువతలో తీవ్ర అసంతృప్తి ఏర్పడింది. ఉపాధి లేమితో సతమతమవుతున్న యువతలో తిరుగుబాటు ఆలోచన మొదలైంది. జెన్ జెడ్ పేరు తో కేపీ శర్మ ఓలీ ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ యువత ప్రదర్శనలు చేపట్టారు. ప్రభుత్వం నిర్బంధాన్ని ప్రయోగించినా ప్రదర్శనలు తీవ్రమైనాయి. ప్రభుత్వం ఉద్యమకారులపై జరిపిన కాల్పుల్లో 19 మంది మరణించారు. జెన్ జెడ్ ఉద్యమ కారులకు దేశ మౌలిక సమస్యల వెడల అవగాహన లేదు. యువత ఆందోళన ప్రధాని, మంత్రుల ఇళ్ల ముట్టడి రూపం తీసుకోవడంతో చివరికి ఓలీ ప్రభుత్వం రాజీనామా చేసింది. ఆ తర్వాత మార్చి 5- 2026లో జరిగిన ఎన్నికల్లో జెన్ జడ్ మూ మెంట్ / ప్రొటెస్ట్స్ పేరుతో ఎన్నికల్లో పాల్గొన్న యువత విజయం సాధించారు. మార్చి 27న బాలేంద్ర షా ప్రధానిగా ప్రభుత్వం ఏర్పడింది. బాలేంద్ర షా ప్రభుత్వం ప్రజల మౌలిక సమస్యలను ఎలా పరిష్కరిస్తుందో చెప్ప లేదు. మౌలిక సమస్యల వెడల ప్రభుత్వానికి అవగాహన లేదని అది తెలియ చేస్తున్నది.

ఉపాధి- నిరుద్యోగం: నేపాల్ ప్రజలు తీవ్రమైన ఉపాధి లేమి సమస్యలను ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా ఈ సమస్య యువతను వెంటాడుతోంది. 2025-26 సంవత్సరాల్లో నిరుద్యోగ రేటు 20 శాతం కన్నా ఎక్కువగా ఉంది. దేశ జనాభాలో 79% ప్రజలు గ్రామీణ ప్రాంతంలో నివసిస్తున్నారు. వీరిలో నిరుద్యోగం 24.66% గా ఉంది. దేశంలో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లేక పోవడం వల్ల ప్రతి రోజు వేలాది మంది యువత గల్ఫ్ దేశాలకు మరియు మలేసియా, భారతదేశాలకు వలసలు పోతున్నారు. నేపాల్ ఆర్థిక వ్యవస్థకు వలస ప్రజలు పంపే డబ్బులు, ఆ దేశ జీ డీ పీ లో 1/3 ( మూడవ వంతు) ఉందంటే వలసల తీవ్రత తెలుపుతున్నది. వలస వెళ్లిన వారు అనధికార లేదా అసంఘటిత రంగంలో పని చేస్తూ శ్రమ దోపిడీకి గురౌతున్నారు. విద్యా వ్యవస్థ కు, పరిశ్రమల అవసరాలకు మధ్య సమన్వయం లేక పోవడం వల్ల చాలా మంది పట్ల భద్రులు ఉద్యోగాలు పొంద లేక పోతున్నారు. ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లేక యువత నిరాశ, నిస్పృహ లో జీవిస్తున్నారు .

**భూమి సమస్య:** నేపాల్ ప్రజలు ఎదుర్కొంటున్న మౌలిక సమస్యలు, సాగు భూమి, ఉపాధి, నిరుద్యోగం,పేదరికం. ఈ సమస్యలు పరిష్కారం కాకుండా దేశాభివృద్ధి ముందుకు సాగదు. నేపాల్ వ్యవసాయిక దేశం. దేశం లోని 62% కుటుంబాలు, వ్యవసాయంపై ఆధారపడి ఉన్నాయి.2021-22 లెక్కల ప్రకారం దేశ జనాభాలో 77% వ్యవసాయం మీద ఆధారపడి జీవిస్తున్నారు. వ్యవసాయ గణాంకాల ప్రకారం సుమారు 2.89 మిలియన్ల రైతు కుటుంబాలు 12 లక్షల హెక్టార్ల భూమికి సాగు నీటి సౌకర్యం పొందారు. సాగు నీరు అందే భూమి చాలా తక్కువ. జల వనరులు అపారంగా ఉన్నా అత్యధిక భూములకు నీటి సౌకర్యం లేక పోవడానికి కారణం ప్రాజెక్టుల నిర్మాణం చేయకపోవడమే. నేపాల్ సగటు కుటుంబ భూమి విస్తీర్ణం 0.54 హెక్టార్లు . పెద్ద రైతుల వద్ద 5 హెక్టార్ల పైగా ఉంది . అసలు భూమి లేని కుటుంబాల సంఖ్య 12,13,812 గా తాజా కమిషన్ నివేదిక డేటా తెలియ చేస్తున్నది. భూ కేంద్రీకరణ పెద్ద ఎత్తున లేక పోయినా, నేపాల్ భౌగోళిక పరిస్థితుల్లో అది ఎక్కువగానే గుర్తించాలి. భూమి వ్యత్యాసాలు సామాజిక, ఆర్థిక అసమానతలకు దారి తీసింది. ప్రభుత్వాల భూ సంస్కరణల చట్టాలు, ఆచరణ లో అమలు జరగలేదు. భూ సమస్య నేపాల్ ప్రజల ముఖ్యమైన మౌలిక సమస్యగా నేటికీ ఉంది. ఇది పరిష్కారం కావాలి.

ఉపాధి- నిరుద్యోగం: నేపాల్ ప్రజలు తీవ్రమైన ఉపాధి లేమి సమస్యలను ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా ఈ సమస్య యువతను వెంటాడుతోంది. 2025-26 సంవత్సరాల్లో నిరుద్యోగ రేటు 20 శాతం కన్నా ఎక్కువగా ఉంది. దేశ జనాభాలో 79% ప్రజలు గ్రామీణ ప్రాంతంలో నివసిస్తున్నారు. వీరిలో నిరుద్యోగం 24.66% గా ఉంది. దేశంలో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లేక పోవడం వల్ల ప్రతి రోజు వేలాది మంది యువత గల్ఫ్ దేశాలకు మరియు మలేసియా, భారతదేశాలకు వలసలు పోతున్నారు. నేపాల్ ఆర్థిక వ్యవస్థకు వలస ప్రజలు పంపే డబ్బులు, ఆ దేశ జీ డీ పీ లో 1/3 ( మూడవ వంతు) ఉందంటే వలసల తీవ్రత తెలుపుతున్నది. వలస వెళ్లిన వారు అనధికార లేదా అసంఘటిత రంగంలో పని చేస్తూ శ్రమ దోపిడీకి గురౌతున్నారు. విద్యా వ్యవస్థకు, పరిశ్రమల అవసరాలకు మధ్య సమన్వయం లేక పోవడం వల్ల చాలా మంది పట్ల భద్రులు ఉద్యోగాలు పొంద లేక పోతున్నారు. ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లేక యువత నిరాశ, నిస్పృహ లో జీవిస్తున్నారు .

సంపద వ్యత్యాసాలు: నేపాల్ లో పేద, ధనిక వ్యత్యాసాలు తీవ్రంగా ఉన్నాయి. దేశ జనాభాలో 10% గా ఉన్న ధనిక కుటుంబాలు జాతీయ సంపదలో 39.1% సంపద కలిగి ఉంటే , దిగువ అత్యల్పంగా ఉన్న 10% ప్రజల వద్ద 2.6% సంపద మాత్రమే ఉంది. ఇది ఆ దేశంలో ఆర్థిక వ్యత్యాసాలకు అద్దం పడుతున్నది. పేదరిక తీవ్రతను తెలియ చేస్తున్నది. నేపాల్ లో ఉన్న సహజ వనరులు: ఈ దేశంలో అపారంగా సహజ వనరులు ఉన్నాయి. ఇనుప ఖనిజం, రాగి, జింక్, కో బాల్ట్, బంగారం లాంటి లోహాలు ఉన్నాయి. ఇవి కాకుండా సున్నపు రాయి, మాగ్నసైట్, మార్బుల్ , గార్నెట్ మరియు టూర్మాలిన్, క్వార్ట్జ్ మొదలైన రత్నాల నిల్వలు ఉన్నాయి. వీటిని దేశ ప్రయోజనాలకు ఉపయోగించే విధానాలు అమలు జరపడంలో దేశ పాలకులు విఫలం అయ్యారు. అంతే కాకుండా ఖనిజ సంపద మరియు మైనింగ్ రంగాన్ని ప్రైవేటీకరించడం అనేది ఆ దేశ ఆర్థిక సంస్కరణల్లో అనేక మార్పులు తెచ్చింది. ప్రపంచ వ్యాపితంగా ఆర్థిక సరళీకరణ విధానాల్లో భాగంగా, నేపాల్ లో కూడా పాలకులు ఆ విధానాలు అమలు జరిపారు. .1990ల నుండి ప్రభుత్వ రంగ సంస్థలను, ప్రైవేట్ రంగానికి అప్పగించడం ప్రారంభం అయ్యింది. నేపాల్ లోని అన్ని ఖనిజ వనరు ప్రభుత్వ యాజమాన్యంలోనే ఉన్నా, ప్రైవేట్ కంపెనీలకు ఖనిజాలను వెలికి తీసే హక్కును ( లైసెన్స్ లు) ప్రభుత్వాలు కల్పించాయి. అందు కోసం మైనింగ్ నియంత్రణ 1985 నాటి గనుల చట్టం (1993లో ఇది సవరించబడింది) మరియు 1999 నాటి గనుల మరియు ఖనిజాల నియమాలు ( 2003,2015,2016 లో సంస్కరించబడ్డాయి) ద్వారా జరుగుతున్నది. జనక్ పూర్ సిగరెట్ ఫ్యాక్టరీ, గౌరఖాలీ రబ్బరు పరిశ్రమ, ఉదయపూర్ సిమెంట్, హే టౌ డా సిమెంట్ కంపెనీ వంటి ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ ప్రక్రియ చేపట్టింది. 2025-26 సంవత్సరం నాటికి సుమారు 40 ట్రిలియన్ నేపాలి రూపాయల విలువైన రాయి మరియు ఇతర ఖనిజ నిక్షేపాలు దేశం కలిగి ఉంది.



విదేశాల పెట్టుబడులు: నేపాల్ ఆర్థిక వ్యవస్థలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల, విదేశీ కంపెనీల ప్రభావం పెరుగుతూ ఉంది. విదేశీ పెట్టుబడుల్లో 59.7% పారిశ్రామిక రంగంలో ఉంటే, 30% జల విద్యుత్ ప్రాజెక్టుల్లో, 29.4% తయారీ రంగంలో ఉన్నాయి. నేపాల్ లో 58 దేశాలకు పెట్టుబడులు పెడుతున్నాయి. ముఖ్యంగా భారతదేశం, చైనా, యూరప్ దేశాల నుంచి పెట్టుబడులు ఎక్కువగా ఉన్నాయి. పెట్టుబడుల కోసం నేపాల్ పాలకులు 100% విదేశీ యాజమాన్యానికి అనుమతి ఇస్తున్నారు. వచ్చే లాభాలను ఎటువంటి ట్యాక్స్ లేకుండా వారి స్వదేశాలకు తరలించుకుపోయే అవకాశం కల్పించింది. ఆ విధంగా నేపాల్ పాలకులు విదేశీ పెట్టుబడిదారుల ప్రయోజనాల కాపాడుతూ వస్తున్నారు. ఫలితంగా విదేశీ పెట్టుబడిదారుల ఆధిపత్యం నేపాల్ లో కొనసాగుతూ ఉంది.

విదేశాల పెట్టుబడులు: నేపాల్ ఆర్థిక వ్యవస్థలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల, విదేశీ కంపెనీల ప్రభావం పెరుగుతూ ఉంది. విదేశీ పెట్టుబడుల్లో 59.7% పారిశ్రామిక రంగంలో ఉంటే, 30% జల విద్యుత్ ప్రాజెక్టుల్లో, 29.4% తయారీ రంగంలో ఉన్నాయి. నేపాల్ లో 58 దేశాలకు పెట్టుబడులు పెడుతున్నాయి. ముఖ్యంగా భారతదేశం, చైనా, యూరప్ దేశాల నుంచి పెట్టుబడులు ఎక్కువగా ఉన్నాయి. పెట్టుబడుల కోసం నేపాల్ పాలకులు 100% విదేశీ యాజమాన్యానికి అనుమతి ఇస్తున్నారు. వచ్చే లాభాలను ఎటువంటి ట్యాక్స్ లేకుండా వారి స్వదేశాలకు తరలించుకుపోయే అవకాశం కల్పించింది. ఆ విధంగా నేపాల్ పాలకులు విదేశీ పెట్టుబడి దారుల ప్రయోజనాల కాపాడుతూ వస్తున్నారు. ఫలితంగా విదేశీ పెట్టుబడిదారుల ఆధిపత్యం నేపాల్ లో కొనసాగుతూ ఉంది.

డెన్మార్క్, యూరోపియన్ యూనియన్, చైనా వంటి దేశాల బహుళజాతి సంస్థలు నేపాల్ సహజ వనరుల పట్ల దశాబ్దాలుగా కన్ను వేశాయి. కోకా కోలా, పెప్సి, వెస్టర్న్ యూనియన్, హయత్, రాడిసన్, మరియట్ వంటి అనేక అంతర్జాతీయ బ్రాండ్లు నేపాల్ లో పని చేస్తున్నాయి. వీటి స్థానిక విభాగాలను నేపాల్ వ్యాపార వేత్తలు లేదా మేనేజింగ్ డైరెక్టర్లు నిర్వహిస్తారు. ఈ సంస్థలు నేపాల్ లో వ్యాపారాలు చేస్తూ లాభాలు తరలించుకుపోతున్నాయి. నేపాల్ లో బిశాల్ బజార్ కంపెనీ లిమిటెడ్, నేపాల్ రే ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ అత్యంత పెద్ద కార్పొరేట్ సంస్థలు. నేపాల్ కి చెందిన బినోద్ చౌదరి 1.7 బిలియన్ల డాలర్లతో దేశంలోనే సంపన్నుడిగా ఉన్నాడు. చౌదరి గ్రూప్ చైర్మన్ గా అనేక అంతర్జాతీయ బాండ్లతో ఆయన భాగస్వామ్యం కలిగి ఉన్నాడు. నేపాల్ దేశ అతిపెద్ద బహుళజాతి సంస్థ ఇది.

జన్ జెడ్ మూమెంట్ ప్రొటెస్ట్స్ కు భూ పంపిణీ వెడల, ఉపాధి, ఉద్యోగ కల్పన వెడల సరైన అవగాహన లోపించింది. వాటి పరిష్కారం గురించి తన విధానం ఏమిటన్నది ప్రకటించ లేక పోయింది. అవినీతి రూపుమాపడం గురించి మాత్రమే మాట్లాడుతూ, ఆ అవినీతిలోనే బాలేంద్ర షా ప్రభుత్వం కూరుకు పోతున్నది. అవినీతి ఆరోపణలతో పోలీసు మంత్రితో సహా ఇద్దరు మంత్రులు పదవుల నుంచి వైదొలిగారు. ప్రజా సమస్యలను ప్రభుత్వం గాలికి వదిలేసింది. నెలా పది రోజుల్లోనే ప్రజల్లో ప్రభుత్వ వ్యతిరేకత ఏర్పడింది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రదర్శనలు ప్రారంభం అయ్యాయి. ప్రజా సమస్యలు పట్టని బాలేంద్ర షా ప్రభుత్వం ప్రతిపక్ష పార్టీల నాయకులపై కేసులు బనాయిస్తున్నది.

సోషలిస్టు ఆర్థిక విధానాలు, వర్గ దృక్పదం లేని ఏ ఉద్యమం,ఏర్పడే ఏ ప్రభుత్వం వల్ల ఏదేశంలో కూడా ప్రజల మౌలిక సమస్యలు పరిష్కారం కావు. వాటికి ఆ ఉద్దేశం ఉండదు. ఫలితంగా దేశంలో మౌలిక మార్పులు జరగవు. అందుకు నేపాల్ ఒక ఉదాహరణ. భూ సంస్కరణలు అమలు జరపటం, సాగు నీటి ప్రాజెక్టుల నిర్మాణం చేయడం, దేశీయ పరిశ్రమలు నెలకొల్పటం,సంపద వ్యత్యాసాలు తగ్గించడం ద్వారా నేపాల్ లో పేదరికం, నిరుద్యోగం, ఉపాధి లేమి పరిష్కారం దొరుకుతుంది.



బొల్లిముంత సాంబశివరావు
రాష్ట్ర కార్యవర్గ సభ్యులు
రైతు కూలీ సంఘం ( ఆం.ప్ర)
9885983526

# ఎస్‌సి, ఎస్‌టిలతోనే నిజమైన హిందూ ఐక్యత

హిందూ సమాజం ఐక్యత అనే భావన భారతీయ సంస్కృతికి శాశ్వత మూలస్తంభం. కానీ ఆ ఐక్యత కేవలం పండుగలకో, సభలకో, నినాదాలకో పరిమితమైతే అది శక్తివంతమైన సామాజిక పరివర్తనగా మారదు. నిజమైన ఐక్యత అంటే శతాబ్దాలుగా అంచుల్లో నిలిచిపోయినవారిని మధ్యలోకి తీసుకురావడం... ఆలయ గడప దాటలేక వెనుకంజ వేసినవారికి "ఈ ధర్మం మీదీ" అని ధైర్యంగా చెప్పడం... కుల రేఖలను చెరిపేసి "మనమంతా ఒకటే" అనే ఆత్మీయతను ఆచరణలో నిరూపించడం. తెలంగాణలో ప్రస్తుతం విస్తృత స్థాయిలో జరుగుతున్న హిందూ సమ్మేళనాల ముందు ఉన్న అసలైన చారిత్రక బాధ్యత.

రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) తన స్థాపనకు 100 సంవత్సరాలు పూర్తిచేసుకుంటున్న శతాబ్ది సందర్భాన్ని కేవలం జ్ఞాపకోత్సవంగా కాక, సామాజిక జాగరణ యజ్ఞంగా మలచాలని సంకల్పించింది. దేశవ్యాప్తంగా ఒక లక్షకు పైగా హిందూ సమ్మేళనాలు నిర్వహించాలని నిర్దేశించుకోవడం వెనుక ఉద్దేశ్యం కేవలం సంఖ్యా ప్రదర్శన కాదు... హిందూ సమాజంలోని ప్రతి వర్గం, ప్రతి కులం, ప్రతి ప్రాంతాన్ని ఒకే భావజాలంతో కలపాలన్న మహత్తర ప్రయత్నం. తెలంగాణలో మండల, ఉపమండల, బస్తీ స్థాయిలో వేలాది సమ్మేళనాలు, సుమారు 3,500 యూనిట్లలో కార్యక్రమాల ప్రణాళిక ఈ ఉద్యమం విస్తృతిని తెలియజేస్తోంది. ఆలయ ధర్మకర్తలు, యువత, మహిళలు, వృత్తిపరులు, స్థానిక నాయకులు, గ్రామ సమాజం.. అందరినీ ఒక వేదికపైకి తీసుకువస్తూ "హిందువులం అందరం ఒకటే" అనే భావనను సామాజిక సంస్కరణగా మలచాలన్న లక్ష్యం ఇందులో స్పష్టంగా కనిపిస్తోంది.

అయితే, ఇక్కడే ఒక అత్యంత కీలకమైన ప్రశ్న ఎదురవుతోంది, ఈ ఐక్యత యాత్ర నిజంగా ప్రతి హిందువు గడప తడుతున్నదా? ముఖ్యంగా గ్రామీణ తెలంగాణలోని ఎస్సీ, ఎస్టీ వాడలు, గిరిజన తండాలు, అట్టడుగు వర్గాల కాలనీలు ఈ సమ్మేళనాల ప్రధాన ప్రవాహంలో భాగమవుతున్నాయా? హిందూ సమాజ బలం గురించి మాట్లాడే ప్రతి వేదిక ఈ ప్రశ్నకు నిజాయితీగా సమాధానం చెప్పాల్సిందే. ఎందుకంటే, శతాబ్దాలుగా సామాజిక వివక్ష, ఆలయ ప్రవేశ పరిమితులు, కుల ఆధారిత దూరాలు అనేక అట్టడుగు వర్గాల్లో మానసిక గాయాలను మిగిల్చాయి. గ్రామ దేవాలయం పక్కనే ఉన్నా, అందులోకి వెళ్లడంపై సంకోచం... "గ్రామ పెద్దలు ఏమంటారో?" అనే భయం... సామాజిక బహిష్కరణ అనుమానం... ఇవన్నీ ఇప్పటికీ అనేక ప్రాంతాల్లో వాస్తవాలే. "గడప లోపల కులం... గడప దాటితే హిందువులం" అనే నినాదం అద్భుతమైనదే. కానీ అది నినాదం నుంచి నిజ జీవితంలోకి రావాలంటే, ముందుగా ఆ గడపలే కూలాలి. ఈ ఖాళీని ఇతర మత ప్రచార వ్యవస్థలు తమ సేవా కార్యక్రమాలతో నింపుతున్నాయి. విద్య, వైద్యం, ఆర్థిక సహాయం, సామాజిక గౌరవం.. ఇవి అందిస్తున్న చోట అణగారిన వర్గాలు ఆకర్షితులు కావడం సహజం. అందుకే మత మార్పిడులను కేవలం మత విశ్వాస మార్పుగా చూడడం సమస్యను చిన్నదిగా చూడడమే అవుతుంది. ఇది అసలు సామాజిక స్వీకరణ సంక్షోభం.

ఒక దళిత బాలుడు ఆలయ ధ్వజస్తంభం ఎదుట గర్వంగా నిలబడగలగాలి. ఒక గిరిజన మహిళ గ్రామ ఉత్సవంలో సమాన హక్కుతో పాల్గొనగలగాలి. అప్పుడే సమరసత నినాదం సజీవ సత్యమవుతుంది. భారతీయ ధార్మిక సంప్రదాయంలో శబరి, కన్నప్ప వంటి మహాభక్తుల కథలు మనం గర్వంగా చెబుతాం. అయితే వారి వారసులైన అట్టడుగు వర్గాలు నేడు హిందూ సమాజంలో అంచుల్లోనే ఉంటే, మన ఆధ్యాత్మికతలో లోపం ఉన్నట్టే. హిందుత్వం అంటే కేవలం రక్షణ కాదు.. పునరేకీకరణ కూడా. కేవలం చరిత్ర గర్వం కాదు.. ప్రస్తుత సామాజిక బాధ్యత కూడా.

ఒక మనిషి తన జన్మ ధర్మాన్ని వదిలి వెళ్లడానికి ప్రధాన కారణం చాలాసార్లు విశ్వాసం కంటే అవమానం. కాబట్టి హిందూ సమాజం ముందుగా తనలోని దూరాలను తగ్గించుకోవాలి. ఎస్సీ, ఎస్టీ వర్గాలను సంఖ్యలుగా కాదు... హిందూ సమాజానికి అంతర్భాగాలుగా చూడాలి. అందుకే హిందూ సమ్మేళనాల రెండో దశ మరింత లోతుగా ఉండాలి. అది కేవలం పెద్ద సభల దశ కాదు... ప్రతి దళితవాడ, ప్రతి గిరిజన తండా, ప్రతి అట్టడుగు కుటుంబం గడప వద్దకు చేరే దశ కావాలి. సమ్మేళనాలు గ్రామ చౌరస్తాల్లో మాత్రమే కాదు, ఎస్సీ కాలనీల్లో జరగాలి. భజనలు ఆలయ మండపాల్లో మాత్రమే కాదు, గిరిజన బస్తీల్లోనూ మార్మోగాలి. ధార్మిక చైతన్యం అంటే కేవలం ఉపన్యాసం కాదు... అక్కున చేర్చుకోవడం. చిన్న ఆలయాల నిర్మాణం, స్థానిక దేవతల పునరుద్ధరణ, వేదపఠనంలో అట్టడుగు వర్గాల పిల్లలకు అవకాశాలు, ఆలయ కమిటీల్లో ప్రాతినిధ్యం.. ఇవి అన్ని కలిసొస్తేనే హిందూ ఐక్యతకు అర్థం ఉంటుంది.

ఆంధ్రప్రదేశ్‌లో తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఎస్సీ, ఎస్టీ ప్రాంతాల్లో ఆలయ నిర్మాణం చేపట్టిన విధానం ఒక ఆచరణీయ నమూనా. తెలంగాణలో కూడా హిందూ సంస్థలు, స్థానిక సమితులు, ధార్మిక వేదికలు ఇలాంటి కార్యాచరణకు శ్రీకారం చుట్టాలి. ఆలయం కేవలం పూజ స్థలం కాదు.. అది ఆత్మగౌరవ కేంద్రం. "మేమూ ఈ సంస్కృతికి వారసులమే" అనే భావన కలిగించే చిహ్నం. ఒక దళిత బాలుడు ఆలయ ధ్వజస్తంభం ఎదుట గర్వంగా నిలబడగలగాలి. ఒక గిరిజన మహిళ గ్రామ ఉత్సవంలో సమాన హక్కుతో పాల్గొనగలగాలి. అప్పుడే సమరసత నినాదం సజీవ సత్యమవుతుంది. భారతీయ ధార్మిక సంప్రదాయంలో శబరి, కన్నప్ప వంటి మహాభక్తుల కథలు మనం గర్వంగా చెబుతాం. అయితే వారి వారసులైన అట్టడుగు వర్గాలు నేడు హిందూ సమాజంలో అంచుల్లోనే ఉంటే, మన ఆధ్యాత్మికతలో లోపం ఉన్నట్టే. హిందుత్వం అంటే కేవలం రక్షణ కాదు... పునరేకీకరణ కూడా. కేవలం చరిత్ర గర్వం కాదు... ప్రస్తుత సామాజిక బాధ్యత కూడా. అందుకే ఆర్ఎస్ఎస్ శతాబ్ది సందర్భంలో చేపడుతున్న లక్ష హిందూ సమ్మేళనాలు నిజమైన చరిత్ర సృష్టించాలంటే, అవి లక్ష సభలుగా కాదు... లక్ష సామాజిక గోడలను కూల్చే యజ్ఞంగా మారాలి. హిందూ సమాజానికి ఇప్పుడు అవసరమైనది సంఖ్యా బలం కంటే సమగ్ర బలం. కుల విభజనలతో బలహీనపడిన చోట ఐక్యత నిలవదు. అట్టడుగు వర్గాలు దూరమైతే ధార్మిక పరిరక్షణ అసంపూర్ణం. అందుకే సేవ, సమానత్వం, స్వీకరణ.. ఈ మూడు హిందూ సమ్మేళనాల మూల సిద్ధాంతాలుగా మారాలి. విద్యా సహాయం, ఆరోగ్య శిబిరాలు, ఉపాధి మార్గదర్శనం, సామాజిక గౌరవం.. ఇవి ధార్మిక చైతన్యంతో కలిస్తేనే దీర్ఘకాల అనుబంధం ఏర్పడుతుంది. ఆర్ఎస్ఎస్ శతాబ్ది కేవలం గత శతాబ్దపు ప్రయాణ వేడుక కాదు... రాబోయే శతాబ్దానికి హిందూ సమాజ రూపకల్పన చేసే కీలక మలుపు. తెలంగాణలో ఈ ఉద్యమం నిజంగా విజయవంతం కావాలంటే, ప్రతి గ్రామంలో చివరి మనిషి వరకు చేరాలి. ప్రతి ఎస్సీ, ఎస్టీ కుటుంబం "హిందూ సమాజం మమ్మల్ని గుర్తించింది, గౌరవించింది, అక్కున చేర్చుకుంది" అని అనుభూతి చెందాలి. అదే నిజమైన హిందూ ఐక్యత. అదే సామాజిక సమరసత. అదే మత పరిరక్షణకు స్థిరమైన పునాది. గడపలు కూలినప్పుడే గుండెలు కలుస్తాయి... గుండెలు కలిసినప్పుడే హిందూ సమాజం శాశ్వత బలంగా నిలుస్తుంది.



కాలగిరి శ్రీనివాస్ రెడ్డి
సీనియర్ జర్నలిస్ట్

# విప్లవ బాణం అల్లూరి

విప్లవ వీరుడు అల్లూరి సీతా రామరాజు గురించి తెలియని వారుండరు. మన్యం ప్రజల కోసం అలుపెరగని పోరాటం చేసి, వారి కోసం ప్రాణ త్యాగం చేసిన అమరుడైన అల్లూరి, అక్కడి ప్రజలకు దైవ సమానుడై, భారత స్వాతంత్ర్యం కోసం పోరాడిన యోధుడుగా, మన్యం వీరుడుగా, అగ్గి పిడుగుగా ప్రసిద్ది గాంచిన పోరాట యోధుడు సీతారామరాజు. మన్యం ప్రజల హక్కుల కోసం, స్వాతంత్ర్యం కోసం పోరాడి 27 ఏళ్ల చిన్న వయసులోనే ప్రాణ త్యాగం చేసిన విప్లవ జ్యోతి అల్లూరి. ఆయన ఒక మహోజ్వల శక్తి. ఆయన జరిపిన సాయుధ పోరాటం స్వాతంత్ర్య ఉద్యమంలో ఒక ప్రత్యేక అధ్యాయం. సాయుధ పోరాటం ద్వారానే స్వతంత్రం వస్తుందని నమ్మి, దాని కొరకే తన ప్రాణాలర్పించిన యోధుడు. కేవలం 27 ఏళ్ళ వయసులోనే నిరక్షరాస్యులు, నిరుపేదలు, అమాయకులు అయిన అనుచరు లతో, చాలా పరిమిత వనరులతో బ్రిటీషు సామ్రాజ్యమనే మహా శక్తిని ఢీకొన్నాడు.రెండేళ్ల పాటు బ్రిటిషర్లకు కంటిమీద కనుకులేకుండా చేసిన సీతారామరాజు.. తనను నమ్ముకు న్న ప్రజల కోసం ప్రాణత్యాగం చేశాడు. సీతారామరాజు జన్మదినం 1897 జూలై 4, వారి స్వగ్రామం ఇప్పటి పశ్చిమ గోదావరి జిల్లాలోని మోగల్లు ,అయినా విజయనగరం దగ్గరి పాండ్రంగిలో తాతగారైన మందలపాటి శ్రీరామరాజు ఇంట రాజు జన్మించాడు.

1917లో విశాఖపట్నం జిల్లా క్రిష్ణదేవీపేట ద్వారా మన్యంలోకి అడుగుపెట్టారు. బ్రిటిష్ అధికారుల నిరంకుశ చర్యలకు వ్యతిరేకంగా విప్లవానికి సిద్ధం కావాలని మన్యం ప్రజలను పురిగొల్పాడు. చిన్నప్పటినుండి సీతారామరాజులో దైవ భక్తి, నాయకత్వ లక్షణాలు, దాన గుణం అధికంగా ఉండేవి. నిత్యం దైవ పూజ చేసేవాడు. తుని సమీపంలో పెదతల్లి ఉన్న గోపాల పట్టణంలో సీతమ్మ కొండపై రామలింగేశ్వరాలయంలో కొంత కాలం తపస్సు చేశాడు. ఆ రోజుల్లో ఏజన్సీ ప్రాంతంలోని ప్రజలు తెల్లదొరల చేతిలో అనేక దురాగతాలకు, దోపిడీలకు, అన్యాయాలకు గురయ్యేవారు. శ్రమదోపిడి, ఆస్తుల దోపిడి, స్త్రీల మానహరణం సర్వసాధారణంగా జరుగుతూ ఉండేవి. మన్యంలో గిరిజనుల జీవితం దుర్భరంగా ఉండేది. పోడు వ్యవసాయం చేసుకుంటూ, అటవీ ఉత్పత్తులను సేకరించి వాటిని అమ్ముకుని జీవించే వారిపై బ్రిటీషు వారు ఘోరమైన దురాగతాలు చేసేవారు. రక్షిత అటవీప్రాంతం పేరుతో పోడు కొరకు చెట్లను కొట్టడాన్ని నిషేధించింది ప్రభుత్వం. గిరిజనులకు జీవనాధారం లేకుండా చేసింది. అటవీ ఉత్పత్తుల సేకరణలో కూడా అడ్డంకులు సృష్టించింది. మన్యం వాసుల కష్టాలను కడతేర్చటానికి, తెల్లదొరల దోపిడీని ఎదుర్కో వడానికి గిరిజనులకు అండగా నిలిచి పోరాటానికి సిద్ధ మైనాడు. చుట్టుపక్కల 30, 40 గ్రామాల ప్రజలకు రాజు నాయకుడయ్యాడు. ప్రభుత్వం ప్రజలను పెడుతున్న కష్టాలను చూడలేని రాజు ప్రాణ త్యాగానికి సిద్ధపడ్డారు. 1924 మే 7న కొయ్యూరు గ్రామ సమీపంలో ఒక ఏటి వద్ద కూర్చొని, ఒక పశువుల కాపరి ద్వారా తనున్న చోటును పోలీసులకు కబురు పంపాడట. ఏటి ఒడ్డున స్నానం చేస్తూ ఉండగా పోలీసులు చుట్టుముట్టి రాజును బంధించారు. కొయ్యూరులో విడిది చేసి ఉన్న మేజర్ గుడాల్ వద్ద రాజును హాజరు పరిచారు. బందీగా ఉన్న అల్లూరి సీతారామ రాజును (ఒక చెట్టుకు కట్టివేసి) ఏ విచారణ లేకుండా గుడాల్ కాల్చి చంపాడు.



సంగనబట్ల
9440595494

# జాతీయం-అంతర్జాతీయం

## బెంగాల్ సీఎం ఎవరు?



**కోల్‌కత, మే 6 (ఉదయం) :** పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయడానికి మమతా బెనర్జీ నిరాకరించడం, మే 9న ప్రమాణ స్వీకారం ఉంటుందని భారతీయ జనతా పార్టీ ప్రకటించడం వంటి పరిణామాల నడుమ రాష్ట్రంలో అత్యున్నత పదవి ఎవరికి దక్కుతుందనే దానిపై ఊహాగానాలు జోరుగా సాగుతున్నాయి. ఈ రేసులో ముందున్న కొద్దిమంది అభ్యర్థులలో, 2026 అసెంబ్లీ ఎన్నికల్లో అసన్సోల్ దక్షిణ నియోజకవర్గం నుంచి విజయం సాధించిన బీజేపీ నాయకురాలు అగ్నిమిత్ర పాల్ ఒకరు.

ముఖ్యమంత్రి పదవికి పరిశీలిస్తున్న పేర్ల జాబితాలో బీజేపీ బెంగాల్ ఉపాధ్యక్షురాలు అగ్నిమిత్ర పాల్ పేరు కూడా ఉందని ఒక బీజేపీ నాయకుడు మే 4న 'హిందుస్థాన్ టైమ్స్' కు తెలిపినట్టు ఆ పత్రిక పేర్కొంది.

ఆ జాబితాలో అధికారి పేరు ఉంది. అలాగే, రాజ్యసభ సభ్యుడు, రాష్ట్ర అధ్యక్షుడు సమీక్ భట్టాచార్య, ఆసన్సోల్ దక్షిణం నియోజకవర్గం నుంచి విజయం సాధించిన రాష్ట్ర ఉపాధ్యక్షురాలు అగ్నిమిత్ర పాల్ పేర్లను కూడా కొందరు నాయకులు ప్రతిపాదించారు, అని ఆ బీజేపీ నాయకుడు తన పేరు వెల్లడించకూడదనే షరతుపై తెలిపారని ఆ పత్రిక పేర్కొంది.

**అగ్నిమిత్ర పాల్ ఎవరు?**

భారత ఎన్నికల సంఘం గణాంకాల ప్రకారం, తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి) అభ్యర్థి తపస్ బెనర్జీని ఓడించి, బీజేపీ నాయకురాలు అగ్నిమిత్ర పాల్ అసన్సోల్ దక్షిణ నియోజకవర్గంలో 40,000కు పైగా ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. బీజేపీ వర్గాల సమాచారం ప్రకారం, మమతా బెనర్జీ స్థానంలో తమ పార్టీకి చెందిన ఒక మహిళా అభ్యర్థిని ముఖ్యమంత్రిగా నిలబెట్టాలని బీజేపీ భావిస్తే, అగ్నిమిత్ర పాల్ అందుకు అత్యంత ఆదర్శవంతమైన అభ్యర్థి కాగలరు. పాల్ 2019 నుండి 2024 వరకు లోక్‌సభ సభ్యురాలిగా వ్యవహరించారు.

రాజకీయాల్లోకి రాకముందు ఆమె ఒక ఫ్యాషన్ డిజైనర్‌గా ఉండేవారని పాల్ తన సోషల్ మీడియా పేర్కొంటోంది.

ఆమె అఫిడవిట్ ప్రకారం, చట్టవిరుద్ధమైన సమావేశంలో పాల్గొపడం, హింసాత్మక నిరసనలు, అల్లర్లు, ప్రభుత్వ అధికారుల చట్టబద్ధమైన ఆదేశాలను ధిక్కరించడం, ప్రభుత్వ అధికారి సక్రమంగా జారీ చేసిన ఉత్తర్వును ఉల్లంఘించడం, శాంతిభంగం లేదా ప్రజా అశాంతిని రెచ్చగొట్టే లక్ష్యంతో ఉద్దేశపూర్వకంగా అవమానించడం లేదా రెచ్చగొట్టడం, వివిధ వర్గాల మధ్య శత్రుత్వం, ద్వేషం లేదా దురభిప్రాయాన్ని ప్రోత్సహించే ప్రకటనలు లేదా సంభాషణలు వంటి ఆరోపణలపై పాల్‌పై ఏకంగా 23 క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయి.

**ముఖ్యమంత్రి పదవికి పోటీలో ఉన్న ఇతర ప్రముఖులు ఎవరు?**

పాల్‌తో పాటు, పశ్చిమ బెంగాల్ శాసనసభలో ప్రతిపక్ష నాయకుడిగా వ్యవహరించిన సువేందు అధికారి కూడా రాష్ట్ర అత్యున్నత పదవి రేసులో ముందున్న వారిలో ఒకరు. బెంగాల్ ఎన్నికల్లో అధికారి ఒక కీలక శక్తిగా అవతరించారు. భవానీపూర్ నియోజకవర్గం నుండి ప్రస్తుత ముఖ్యమంత్రి మమతా బెనర్జీని 15,000కు పైగా ఓట్ల తేడాతో ఓడించడం ద్వారా ఆయన ఈ ఘనతను సాధించారు. 2021లో నందిగ్రామ్‌లో ఇదే విధమైన విజయాన్ని నమోదు చేసిన తర్వాత, ఇది ఆయనకు రెండవ విజయం కావడం విశేషం. అంతే కాకుండా, ఈసారి కూడా అధికారి పైన పేర్కొన్న రెండు నియోజకవర్గాల నుండి పోటీ చేయగా, ఆ రెండింటిలోనూ ఆయన విజయం సాధించారు. పరిగణనలో ఉన్న పేర్లలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సమీక్ భట్టాచార్య కూడా ఉన్నారు. రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి అయిన మే 9న కొత్త ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారం చేస్తారని బీజేపీ ప్రకటించినప్పటికీ, బెంగాల్ తదుపరి ముఖ్యమంత్రి ఎవరు కాబోతారనే విషయాన్ని ఆ పార్టీ ఇంకా నిర్ణయించలేదు.

## తమిళనాడు రాజకీయాల్లో
# శాశ్వత శత్రువులు, మిత్రులు లేరు

**చెన్నై, మే 6 (ఉదయం) :** తమిళనాడులో కాంగ్రెస్ పార్టీ డిఎంకెతో తన పొత్తుకు ముగింపు పలికి, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు నటుడు విజయ్ స్థాపించిన తమిళగ వెట్రి కజగంతో జతకట్టడంతో 55 ఏళ్ల బంధం తెగిపోయిందని వార్తలు వెలువడినప్పటికీ ఇదేమీ కొత్తకాదని విశ్లేషకులు అంటున్నారు. కాంగ్రెస్, డిఎంకె, ఎఐఎడిఎంకెల మధ్య పొత్తులు మారుతూ రావడం చరిత్రలో కనిపిస్తుంది; కాగా, ఇటీవల సీట్ల పంపకం విషయంలో తలెత్తిన ఉద్రిక్తతలు స్టాలిన్, రాహుల్ గాంధీల మధ్య సంబంధాలను దెబ్బతీశాయి.

ద్రవిడ మున్నేట్ర కజగంతో దశాబ్దాల తరబడి కొనసాగిన పొత్తుకు ముగింపు పలుకుతూ, , తమిళనాడులోని భారత జాతీయ కాంగ్రెస్ఇ టీవల ముగిసిన అసెంబ్లీ ఎన్నికల్లో ఏకైక అతిపెద్ద పార్టీగా అవతరించిన, నటుడు సి. జోసెఫ్ విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కజగంతో తదుపరి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు చేతులు కలిపింది.

**డిఎంకెతో బంధం తెంచుకుని, టివికెతో చేతులు కలిపిన కాంగ్రెస్**

రెండు పార్టీల మధ్య పరస్పర గౌరవం, సముచిత వాటా, ఉమ్మడి బాధ్యత అనే పునాదులపై ఏర్పడిన ఈ కూటమి, కేవలం ప్రస్తుత ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి మాత్రమే కాకుండా, భవిష్యత్తులో జరగబోయే స్థానిక సంస్థల, లోక్‌సభ , రాజ్యసభ ఎన్నికలకు కూడా ఉద్దేశించినదని ఈ కొత్త కూటమిని ఒక ప్రకటిస్తూ, తమిళనాడు కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ గిరీష్ చోడంకర్ అన్నారు. లౌకిక, ప్రగతిశీల ప్రభుత్వం కోసం తమిళనాడు ప్రజలు ఇచ్చిన ఈ చారిత్రక తీర్పును గౌరవిస్తామని, అలాగే ప్రజల, ముఖ్యంగా తమిళనాడు యువత కలలను, వాగ్దానాలను నెరవేరుస్తామని విజయ్, రాహుల్ గాంధీ సంయుక్తంగా ప్రతిజ్ఞ చేశారు, అని ఆయన వివరించారు.



**తమిళనాడు రాజకీయాల్లో మారుతున్న కూటముల చరిత్ర**

ఈ పరిణామం నేపథ్యంలో, కాంగ్రెస్ పార్టీ డిఎంకెతో తన 55 ఏళ్ల బంధాన్ని తెంచుకుందని కొన్ని నివేదికలు పేర్కొన్నాయి. అయితే, ఈ వాదనలో నిజం లేదు; ఎందుకంటే చారిత్రక వాస్తవాలు వీరి మధ్య సంబంధం మరింత సంక్లిష్టమైనదని సూచిస్తున్నాయి. ఇందిరా గాంధీ నాయకత్వంలో, కాంగ్రెస్ పార్టీ మొట్టమొదటిసారిగా 1969లో డిఎంకెతో కూటమిని ఏర్పాటు చేసింది. ఆ తర్వాత, అది ఆల్ ఇండియా అన్నా ద్రవిడ మున్నేట్ర కజగం (ఎఐఎడిఎంకె)తో జతకట్టి, మార్చి 1977 లోక్‌సభ ఎన్నికల్లో కలిసి పోటీ చేసింది.

1979లో జరిగిన తంజావూరు పార్లమెంటరీ ఉప ఎన్నికలో ఇందిరా గాంధీకి మద్దతు ఇవ్వడానికి ఎం.జి. రామచంద్రన్ నిరాకరించిన నేపథ్యంలో, 1980లో డిఎంకె తిరిగి కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకుంది. అయితే, ఈ ఏర్పాటు ఎక్కువ కాలం కొనసాగలేదు; ఎందుకంటే 1984లో ఎఐఎడిఎంకె తిరిగి కాంగ్రెస్‌తో పొత్తును పునరుద్ధరించుకుంది, ఈ పొత్తు 1996 వరకు కొనసాగింది.

1998 లోక్‌సభ ఎన్నికలలో, ఎఐఎడిఎంకె, భారతీయ జనతా పార్టీతో పొత్తు పెట్టుకుంది, కానీ ఆ భాగస్వామ్యం కేవలం సుమారు ఒక సంవత్సరం మాత్రమే కొనసాగింది. 1999 సార్వత్రిక ఎన్నికలలో, డిఎంకె బీజేపీ నేతృత్వంలోని జాతీయ ప్రజాస్వామ్య కూటమిలో చేరగా, 2001లో కాంగ్రెస్‌తో తన సంబంధాలను ఎఐఎడిఎంకె తిరిగి పునరుద్ధరించుకుంది.

డిఎంకె, తదుపరి నాలుగేళ్ల పాటు ఎన్డీయేలో భాగంగా కొనసాగి, 2004 సార్వత్రిక ఎన్నికలకు కొద్దికాలం ముందు అటల్ బిహారీ వాజ్‌పేయి నేతృత్వంలోని ప్రభుత్వానికి తన మద్దతును ఉపసంహరించుకుంది.

2014 పార్లమెంటు ఎన్నికలు మినహా, 2004 నుండి కాంగ్రెస్, డిఎంకె వరుస ఎన్నికలలో కలిసి పోటీ చేశాయి. అయితే, ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల సీట్ల పంపకాల చర్చల సమయంలో ఇరు పక్షాల మధ్య విభేదాలు తలెత్తాయి; ఇది డిఎంకె నాయకుడు ఎం.కె. స్టాలిన్ మరియు రాహుల్ గాంధీల మధ్య ఒకప్పుడు నెలకొన్న "సోదర" బంధంపై నీడను కమ్మేసింది.

ఎన్నికలనంతర హింసలో ఇద్దరు జవాన్లతో సహా

## నలుగురు పోలీసులపై కాల్పులు

**తక్షణ అరెస్టులకు సీఈసీ ఆదేశాలు**



**కోల్‌కత, మే 6 (ఉదయం) :** పశ్చిమ బెంగాల్‌లో ఎన్నికల అనంతర హింసాకాండ, విధ్వంసక చర్యలు ప్రారంభమయ్యాయి. బుధవారం నాడు ఉత్తర 24 పరగణాల జిల్లాలోని సందేశ్‌ఖాలీ ప్రాంతంలో జరిగిన ఘర్షణలో, నజాత్ పోలీస్ స్టేషన్ ఇన్‌చార్జ్ అధికారి (ఒసి)తో సహా ఐదుగురు పోలీసులు, ఒక జవానుపై కాల్పులు జరిగిన కొన్ని గంటలకే, ఆ ఘటనలకు పాల్పడిన వారిని తక్షణమే అరెస్టు చేయాలని ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు.

బెంగాల్‌లోని 294 అసెంబ్లీ నియోజకవర్గాల ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత కూడా హింసాకాండ ఏమాత్రం తగ్గలేదు. ఈ ఫలితాల్లో రాష్ట్రంలోని 207 స్థానాల్లో బీజేపీ భారీ మెజారిటీతో విజయం సాధించింది. బెంగాల్‌లో రెండు దశల ఎన్నికలు వరుసగా ఏప్రిల్ 23, 29 తేదీలలో జరిగాయి.

మంగళవారం నాడు, రాష్ట్రంలో ఎన్నికల అనంతర హింసాకాండకు సంబంధించిన ఆరోపణల మధ్య ఇద్దరు వ్యక్తులు మరణించారు. అంతేకాక, కోల్‌కతా, ఇతర జిల్లాల్లో అనేక రాజకీయ పార్టీ కార్యాలయాలు ధ్వంసం చేశారు.

భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) వర్గాల సమాచారం ప్రకారం, సున్నితమైన ప్రాంతాల్లో నిరంతర గస్తీని కొనసాగించాల్సిందిగా కేంద్ర ఎన్నికల కమిషనర్ (సిఇసి) ఈ రోజు పశ్చిమ బెంగాల్ ప్రధాన కార్యదర్శి, పోలీస్ డైరెక్టర్ జనరల్, కోల్‌కతా పోలీస్ కమిషనర్, కేంద్ర సాయుధ పోలీసు బలగాల (సిఎపిఎఫ్) డైరెక్టర్ జనరల్స్‌తో పాటు, జిల్లా మేజిస్ట్రేట్లు, పోలీస్ సూపరింటెండెంట్లకు ఆదేశాలు జారీ చేశారు.

హింసను ప్రేరేపించి, విధ్వంసక చర్యలకు పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేయాలని కుమార్ ఆదేశించినట్టు అధికార వర్గాలు తెలిపాయి.

బుధవారం రాత్రి నజాత్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రాజ్‌బారి ప్రాంతంలో రెండు రాజకీయ పార్టీల మధ్య జరిగిన ఘర్షణలో ఓసీ భరత్ ప్రసూన్ పుర్కాయస్థ, ఒక మహిళా కానిస్టేబుల్‌తో సహా నలుగురు రాష్ట్ర పోలీసు సిబ్బంది, ఇద్దరు సీఏపీఎఫ్ జవాన్లు బుల్లెట్ గాయాలపాలయ్యారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, జవాన్లపై కొందరు దుండగులు కాల్పులు జరిపినట్లు ఆరోపణలు వచ్చాయి. వారి కాళ్లకు గాయాలైనట్లు స్థానిక పోలీసు వర్గాలు తెలిపాయి. ఓసీ పరిస్థితి విషమంగా ఉంది. గాయపడిన వారిని కోల్‌కతాలోని ప్రభుత్వ వైద్య కళాశాల ఆసుపత్రికి తరలించారు.

ఈ ఘటన గ్రామంలో ఉద్రిక్తతకు దారితీసింది. పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి భారీ సంఖ్యలో కేంద్ర బలగాలను, పోలీసులను మోహరించారు.

మంగళవారం, హౌరాలోని ఉదయ్‌నారాయణ్‌పూర్ సమీపంలోని దేబీపూర్‌లో, 45 ఏళ్ల బీజేపీ కార్యకర్త జాదబ్ బార్‌ను సోమవారం రాత్రి కొట్టి చంపినట్లు ఆరోపణలు వచ్చాయి.

స్థానిక, పోలీసు వర్గాల సమాచారం ప్రకారం, బార్ పార్టీ విజయోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన పిక్నిక్‌కు హాజరై, రాత్రి పొద్దుపోయాక ఇంటికి తిరిగి రాగా, కొందరు వ్యక్తులు అతడిని మళ్లీ బయటకు పిలిచారు.

ఆ తర్వాత, అతనిపై ఇనుప రాడ్లతో దాడి చేశారని తెలుస్తోంది. బార్‌ను హుటాహుటిన ఉదయ్‌నారాయణపూర్ ప్రభుత్వ సాధారణ ఆసుపత్రికి తరలించగా, అక్కడ వైద్యులు అతను మరణించినట్లు నిర్ధారించారు. ఉత్తర 24పరగణాల పరిధిలోని న్యూ టౌన్‌లో, బీజేపీ కార్యకర్త మధు మండల్ తన ప్రత్యర్థి చేతిలో హత్యకు గురైనట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

మండల్ ఒక బీజేపీ కార్యకర్త. ఆ ప్రాంతంలోని ఓటర్ల మద్దతును కూడగట్టడంలో బీజేపీకి సహాయపడినందుకుగాను, తృణమూల్ గూండాలు అతన్ని హత్య చేశారు, అని బాధితుడి కుటుంబ సభ్యుడొకరు తెలిపారు. మంగళవారం బీర్భూమ్‌లోని నానూర్ వద్ద తృణమూల్ కాంగ్రెస్ మద్దతుదారుడైన అబీర్ షేక్‌ను బీజేపీ కార్యకర్తలు హత్య చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి.

పరిస్థితి మరింత తీవ్రతరం కాకుండా నిరోధించేందుకు, రాష్ట్ర పోలీసులు, కేంద్ర బలగాలను సమన్వయంతో మోహరించి, అధికారులు జిల్లాల వ్యాప్తంగా నిఘాను ముమ్మరం చేశారు. ముందుజాగ్రత్త చర్యగా, ప్రమాదకర ప్రాంతాల్లో భద్రతా సిబ్బందిని పెంచారు.

## వ్యూహాత్మక రక్షణ సహకారం దిశగా
# భారత్- యూఏఈ



**ఉదయం డెస్క్, మే 6 :** పశ్చిమ బెంగాల్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నేతృత్వంలోని బీజేపీ ఘనవిజయం సాధించిన మరుసటి రోజే, పర్షియన్ గల్ఫ్ మీదుగా యూఏఈలోని ఫుజైరా పోర్టుపై ఇరాన్ జరిపిన బాలిస్టిక్ క్షిపణి, డ్రోన్, క్రూయిజ్ క్షిపణి దాడిని ఖండిస్తూ భారత ప్రధాని ఒక అసాధారణ చర్య తీసుకున్నారు. యూఏఈకి సంఘీభావం తెలపడమే కాకుండా, హొర్ముజ్ జలసంధిలో నౌకాయాన స్వేచ్ఛకు కూడా ప్రధాని పిలుపునిచ్చారు. ఇరాన్‌అమెరికా యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి, యూఏఈలోని అమెరికా వైమానిక స్థావరాలు, ఇజ్రాయెల్‌తో ఉన్న సంబంధాల కారణంగా, ఇరాన్ నుంచి యుఏఈ తన భూభాగంపై 549 బాలిస్టిక్ క్షిపణులు, 29 క్రూయిజ్ క్షిపణులు, 2260 డ్రోన్ దాడులను ఎదుర్కొంది.

ఫుజైరా ఓడరేవుపై ఇరాన్ దాడి వ్యూహాత్మకంగా జరిగింది, ఎందుకంటే ఈ ఓడరేవు, ఖోర్ ఫక్కాన్ ఓడరేవుతో పాటు, హొర్ముజ్ జలసంధికి వెలుపల ఒమన్ గల్ఫ్‌లో ఉన్నాయి. సౌదీ అరేబియా ఆధిపత్యంలోని ఒపెక్ నుంచి యూఏఈ వైదొలగడంతో, హొర్ముజ్ జలసంధిని ఒక ఆయుధంగా ఉపయోగించుకుంటున్న ఇరాన్‌ను ధిక్కరించి ప్రపంచ ఇంధన అవసరాన్ని ఈ రెండు ఓడరేవులు తీర్చగలుగుతాయి. పశ్చిమ ఆసియాలో ఇజ్రాయెల్ కంటే కూడా ఎక్కువ ఇరాన్ క్షిపణుల దాడులకు గురైన దేశం యూఏఈ. ఎందుకంటే, ఇజ్రాయెల్‌తో పెరుగుతున్న సంబంధాలను తెహ్రాన్ అంగీకరించలేకపోతోంది, అలాగే యూఏఈ మధ్యప్రాచ్య ఆర్థికాభివృద్ధికి ఒక చిహ్నంగా నిలుస్తోంది.

సౌదీ అరేబియా, ఖతార్ దేశాలు పాకిస్థాన్‌తో పరస్పర రక్షణ ఒప్పందాలు కుదుర్చుకోగా, జనవరి 19న ఎం.బి.జెడ్ తన పూర్తి మంత్రివర్గంతో మూడు గంటల పాటు భారతదేశానికి వచ్చినప్పుడు ఇరు దేశాలు ఒక ఆశయ పత్రంపై (లెటర్ ఆఫ్ ఇంటెంట్) సంతకాలు చేశాయి. ప్రస్తుతం, ప్రధాని మోడీ, ఆయన సన్నిహిత మిత్రుడు, యూఏఈ అధ్యక్షుడు షేక్ మహమ్మద్ బిన్ జాయెద్ ఒక వ్యూహాత్మక రక్షణ భాగస్వామ్యాన్ని ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. ఈ ఆశయ పత్రంపై సంతకాలు చేసిన తర్వాత ఆరు నెలల్లోగా ఒక వ్యూహాత్మక రక్షణ భాగస్వామ్య ఒప్పందాన్ని కుదుర్చుకోవాలని, అలాగే రక్షణ పారిశ్రామిక సహకారం, రక్షణ ఆవిష్కరణ, ప్రత్యేక కార్యకలాపాలు, పరస్పర అనుసంధానం, సైబర్ స్పేస్, ఉగ్రవాద నిరోధం వంటి రంగాలలో సహకారాన్ని విస్తరించాలని ఇరు పక్షాలు ప్రణాళిక వేశాయి. ఇటీవల, యూఏఈ 3.45 బిలియన్ డాలర్ల పాకిస్థాన్ రుణాన్ని పొడిగించకూడదని నిర్ణయించింది. దీని ఫలితంగా, అబుదాబికి చెల్లించడానికి ఇస్లామాబాద్ రియాద్ నుండి రుణం తీసుకోవలసి వచ్చింది.

ప్రధాని మోడీ నెదర్లాండ్స్ పర్యటన నిమిత్తం మే 18న అబుదాబిలో దిగనున్న నేపథ్యంలో, ముంద్రాఫుజైరాఅకాబాను కొత్త వాణిజ్య అక్షంగా ప్రచారం చేస్తూ ఇరు దేశాలు తమ ద్వైపాక్షిక సంబంధాలను పటిష్టం చేసుకుంటుండటంతో అందరి దృష్టి వాటిపైనే ఉంది. జోర్డాన్‌లోని రాక్‌ఫాస్ఫేట్, పొటాష్ గనులను ఎర్ర సముద్రంలోని అకాబా ఓడరేవుతో అనుసంధానించేందుకు 360 కిలోమీటర్ల రైలు మార్గాన్ని నిర్మించడం కోసం యూఏఈ గత నెలలో 2.3 బిలియన్ డాలర్ల ఒప్పందాన్ని అధికారికంగా కుదుర్చుకుంది. రాక్ ఫాస్ఫేట్, పొటాష్ రెండింటినీ ఎరువుల తయారీకి ఉపయోగిస్తారు, వీటికి భారతదేశంలో అధిక డిమాండ్ ఉంది.

భారతదేశానికి సన్నిహిత మిత్రదేశం కావడంతో పాటు, యుఏఈ న్యూఢిల్లీకి ఇంధనాన్ని సరఫరా చేసే అగ్రశ్రేణి ఐదు దేశాలలో ఒకటిగా కూడా నిలుస్తోంది. 20242025 ఆర్థిక సంవత్సరంలో, భారతదేశం ఎమిరేట్స్ నుండి 13.6 బిలియన్ డాలర్ల విలువైన ముడి చమురును (ఇది దేశం మొత్తం ముడి చమురు దిగుమతులలో దాదాపు 10 శాతానికి, అంటే సుమారు 23 మిలియన్ టన్నులకు సమానం), అలాగే 7.51 బిలియన్ డాలర్ల విలువైన ఎల్ ఎన్‌జి, ఎల్‌పిజిని దిగుమతి చేసుకుంది.

ప్రపంచ ఇంధనంపై ఆధిపత్యం, పట్టు కోసం అమెరికా, ఇరాన్‌లు హొర్ముజ్ జలసంధిపై పోటీ పడుతున్న నేపథ్యంలో, భారత్ యూఏఈతో తన సంబంధాలను మరింత బలోపేతం చేసుకుంటుందని భావిస్తున్నారు. తద్వారా ఇరు దేశాలు పరస్పరం ప్రయోజనం పొందగలవు, ఎందుకంటే న్యూఢిల్లీకి ఇంధన భద్రత, అబుదాబికి ఆహార భద్రత అవసరం. అలాగే, తీవ్రవాదం, ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ఇరు దేశాలు పోరాడాల్సి ఉంటుంది.

## నితీశ్ కమారుడికి మంత్రి పదవి



**ఉదయం డెస్క్, మే 6 :** బీహార్‌లో ఈనెల 7న కీలక మంత్రివర్గ విస్తరణ జరుగనుంది. గాంధీ మైదానంలో పెద్దఎత్తున ప్రమాణస్వీకార కార్యాక్రమానికి ఏర్పాట్లు జరుగుతున్నారు. బిహార్ మాజీ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ తనయుడు నిశాంత్ కుమార్ మంత్రివర్గంలో చేరే అవకాశం ఉంది. జేడీయూ నేతలు మంగళవారం రాత్రి జరిపిన సమావేశంలో ప్రభుత్వంలో చేరాలని నిశాంత్‌ను ఒప్పించినట్టు తెలుస్తోంది. ఢిల్లీ నుంచి పాట్నా వచ్చిన కేంద్ర మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ సహా, జేడీయూ నేతలు ప్రస్తుతం 7 సర్క్యులర్ రోడ్డులోని నితీశ్ కుమార్ నివాసంలో సమావేశం జరుపుతున్నారు. ఈ సమావేశంలో మంత్రుల తుది జాబితాను ఆమోదించనున్నట్టు తెలుస్తోంది.

## తమిళనాడులో
# రాహుల్- విజయ్ ప్రభుత్వం?

**టివికెకి మద్దతు ప్రకటించిన కాంగ్రెస్**



**చెన్నై, మే 6 (ఉదయం) :** ఎన్నికల అనంతరం చోటు చేసుకున్న కీలక పరిణామంలో, విజయ్ కు చెందిన తమిళగ వెట్రి కజగం (టీవీకే)కు కాంగ్రెస్ పార్టీ మద్దతు ప్రకటించింది. ఈ చర్య తమిళనాడులో ప్రభుత్వ ఏర్పాటు ప్రక్రియను పునర్వ్యవస్థీకరించే అవకాశం ఉంది. తీవ్రమైన రాజకీయ చర్చల నడుమ చోటుచేసుకున్న ఈ పరిణామం, ఫలితాల తర్వాత పార్టీలు కొత్త సమీకరణాలను అన్వేషిస్తున్నందున పొత్తులలో మార్పుకు సంకేతంగా నిలుస్తోంది.

అయితే, ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ (ఐయుఎంఎల్), వామపక్ష మిత్రపక్షపార్టీలు మద్దతు ఇవ్వడంపై ఇంకా ఒక నిర్ణయానికి రాలేదు.


**చిత్రంలో ఎఐఎడిఎంకె**

ఎఐఎడిఎంకెలో ఒక కీలక వర్గం, కాంగ్రెస్‌ను అధికారానికి దూరంగా ఉంచడానికి తీవ్ర ఆసక్తి చూపుతోంది. ఇదే వర్గం టివికెకు బయటి నుంచి మద్దతు ఇవ్వడానికి కూడా సుముఖంగా ఉన్నట్లు చెబుతున్నారు. ఇది రాజకీయ సమీకరణాల్లో సంభవించే మార్పులను సూచిస్తోంది. ఒక కీలక పరిణామంలో, టివికె నాయకులు ఎఐఎడిఎంకె అధినేత ఎడప్పాడి కె. పళనిస్వామి (ఇపిఎస్)ని కలిశారు; ఇది ఇరు పక్షాల మధ్య చర్చలు కొనసాగుతున్నాయనడానికి సంకేతం. ఎఐఎడిఎంకెలో అంతర్గత కార్యకలాపాలు ముమ్మరమైన తరుణంలో ఈ భేటీ జరిగింది. పార్టీలో 'నెంబర్ 2'గా పరిగణించే సీనియర్ నాయకుడు ఎస్.పి. వేలుమణి కూడా షణ్ముగంతో చర్చలు జరిపారు. పార్టీలో టివికె అనుకూల వర్గానికి షణ్ముగం నాయకత్వం వహిస్తున్నారని భావిస్తున్నారు.

రాష్ట్రంలో కొత్త రాజకీయ సమీకరణాలు ఆవిర్భవిస్తున్నాయని ఈ పరిణామాలు సూచిస్తున్నాయి. పొత్తులను ఖరారు చేసుకునేందుకు వరుస సమావేశాలు జరుగుతున్నాయి. ఈ అనిశ్చితి డిఎంకె శిబిరంలోనూ ఆందోళనలను రేకెత్తించింది. వివిధ రాజకీయ శక్తులు తమ ప్రత్యామ్నాయాలను బేరీజు వేసుకుంటున్న నేపథ్యంలో, తమిళనాడులో ప్రభుత్వం ఏర్పాటుపై నెలకొన్న ఉత్కంఠ మరింత ముదురుతోంది.

## కేంద్రం అభ్యర్థన తిరస్కరించిన సుప్రీం

**ఉదయం డెస్క్, మే 6 :** కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ), ఎన్నికల కమిషనర్ నియామకాల ఎంపిక కమిటీల్లో భారత ప్రధాన న్యాయమూర్తి సభ్యత్వాన్ని తొలగించిన కేసు పై సుప్రీం కోర్టులో విచారణ కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో ఈ చట్టాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై విచారణ వాయిదా వేయాలని కేంద్ర ప్రభుత్వం సుప్రీం కోర్టు ను కోరింది. కాగా ఈ అప్పీల్‌ను సర్వోన్నత న్యాయస్థానం తిరస్కరించింది. తాను 'శబరిమలలో మహిళల ప్రవేశం' కేసును పర్యవేక్షిస్తున్నందున ఈ కేసును కొద్ది రోజుల పాటు వాయిదా వేయాలని కేంద్రం తరపు వాదిస్తున్న సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా న్యాయస్థానాన్ని కోరారు.



కాగా తుషార్ మెహతా అభ్యర్థనను జస్టిస్ దీపాంకర్ దత్త తిరస్కరిస్తూ..ఈ పిటిషన్‌పై విచారణ అత్యంత ముఖ్యమైనదిగా పేర్కొన్నారు. చాలా రోజుల క్రితమే విచారణ తేదీని ఖరారు చేశామని.. ఇప్పుడు వాయిదా వేయడం కుదరదని స్పష్టం చేశారు. శబరిమల కేసును అసలు విచారించకపోవడమే మంచిదని మంగళవారం 9మంది న్యాయమూర్తుల ధర్మాసనం చేసిన వ్యాఖ్యలను ప్రస్తావించారు.

సీఈసీ, ఈసీ నియామకాల ఎంపిక కమిటీల్లో భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) స్థానంలో కేంద్ర మంత్రిని తీసుకునేందుకు ప్రతిపాదిస్తూ కేంద్రం చట్టం చేసింది. అయితే ఈ చట్టాన్ని దుర్వినియోగం చేసి కేంద్ర ప్రభుత్వం తమకు అనుకూలమైన అధికారులను ఎన్నికల అధికారులుగా నియమించుకునే అవకాశం ఉందని పలువురు ఆందోళన లేవనెత్తారు. ఈ చట్టం కింద జరిగిన నియామకాలను సవాల్ చేస్తూ.. సుప్రీం కోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ప్రస్తుతం వాటిపై విచారణ కొనసాగుతోంది.

## ఐప్యాక్‌తో ఎస్పి కటాకట్

**ఉదయం డెస్క్, మే 6 :** తమిళనాడులో డీఎంకే కూటమి, పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ పార్టీ ఘోర పరాజయం చవిచూశాయి. ఈ రెండు పార్టీలకు ఐప్యాక్ పనిచేసింది. అయితే ఈ ఓటమి తర్వాత రెండు రోజులకే ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్ కీలక నిర్ణయం ప్రకటించారు. ఐప్యాక్‌తో సంబంధాలు తెంచుకున్నట్లు ఆయన స్పష్టం చేశారు. అయితే, ఇందుకు నిధుల కొరత కారణమని ఆయన తెలిపారు. వచ్చే సంవత్సరం ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఐప్యాక్‌తో గత సంవత్సరం ఒప్పందం కుదుర్చుకున్నామని అఖిలేశ్ తెలిపారు. ఐప్యాక్ పని చేసిన రెండు పార్టీలు ఓడిపోయిన అనంతరం అఖిలేష్ యాదవ్ నుంచి ఈ ప్రకటన రావడం ప్రాధాన్యతను సంతరించుకుంది. పశ్చిమ బెంగాల్ ఎన్నికల తీరును అఖిలేష్ యాదవ్ ప్రశ్నించారు. దీనిని సుప్రీంకోర్టు వెంటనే సుమోటోగా స్వీకరించాలని కోరారు. ఓట్ల లెక్కింపు వీడియో రికార్డింగును ప్రజలకు అందుబాటులో ఉంచాలని అన్నారు. బెంగాల్‌లో చోటు చేసుకున్న పరిణామాలు వచ్చే ఎన్నికలు జరగనున్న ఉత్తరప్రదేశ్‌లో పునరావృతమయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.





## వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన

**మంచిర్యాల/రామకృష్ణాపూర్ మే 06(వుదయం ప్రతినిధి)** క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని బొక్కలగుట్ట జాతీయ రహదారి పక్కనగల గాంధారి మైసమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలో శిలాధ్వజ యంత్ర ప్రతిష్ఠాపన కార్యక్రమం వైభవోపేతంగా జరిగింది. ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన దాతల సహకారంతో ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. వేదస్వస్తి, వాస్తు పూజ హోమం, యంత్రస్థాపన, పూర్ణాహుతి, మహదాశీర్వచనము, అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. ధ్వజ స్తంభం ప్రతిష్ఠాపన కార్యక్రమానికి మున్సిపల్ చైర్ పర్సన్ గొడిసెల సంధ్యారాణి రాజా రమేష్, వైస్ చైర్ పర్సన్ మిట్టపల్లి సరిత శ్రీనివాస్ లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కౌన్సిలర్లు సైతం కార్యక్రమానికి హాజరయ్యారు. కార్యక్రమానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేశారని ఆలయ కమిటీ తెలియజేసింది.

# అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు..!



**జగిత్యాల మే 06 (వుదయం ప్రతినిధి)** జగిత్యాల పట్టణ 1వ వార్డుకు చెందిన సంబు రాయలింగు లక్ష్మి దంపతులకు సంబు మల్లయ్య ఇందిరమ్మ ఇల్లును ప్రారంభించి సారంగాపూర్ మండల కొనాపూర్ గ్రామానికి చెందిన గుండా సత్తెమ్మ చిన్న మల్లయ్య ఇందిరమ్మ ఇళ్లు గృహ ప్రవేశ కార్యక్రమానికి హాజరై ఆర్పపల్లి గ్రామానికి చెందిన మామిడిపల్లి జయ గంగాచారి కుడుకల జలజ రాజా లింగారెడ్డి ల ఇందిరమ్మ ఇళ్లు గృహ ప్రవేశ కార్యక్రమానికి హాజరై ఇందిరమ్మ ఇల్లును ప్రారంభించి చీర కానుకగా అందజేసి శుభాకాంక్షలు తెలిపిన జగిత్యాల నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ యం సంజయ్ కుమార్ కమిషనర్ సత్యప్రణవ్ మున్సిపల్ చైర్ పర్సన్ సమిండ్ల వాణి శ్రీనివాస్ కౌన్సిలర్ చెట్టే గంగాధర్ కోరే గంగమ్మల్లు ఎంపీడీవో సలీం స్థానిక సర్పంచులు సొల్లు సురేందర్ రమేష్ మాజీ జడ్పీటీసీ మనోహర్ రెడ్డి రాజేందర్ రెడ్డి శేఖర్ గౌడ్ మాజీ పాక్స్ చైర్మన్ మల్లారెడ్డి సర్పంచులు బాస మహేష్ కొలపాక రాధ రాజు శేఖర్ బాపి రాజు నాయకులు మల్లేష్ రెడ్డి లక్ష్మణ్ గోపాల్ రాజేందర్ తిరుపతి రెడ్డి మాణిక్య రావు నాంపల్లి చిన్నారెడ్డి కచు రాజమల్లు దయాల కిష్టయ్య వార్డు సభ్యులు నాయకులు పాల్గొన్నారు

### యువత నైపుణ్యాభివృద్ధితోనే..

# ఉపాధి సాధ్యం

**- రాష్ట్ర ఐటి శాఖా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు**



**పెద్దపల్లి, మే06 (వుదయం ప్రతినిధి)** నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాల దిశగా మెగా జాబ్ మేళా నిర్వహిస్తుందని రాష్ట్ర ఐటి, పరిశ్రమలు, శాసన సభ వ్యవహారాల శాఖా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు.బుధవారం పెద్దపల్లి పట్టణంలోని వెంకట పద్మ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన మెగా జాబ్ మేళాలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పెద్దపల్లి పార్లమెంట్ సభ్యుడు గడ్డం వంశీకృష్ణ, ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణారావు, జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్‌లతో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి దుదిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం యువతకు ఉపాధి అవకాశాల సృష్టిపై ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. గతంలో జవహర్‌లాల్ నెహ్రూ నాలెడ్జ్ సెంటర్లు ఉండగా, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మొదటిసారిగా పెద్దపల్లిలో టాస్క్ (TASK) రీజినల్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గత రెండు సంవత్సరాల్లో టాస్క్ ద్వారా శిక్షణ పొందిన అనేక మంది విద్యార్థులు ఉద్యోగాలు పొందగా, 261 మంది ప్రముఖ మల్టీనేషనల్ కంపెనీల్లో ఉపాధి పొందినట్లు పేర్కొన్నారు.నైపుణ్యాలు ఉంటేనే ఉద్యోగాలు లభిస్తాయని, మంత్రి, ఎమ్మెల్యేల పట్ల గౌరవం ఉన్నప్పటికీ యువతకు తగిన నైపుణ్యాలు లేకపోతే ఉద్యోగాలు రావని స్పష్టం చేశారు. ఇంజినీరింగ్, ఎంసీఏ, ఎంఏ మ్యాథ్స్, ఎంఏ ఫిజిక్స్ వంటి విద్యార్థులు ఉన్నా పరిశ్రమల అవసరాలకు అనుగుణమైన నైపుణ్యాలు లేకపోతే ఉద్యోగాలు సాధ్యం కాదని యువత గుర్తుంచుకోవాలని సూచించారు.ఈ రోజు నిర్వహించిన మెగా జాబ్ మేళాలో 77 కంపెనీలు పాల్గొని 4 వేల ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయడానికి ముందుకు వచ్చాయని, అయితే 1500 మంది మాత్రమే షార్ట్‌లిస్ట్ అయ్యారని తెలిపారు. గోల్డ్ మెడలిస్ట్‌లు అయినా సరే సాఫ్ట్ స్కిల్స్, ప్రెజెంటేషన్ స్కిల్స్ లేకపోతే పరిశ్రమలకు పనికిరావని పేర్కొన్నారు. యువతకు తగిన నైపుణ్యాలు కల్పించేందుకు స్కిల్ యూనివర్సిటీ, ఏటీసీ సెంటర్లు, టాస్క్ సెంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సుమారు 70 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసినట్లు పేర్కొంటూ, ప్రైవేట్ రంగంలో కూడా ఉపాధి అవకాశాలు పెంచేందుకు భారీ పెట్టుబడులను తీసుకువస్తున్నామని తెలిపారు. నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలనుకునే పెద్దపల్లి యువతకు స్కిల్ యూనివర్సిటీలో అవకాశాలు కల్పించి ఉపాధి కల్పించడం తన బాధ్యత అని మంత్రి హామీ ఇచ్చారు. తెలంగాణ ప్రభుత్వం ప్రారంభించిన డిజిటల్ ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ తెలంగాణ (DEET) దేశంలోనే ప్రత్యేకమైన వేదికగా ఉందని, ఇందులో నమోదు చేసుకుంటే అభ్యర్థుల నైపుణ్యాలను విశ్లేషించి తగిన పరిశ్రమలలో ఉద్యోగ అవకాశాలు కల్పించేలా వ్యవస్థ పనిచేస్తుందని తెలిపారు. ప్రతి విద్యార్థి ఈ వేదికలో నమోదు కావాలని సూచించారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రూప్ పరీక్షలను సక్రమంగా నిర్వహించలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రూప్ 1, 2, 3, 4 పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. యువత నూతన సాంకేతికతలను ఆచరించి తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచిస్తూ, యువత సంక్షేమం కోసం ప్రతి నిమిషం పనిచేసే ప్రభుత్వం ఇదేనని పేర్కొన్నారు. యువత సంక్షేమంతోనే "తెలంగాణ రైజింగ్" సాధ్యమవుతుందని, యువతకు మంచి భవిష్యత్తు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో కేంద్ర ప్రభుత్వం సంవత్సరానికి 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చినా అమలు కాలేదని, బీఆర్ఎస్ కూడా అనేక హామీలు ఇచ్చినా అమలు చేయలేదని విమర్శించారు. సుమారు 30 వేల మంది గ్రాడ్యుయేట్లు ఉన్నారని, అక్కడ కూడా మెగా జాబ్ మేళాను నిర్వహించాలని మంత్రి గారిని కోరారు. సింగరేణి, ఎన్‌టీపీసీ వంటి సంస్థలు, ప్రభుత్వం కలిసి రామగుండంలో నైపుణ్యాభివృద్ధి కేంద్రాలను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. జిల్లా గ్రంథాలయ చైర్మన్ అన్నయ్య గౌడ్, రామగుండం మేయర్ మహంకాళి స్వామి, అధికారులు, ప్రజాప్రతినిధులు, పాల్గొన్నారు.

# వృద్ధుల పోషణ విస్మరిస్తే జైలుకే...!

**- మెట్ పల్లి ఆర్డీవో జి నర్సింహారావు**



**మెట్ పల్లి మే 06 (వుదయం ప్రతినిధి)**

వృద్ధ తల్లిదండ్రులను విస్మరించే పిల్లలు శిక్షార్హులేనని వారికి జైలు శిక్ష విధించే వీలు చట్టంలో ఉందని మెట్ పల్లి ఆర్డీవో జి నర్సింహా రావు అన్నారు బుధవారం మెట్ పల్లి డివిజన్ ఆర్డీవో ఛాంబర్లో తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్ ఆధ్వర్యంలో ఆర్డీవో నర్సింహా రావును జిల్లా డివిజన్ ప్రతి నిధులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు జిల్లా శాఖ ముద్రించిన వృద్ధుల సంరక్షణ పుస్తకాలను ఆర్డీవో ఆవిష్కరించారు ఈసందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ వృద్ధ తల్లిదండ్రులను పోషించకుండా వేధింపులకు నిరాధరణకు గురి చేస్తే 6 మాసాల జైలు శిక్షతో పాటు తల్లిదండ్రుల నుంచి తీసుకున్న ఆస్తులను తిరిగి ఆ తల్లిదండ్రుల పేరిట పట్టా మార్పిడి చేయించడం జరుగుతుందని హెచ్చరించారు జిల్లాలో రెవిన్యూ ఉద్యోగుల గౌరవాధ్యక్షులుగా సీనియర్ సిటిజన్స్ జిల్లా అధ్యక్షులుగా ఉద్యోగులకు పెన్షనర్లకు వయోధికులకు సేవలందిస్తున్న జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్ ను వారి ప్రతినిధులను అభినందించారు ఈకార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్.రిటైర్డ్ తహసీల్దార్ పి హన్మంత్ రెడ్డి సీనియర్ సిటిజన్స్ మెట్ పల్లి డివిజన్ అధ్యక్షులు వొజ్జెల బుచ్చిరెడ్డి కార్యదర్శి సౌదాల కమలాకర్ ఉపాధ్యక్షులు మద్దెల స్వామి ఎండి యాకూబ్ తదితరులు పాల్గొన్నారు

### ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఇన్చార్జిని నియమించకపోవడం విడ్డూరం



**మంథని మే 5, వుదయం** మంథని: మండలం అడవిసోమన్‌పల్లి గ్రామంలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఇంచార్జ్ నియామకంపై రాజకీయ వివాదాల వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ఆరోపించారు. కేంద్రాన్ని సందర్శించిన ఆయన, అకాల వర్షంతో తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. నెలరోజులుగా కొనుగోళ్లు ప్రారంభం కాకపోవడంతో రైతులు నష్టపోతున్నారని అన్నారు. కాంటాలు, గన్నీసంచులు ఆలస్యంగా అందించడంతో పాటు ఇంచార్జ్ నియామకం జరగకపోవడం సమస్యలకు కారణమైందని పేర్కొన్నారు. ఇప్పటివరకు కొనుగోళ్లు ప్రారంభం కాకపోవడంతో పెద్దఎత్తున వడ్లు తడిసిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి ప్రాతినిధ్యం వహించే ప్రాంతంలోనే గింజ కొనుగోలు ప్రారంభం కాకపోవడం బాధాకరమని విమర్శించారు. వెంటనే అధికారులు స్పందించి కొనుగోళ్లు ప్రారంభించి రైతులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రోడ్డు దిగ్బంధానికి దిగుతామని హెచ్చరించారు.

# నూతన డీఎస్పీకి ఘన సన్మానం



**ఆసిఫాబాద్:( వుదయం ప్రతినిధి )** ఆసిఫాబాద్ నూతన డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన బి. అశోక్ ను బుధవారం ఆసిఫాబాద్ మున్సిపల్ చైర్మన్ ఆకాష్, వైస్ చైర్మన్ ఎండీ అహ్మద్, సింగిల్ విండో చైర్మన్ అలీ బీన్ అహ్మద్ లు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కౌన్సిలర్లతో కలిసి డీఎస్పీని శాలువాతో ఘనంగా సన్మానించారు. కౌన్సిలర్లు బాలకృష్ణ, సాలం బీన్ అహ్మద్, మాజీ సర్పంచ్ బలరాం నాయక్, బీఆర్ఎస్ నాయకులు సయ్యద్ నిసార్, సాయి శ్రావణ్ తదితరులు పాల్గొని నూతన డీఎస్పీకి అభినందనలు తెలిపారు.

### ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

**- జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్**



**కోరుట్ల మే 06 (వుదయం ప్రతినిధి)** జిల్లాలోని మెట్ పెల్లి మండల పరిధిలోని చిట్టాపూర్ విట్టంపేట గ్రామాల్లో వరి ధాన్య కొనుగోలు కేంద్రాలను బుధవారం జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ ఆకస్మికంగా పరిశీలించారు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ మాట్లాడుతూ కేంద్రాలకు వచ్చిన వరి ధాన్యాన్ని మ్యాచర్ వచ్చిన వెంటనే ఆలస్యం లేకుండా తూకం వేసి మిల్లులకు తరలించాలని అధికారులను ఆదేశించారు రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సకాలంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు ధాన్యం తూకం నిల్వ రవాణా ప్రక్రియల్లో ఎటువంటి నిర్లక్ష్యం ఉండకూడదని రైతులకు సమగ్ర సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు తెలిపారు అదేవిధంగా రాష్ట్రంలో జిల్లాలో అకాల వర్షాలు ఉన్నందున వారి ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహకులు కొనుగోలు కేంద్రాల నిర్వహకులు గన్ని సంచులు టార్పలిన్ లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే డాటా ఎంట్రీ ఆన్లైన్ చేసి రైతులకు ఖాతాలో డబ్బులు జమ అయ్యే విధంగా చుడాలన్నారు అదేవిధంగా మిల్లుల వద్ద త్వరగా అన్లోడింగ్ చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద టార్పాలిన్ కవర్లు అవసరం మేరకు అందుబాటులో ఉంచుకొని పాడీని ప్రొటెక్ట్ చేయాలన్నారు ఈ పరిశీలనలో మెట్ పెల్లి ఆర్డీవో నరసింహ రావు మండల తహసిల్దార్ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు

## ధాన్యపు సంచులను భద్రంగా నిల్వ చేయాలి: కలెక్టర్ భవేశ్ మిశ్రా



**నిర్మల్ జిల్లా (వుదయం ప్రతినిధి)** ధాన్యపు సంచులను భద్రంగా నిల్వ చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు గోదామును పరిశీలించారు. గోదాములో ధాన్యపు డంపింగ్ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, లారీలలో వచ్చిన దాన్యపు సంచులను ఎప్పటికప్పుడు భద్రంగా నిలువ చేయాలన్నారు. ఎక్కువమంది హమాలీలను నియమించుకొని వెంటవెంటనే ధాన్యపు సంచుల డంపింగ్ ప్రక్రియ చేపట్టాలన్నారు. ఇప్పటివరకు నిల్వ చేసిన ధాన్యపు సంచుల వివరాలు, అన్లోడింగ్ కు వరుసలో సిద్ధంగా ఉన్న లారీల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం సమీపంలోనే ఏర్పాటుచేసిన వరి, మొక్కజొన్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించి, ధాన్యం కొనుగోలు ప్రక్రియను తనిఖీ చేశారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, పౌర సరఫరాల అధికారి, మేనేజర్ లు రాజేందర్, సుధాకర్ లు, తహసిల్దార్ రాజు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ భీమ్ రెడ్డి, పాల్గొన్నారు.

## ఆయిల్ ఫామ్ సాగుతో రైతులకు అధిక ఆదాయం

**- జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్**



**కామారెడ్డి, మే 6 (వుదయం ప్రతినిధి):** కామారెడ్డి జిల్లా తాడ్వాయి మండలం ఎండ్రియాల్ గ్రామ శివారులో రైతు బొక్క హన్మాండ్లు మూడున్నర ఎకరాలలో సాగు చేస్తున్న అయిల్ ఫామ్ తోటను బుధవారం జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ సందర్శించారు. తోటలో మొక్కల పెరుగుదల, నిర్వహణ విధానాలు, సాగు పద్ధతులను పరిశీలించిన కలెక్టర్ పంట అభివృద్ధిపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతు బొక్క హన్మాండ్లు మాట్లాడుతూ, 2022 సంవత్సరంలో మూడున్నర ఎకరాలలో అయిల్ ఫామ్ పంటను ప్రారంభించినట్లు తెలిపారు. మూడున్నర ఎకరాలలో అయిల్ ఫామ్‌తో పాటు అంతర్ పంటలుగా కూరగాయలు, సోయా, ఆకుకూరలు, పండ్ల తోటలను సాగు చేస్తూ ఏడాదికి సుమారు రూ.1.20 లక్షల ఆదాయం పొందుతున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, సంప్రదాయ పంటలతో పాటు మార్కెట్ డిమాండ్ ఉన్న వాణిజ్య పంటలు, అంతర్ పంటల సాగు ద్వారా రైతులు ఆదాయాన్ని పెంచుకోవచ్చని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలు, సాంకేతిక సలహాలను వినియోగించుకొని మరిన్ని రైతులు అయిల్ ఫామ్ సాగుపై ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జి హెచ్ ఎస్ ఓ జ్యోతి, సీపీవో, డిఎల్పీవో, తహశీల్దార్, ఎంపీవో, సర్పంచ్, సంబంధిత శాఖల అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# కేంద్రం మొండివైఖరితోనే ధాన్యం సేకరణలో జాప్యం

**నిబంధనలు సడలించి కొనుగోలుకు సీఎం రేవంత్ ఆదేశం**
**తడిసిన ధాన్యం,మక్కజొన్నలను పరిశీలించిన మంత్రి అడ్లూరి**
**ప్రతి గింజా కొంటాం**
**రైతులు ఆందోళన చెందవద్దు**





**ధర్మపురి,మే06(వుదయం ప్రతినిధి):** కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న అనాలోచిత విధానాలు, కఠిన నిబంధనల వల్లే రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ ఆలస్య మైందని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ విమర్శిం చారు. మంగళవారం రాత్రి జగి త్యాల జిల్లాలో కురిసిన అకాల వర్షాలకు ధర్మపురి మార్కెట్ యార్డులో తడిసిన వరి ధాన్యం, మక్కజొన్నలను బుధవారం ఉదయం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులను పరామ ర్శించి,కొనుగోలు ప్రక్రియను వేగ వంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన ఆన్‌లైన్ విధానం, ట్రక్ శీట్ నిబంధనలు, వాహనాలకు జీపీఆర్ఎస్ వంటి సాంకేతిక అంశాల వల్ల క్షేత్రస్థాయిలో ధాన్యం సేకరణ 15 రోజులు ఆలస్యమైందని వివరించారు. ఈ నిబంధనల వల్ల రైతులు పడుతు న్న ఇబ్బందులను గమనించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వెంటనే స్పందించి నిబంధనలను సడలించారని తెలిపారు. పాత పద్ధతిలోనే ధాన్యం కొనుగోలు చేయాలని సీఎం ఆదేశించడంతో ప్రస్తుతం ప్రక్రియ వేగంగా సాగు తోందన్నారు.రైతులు పండించిన ప్రతి గింజా కొనుగోలు చేసే బాధ్య త నాది. ఎవరూ ఆందోళన చెంది రోడ్ల మీదకు రావద్దు.వారం పది రోజుల్లో యార్డుల్లో ఉన్న ధాన్యం, మక్కజొన్నలను పూర్తిగా సేకరిస్తాం.ధాన్యం సేకరణలో జాప్యం జరగకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా వెంటనే అధికారులకు ఫోన్ ద్వారా సమాచారం అందించా లని, సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే తక్షణమే పరిష్కరి స్తానని హామీ ఇచ్చారు. అకాల వర్షాల నేపథ్యంలో తడిసిన ధాన్యం విషయంలో రైతులు నష్టపోకుండా చర్యలు తీసుకో వాలని అధికారులను పురమా యించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంగనభట్ల దినేష్, నేతలు చిలు ముల లక్ష్మణ్, వేముల రాజేష్, చీపురుశెట్టి రాజేష్ పాల్గొన్నారు.

## ఉచిత వైద్య సేవలపై ఉదారతను చాటాలి

**- ప్రైవేటు ఆస్పత్రులు, స్వచ్ఛంద సంస్థలకు ఎమ్మెల్యే కవ్వంపల్లి పిలుపు**




**కరీంనగర్ (వుదయం ప్రతినిధి):** పేదలకు ఉచిత వైద్య సేవలు అందించడంపై ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యాలు ఉదారతను చాటుకోవాలని ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఎస్సీ సెల్ చైర్మన్, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని రెనీ హాస్పిటల్లో దివంగత బంగారి లక్ష్మీ మైసయ్యల స్మారకార్థం శ్రీ మహేశ్వర చారిటేబుల్ ట్రస్ట్ ద్వారా ఉచిత కీళ్ల మార్పిడి శస్త్ర చికిత్సలు చేయించుకున్న 15 మందికి పేషెంట్ల డిశ్చార్జ్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ ఖర్చుతో కూడుకున్న శస్త్ర చికిత్సలను ఉచితంగా అందించడం సంతోషకరమన్నారు. ఈ తరహా ఉచిత వైద్య సేవలు అందించేందుకు ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యాలే కాకుండా స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని ఆయన కోరారు. భవిష్యత్ లోనూ మరిన్న వైద్య సేవలు అందించాలని ఆయన నిర్వాహకులు కోరారు. ఉచిత కీళ్ల మార్పడి శస్త్ర చికిత్సలు చేయించిన శ్రీ మహేశ్వర చారిటేబుల్ ట్రస్ట్ నిర్వాహకులను, రేనే ఆస్పత్రి యాజమాన్యాన్ని ఆయన అభినందించారు.ఈ కార్యక్రమంలో రేనీ ఆస్పత్రి యాజమాన్యంతో పాటు పలువురు డాక్టర్లు,పేషెంట్ల తాలూకు బంధువులు తదితరులు పాల్గొన్నారు.

"మంత్రితో కలిసి పెళ్లికి కవ్వంపల్లి హాజరు" హుస్నాబాద్ నియోజకవర్గ కేంద్రంలోని కే.జే.ఆర్ గార్డెన్స్ లో బుధవారం జరిగిన అక్కన్నపేట మండలం చౌటపల్లి గ్రామానికి చెందిన ఎరుక రాజయ్య గౌడ్ భాగ్యమ్మ దంపతులు కుమార్తె రమ్య వివాహానికి రాష్ట్ర బీసీ సంక్షేమం రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తో కలిసి టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు నూతన వధూవరులకు శుభాకాంక్షలు చెబుతూ ఆశీర్వాదాలు అందజేశారు.

"గన్ మెన్ పెళ్లికి కవ్వంపల్లి" మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ వద్ద గన్ మెన్ గా విధులు నిర్వహిస్తున్న తమ్మనవేణి రమేశ్ యాదవ్ వివాహం బుధవారం నగునూర్ లోని బీ.ఎం. ఆర్ గార్డెన్స్ లో జరిగింది. ఈ వివాహ వేడుకకు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు.



## మహిళా పాలిటెక్నిక్ అడ్మిషన్లు

### ప్రభుత్వ కళాశాలల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల

**జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**
**గద్వాల మే 06**
**(వుదయం ప్రతినిధి)**

శ్రీమతి దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ ప్రభుత్వ మహిళా సాంకేతిక శిక్షణా సంస్థలో 202627కు పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సులకు అర్హత గల బాలికల నుండి దరఖాస్తు లను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ నందు 3 సంవత్సరాల పాలిటెక్నిక్ డిప్లమా కోర్సులకు 2026 27 విద్యా ని దివ్యాంగ బాలికలకు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ సంస్థలో సివిల్, ఎలక్ట్రికల్ & ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్, ఎలక్ట్రానిక్స్ & కమ్యూనికేషన్, సెమీకండక్టర్ టెక్నాలజీ, ల్యాండ్‌స్కేప్ డిజైన్ వంటి డిప్లొమా కోర్సులు అందుబాటులో ఉన్నాయని, ప్రతి కోర్సులో 60 సీట్ల చొప్పున మొత్తం 360 సీట్లు ఉన్నాయని చెప్పారు. ఈ మొత్తం సీట్లలో 70% సీట్లు అనాథ, నిరాశ్రయ బాలికలకు కేటాయించబడినట్లు, అలాగే 3% సీట్లు దివ్యాంగులకు కేటాయించినట్లు తెలిపారు.అర్హతగా కనీసం పదవ తరగతి ఉత్తీర్ణత ఉండాలని, పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష రాయకపోయినా దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులకు ఉచిత విద్యతో పాటు వసతి సౌకర్యం కూడా కల్పించబడుతుందని తెలిపారు. కుల,ఆదాయ ధృవీకరణ పత్రాలు (అనాథలకు మినహాయింపు), తల్లిదండ్రుల మరణ ధృవీకరణ పత్రం, సంబంధిత సంస్థ నుండి బోనఫైడ్ సర్టిఫికేట్, టీసీ, అధ్యయన ధృవీకరణ పత్రం, పదవ తరగతి మార్కుల మెమో సమర్పించాలన్నారు. అభ్యర్థులు అవసరమైన ధృవీకరణ పత్రాలతో పాటు పూర్తి చేసిన దరఖాస్తులను మే 25,2026లోగా హైదరాబాద్‌లోని డైరెక్టర్, మహిళాభివృద్ధి&శిశు సంక్షేమ శాఖ #83222, మధురానగర్, సారథి స్టూడియో సమీపంలో, యూసఫ్ గూడ,అమీర్‌పేట్, హైదరాబాద్ -500038 కార్యాలయానికి పంపించాలని సూచించారు. మరిన్ని వివరాలకు గద్వాల పాత కలెక్టరేట్‌లోని బాలరక్షా భవన్‌ను సంప్రదించవచ్చని కలెక్టర్ తెలిపారు.

# రైతు 'రాజు' కావాలి

**రైతు రాజు కావాలి అంటే రైతుకు భూసారం, లాభసాటి పంటల సాగు, ప్రభుత్వ చేయుతపై అవగాహన కలిగి ఉండాలి – జిల్లా కలెక్టర్**

**కలెక్టర్ ఆదర్శ్ సురభి**
**వనపర్తి మే 06 (వుదయం ప్రతినిధి)**






రైతులు ఒకే రకమైన పంట కాకుండా తరచుగా పంట మార్పిడి, భూసారం, ప్రభుత్వం, బ్యాంకులు అందిస్తున్న సహకారం పై రైతుకు పూర్తి అవగాహన కలిగి ఉన్నప్పుడే రైతు మంచి లాభాలు పొందుతూ రాజుగా ఉంటాడని లేకుంటే కష్టాలు ఎదుర్కోవాల్సి వస్తుందని వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. బుధవారం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగ గోపాల్ పేట మండలం సహకార సంఘం ఆధ్వర్యంలో గోపాల్పేట రైతు వేదికలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మే, 4వ తేదీ నుండి 9వ తేదీ వరకు జిల్లాలో రైతు వారోత్సవాలు నిర్వహించడం జరుగుతుందని, రైతు అనుబంధ శాఖలు నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాల్లో రైతులకు పంట సాగు పై మెళుకువలు, పంట మార్పిడి వల్ల లాభాలు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా రైతులకు అందిస్తున్న ప్రోత్సాహకాలు, బ్యాంకు ఋణాలు తదియత అంశాల పై రైతులకు అవగాహన కల్పించడం జరుగుతుందనీ చెప్పారు. రైతులకు భూ ఆరోగ్య కార్డు (సాయిల్ హెల్త్ కార్డ్) ఇవ్వడం జరుగుతుందని, శాస్త్రజ్ఞులు రైతు పొలాన్ని పరిశీలించి భూమిలో ఉన్న సారం, భూమిలో నత్రజని, పోటాష్, భాస్వరం తదితర ఏ ధాతువు తక్కువ అయ్యింది, ఏది ఎక్కువ అయ్యింది అనేదానిపై అధ్యయనం చేసి అట్టి పొలంలో ఎలాంటి పంటలు వేసుకోవాలి, ఎలాంటి ఎరువులు ఎంత మోతాదులో వేయాలి అనే అంశాలను సాయిల్ హెల్త్ కార్డు ద్వారా రైతులకు తెలియపరచడం జరుగుతుందని తెలిపారు.

అందువల్ల జిల్లాలోని రైతులు అందరూ సాయిల్ హెల్త్ కార్డుకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మోతాదుకు మించి యూరియా వాడటం వల్ల తాత్కాలికంగా మొక్కలు పచ్చగా ఏపుగా కనిపిస్తుంది కానీ ముద్దగా ఏర్పడి పంట దిగుబడి, నాణ్యత తగ్గిపోతుందని తెలియజేశారు. అదేవిధంగా కిసాన్ క్రెడిట్ కార్డు ప్రతి రైతు తీసుకొని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బ్యాంకులో రైతులకు కేవలం 79 శాతం వడ్డీతో రుణాలు అందిస్తాయని, వాటిని సకాలంలో తిరిగి చెల్లిస్తే కేంద్ర ప్రభుత్వం ద్వారా 3 శాతం వడ్డీని తిరిగి రైతుకు చెల్లిస్తుందని చెప్పారు. ప్రతిసారి ఒకే రకమైన పంట వేయడం వల్ల భూమి సారం కోల్పోయి దిగుబడి తగ్గిపోతుందని అందువల్ల తరచుగా పంట మార్పిడి చేస్తూ ఉంటేనే భూమి సారవంతంగా ఉండి మంచి దిగుబడి ఇస్తుందన్నారు. భావితరాలకు సైతం మంచి సారవంతమైన భూమిని అందించాల్సిన బాధ్యత అందరూ రైతులపై ఉందన్నారు. అందువల్ల కేవలం వరి పంట సాగు మాత్రమే కాకుండా వేరు సెనగ, పామాయిల్, కూరగాయలు తదితర వాణిజ్య పంటలు సాగుచేసుకొని రైతులు లాభాలు పొందాలని సూచించారు.

జిల్లాలో గన్ని బ్యాగుల కొరత రానివ్వబోమని, పశ్చిమ బెంగాల్లో ఎన్నికలు, పశ్చిమాసియాలో యుద్ధాల వల్ల గన్ని బ్యాగుల సరఫరాలో కొంత జాప్యం జరిగిందని దీనిని త్వరలో అధిగమించడం జరుగుతుందన్నారు. ఈరోజు రేవల్లి మండలానికి 10 వేల గన్ని బ్యాగులు పంపించడం జరుగుతుందని, మిగిలిన మండలాలకు సైతం కొరత లేకుండా చేసి వరి, మొక్క జొన్న ధాన్యం కొనుగోలును వేగవంతం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో గోపాల్పేట పి. ఎ.సి.ఎస్ చైర్మన్ ఎల్. రఘు, రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ ప్రసాద రావు, జిల్లా కో ఆపరేటివ్ అధికారి బి. రాణి, జిల్లా వ్యవసాయ అధికారి ఆంజనేయులు, నాబార్డ్ డి డి.యం. మనోహర్ రెడ్డి, ఎల్.డి.యం శివకుమార్ సైతం రైతులకు వ్యవసాయ సాగు, రుణాల పై అవగాహన కల్పించారు. తహసిల్దార్ తిలక్, ఎంపీ.డి.ఒ, గోపాల్పేట, రేవల్లి, ఎదుల గ్రామాల సర్పంచులు, మండల వ్యవసాయ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఈవీఎం గోడౌన్ ను పరిశీలించిన జిల్లా కలెక్టర్

**జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**
**గద్వాల మే 06**
**(వుదయం ప్రతినిధి)**



జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమీపంలో ఉన్న ఈవీఎం గోడౌన్ ను ఈవీఎంల నెలవారి సాధారణ తనిఖీలో భాగంగా బుధవారం కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సందర్శించారు. ఈవీఎంలు, బ్యాలెట్ యంత్రాల విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు, సిబ్బందికి సూచించారు. సందర్శనలో భాగంగా తనిఖీ రిజిస్టర్ లో కలెక్టర్ సంతకాలు చేశారు.
ఈ తనిఖీలో ఎన్నికల విభాగం పర్యవేక్షకులు మంజుల, సంబంధిత ఎన్నికల విభాగం అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్ ను సన్మానించిన పేట అక్రిడేషన్ కమిటీ సభ్యులు



**నారాయణపేట మే6**
**(వుదయం ప్రతినిధి)**

నారాయణపేట జిల్లా నూతన కలెక్టర్ గా బాధ్యత లు స్వీకరించిన కలెక్టర్ సి ఎచ్ ప్రియాంక ను బుధవారం
నారాయణపేట జిల్లా అక్రెడిటేషన్ కమిటీ సభ్యులు మర్యాద పూర్వకంగా కలిసి శాలువా, బోకేతో సన్మానించి అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో డి పి ఆర్ ఓ రషీద్,సభ్యులు రాజు,శ్రీధర్, నారాయణ,తకి పాల్గొన్నారు.

# గ్రామీణ విద్యార్థులకు రవాణా సౌలభ్యం

- విద్యనే సమాజ అభివృద్ధికి దోహదపడుతుంది,
- ఎంపీ మల్లు రవి చొరవతో విద్యార్థుల సంక్షేమానికి ప్రోత్సాహం,
- జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్,
- ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి, పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి





**నాగర్ కర్నూల్ మే 06**
**(వుదయం ప్రతినిధి)**

బుధవారం నాడు
ఐడిఓసి కార్యాలయ ఆవరణలో నాగర్ కర్నూల్ నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఎనిమిదో తరగతి చదివే కుమ్మెర, పెద్దాపూర్, గన్యాగుల,
మంతటి, గగ్గలపల్లి, నార్లాపూర్, పాఠశాలల విద్యార్థులకు నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి ప్రత్యేక చొరవతో, జిందాల్ స్టీల్ పవర్ సంస్థ సౌజన్యంతో సిఎస్ఆర్ నిధుల ద్వారా జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో 7వ తరగతి పూర్తి చేసిన 130 మంది విద్యార్థులు, విద్యార్థినులకు సైకిళ్లను పంపిణీని కార్యక్రమాన్ని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్, నాగర్ కర్నూల్ శాసనసభ్యులు డాక్టర్ కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి లతో కలిసి ఎంపీ డాక్టర్ మల్లు రవి పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముందుగా కొమ్మెర గ్రామ విద్యార్థులు 48 మంది విద్యార్థులకు, ఎంపీ డాక్టర్ మల్లు రవి, జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్, నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి కలిసి విద్యార్థులకు సైకిళ్లను అందజేశారు.ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ మల్లు రవి మాట్లాడుతూ,------ గ్రామీణ ప్రాంతాల్లో చదువుతున్న విద్యార్థులు విద్యను కొనసాగించడంలో ఎదుర్కొనే ప్రధాన సమస్యలలో ఒకటి రవాణా సౌకర్యం అని తెలిపారు. ఈ సమస్యను దృష్టిలో ఉంచుకుని సైకిళ్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టినట్లు, సైకిళ్లు అందించడం ద్వారా విద్యార్థులు పాఠశాలకు సమయానికి హాజరు కావడంతో పాటు, వారి విద్యపై ఆసక్తి మరింత పెరుగుతుందని ఎంపీ అభిప్రాయపడ్డారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు.ఈ విద్యా సంవత్సరం 10వ తరగతి ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిందని అందుకు కృషి చేసిన విద్యార్థులకు అధికారులకు ఆయన అభినందించారు. రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని వచ్చే విద్యా సంవత్సరం నుంచి అంగన్వాడి నుండి ఇంటర్మీడియట్ వరకు విద్యార్థులకు మధ్యాహ్న భోజనంతో పాటు అల్పాహారం సైతం అందించేందుకు కసరతులు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. జిందాల్ స్టీల్ పవర్ సంస్థ సిఎస్ఆర్ కార్యక్రమాల ద్వారా సమాజానికి చేస్తున్న సేవలు ప్రశంసనీయమని ఎంపీ పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా సంస్థ ఇలాంటి కార్యక్రమాలను విస్తరించాలని కోరారు. ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమానికి అనేక పథకాలను అమలు చేస్తోందని, వాటితో పాటు ప్రైవేట్ సంస్థల సహకారం ఉంటే విద్యా రంగం మరింత బలపడుతుందని తెలిపారు. జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ మాట్లాడుతూ,------ విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణంలో ఇలాంటి పాత్ర సైకిళ్లు అందడం వల్ల విద్యార్థుల హాజరు శాతం పెరగడంతో పాటు, చదువులో మంచి ఫలితాలు సాధించే అవకాశాలు ఎక్కువవుతాయని,
విద్యార్థులు తమ లక్ష్యాలను నిర్దేశించుకుని కష్టపడి చదవాలని ప్రతిరోజు పాఠశాలకు హాజరుకావాలని కలెక్టర్ ఈ సందర్భంగా కోరారు.నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి మాట్లాడుతూ..., మొట్టమొదటిగా నాగర్ కర్నూల్ నియోజకవర్గం పరిధిలోని విద్యార్థులకు అందజేయడం చాలా సంతోషించదగ్గ విషయమని ఆయన ఎంపీకి సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.ప్రభుత్వ పాఠశాలల్లో చదివే 8, 9 ,10,వ తరగతి విద్యార్థులకు షూ అందజేసే కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే సి ఎస్ ఆర్ నిధులతో ఏర్పాటు చేయాలని ఎంపీ ని కోరగా, అందుకు సానుకూలంగా స్పందించిన ఎంపీ సిఎస్ఆర్ నిధులతో విద్యార్థులకు అవసరమైన కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు ఎంపీ తెలిపారు. సైకిళ్ల ద్వారా విద్యార్థులు సులభంగా పాఠశాలకు వెళ్లగలరని, తద్వారా వారి చదువు అంతరాయం లేకుండా కొనసాగుతుందని గ్రామీణ విద్యార్థులు ఎదుర్కొనే ఇబ్బందులను తగ్గించే దిశగా ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తూ, ఇలాంటి సహాయం అందించిన ఎంపీ డాక్టర్ మల్లు రవి, జిందాల్ స్టీల్ పవర్ సంస్థ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. సైకిళ్లు తమ చదువుకు ఎంతో ఉపయోగపడతాయని, ఇకపై మరింత కృషి చేసి మంచి ఫలితాలు సాధిస్తామని విద్యార్థులు తెలిపారు.ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి కురుమయ్య,జింగల్ సంస్థ ప్రతినిధి రెడ్డి నాయక్ ,జిల్లా విద్యాశాఖ అధికారులు షర్పుద్దీన్, వెంకటేశ్వర్లు శెట్టి , పాఠశాల ఉపాధ్యాయులు, స్థానిక ప్రజాప్రతినిధులు , అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పాలిటెక్నిక్ కళాశాలలో దరఖాస్తుల ఆహ్వానం

**మహబూబ్ నగర్ మే6**
**\(వుదయం ప్రతినిధి)**

అనాథ బాలికల, దానికి గురైన అక్రమ రవాణా బాధిత బాలికల కోసం పాలిటెక్నిక్ కళాశాలలో హైదరాబాదులోని దుర్గాబాయి దేశ్ ముఖ్ ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో 2026 2027 విద్యాసంవత్సరానికి గాను దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మహబూబ్ నగర్ జిల్లా కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి పూర్తి చేసిన వారికి ఎలాంటి అర్హత లేకుండా 70 శాతం రిజర్వేషన్లు కల్పిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు మే 25వ లోపు జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయం రూమ్ నెంబర్ 36 ఐడిఓసి కాంప్లెక్స్ మహబూబ్ నగర్ లో దరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు.



## సిద్ధిపేటలో ప్రకృతి ప్రకోపం
### గాలివాన బీభత్సానికి కుప్పకూలిన భారీ వృక్షాలు

**సిద్దిపేట, మే 6 (వుదయం ప్రతినిధి)**

సిద్ధిపేట జిల్లాలో నిన్న రాత్రి ప్రకృతి బీభత్సం సృష్టించింది. అకస్మాత్తుగా వీచిన భారీ ఈదురుగాలులతో కూడిన వర్షం జిల్లా వ్యాప్తంగా అల్లకల్లోలం సృష్టించింది. ముఖ్యంగా గజ్వేల్, తొగుట, తూప్రాన్ నియోజకవర్గాల్లో గాలివాన తీవ్రత ఎక్కువగా ఉంది. భారీ గాలుల ధాటికి రహదారుల వెంబడి ఉన్న అనేక ఏళ్ల నాటి భారీ వృక్షాలు ఒక్కసారిగా నేలకూలాయి. ప్రధాన రహదారులపై చెట్లు విరిగి పడటంతో గంటల తరబడి ట్రాఫిక్ నిలిచిపోయింది. చెట్లు విద్యుత్ తీగలపై పడటంతో అనేక చోట్ల విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. దీని ఫలితంగా జిల్లాలోని దాదాపు 20 గ్రామాల్లో రాత్రంతా అంధకారం అలుముకుంది. ఈ అకాల వర్షం రైతుల పాలిట శాపంగా మారింది. చేతికి వచ్చిన పంట నీటిపాలవ్వడంతో రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. ఆరబోసిన ధాన్యం తడిసి ముద్దవగా, తోటల్లోని పంటలు నేలవాలాయి. సమాచారం అందుకున్న వెంటనే విద్యుత్ శాఖ మరియు మున్సిపల్ సిబ్బంది రంగంలోకి దిగారు.
రహదారులపై పడిన చెట్లను తొలగించి

రాకపోకలను పునరుద్ధరించేందుకు ప్రయత్నిస్తున్నారు. విరిగిపోయిన విద్యుత్ స్తంభాలను మార్చి, విద్యుత్ సరఫరాను పునరుద్ధరించే పనులను అధికారులు వేగవంతం చేశారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, విరిగి పడిన విద్యుత్ తీగల వద్దకు వెళ్లవద్దని అధికారులు సూచించారు.

## కొండపాక మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో రైతులకు రుణాలపై అవగాహన



**కొండపాక, 06 మే 2026 : వుదయం**

సిద్దిపేట జిల్లా : కొండపాక మార్కెట్ కమిటీ కార్యాలయంలో బుధవారం 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక' వారోత్సవాలు ఘనంగా జరిగాయి. మార్కెట్ కమిటీ చైర్మన్ విరూపాక శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్, కోఆపరేటివ్ బ్యాంక్ అధికారులతో కలిసి రైతులకు రుణ సదుపాయాలపై ప్రత్యేక చర్చా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం అందిస్తున్న వివిధ పథకాలను రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ముఖ్యంగా సబ్సిడీ రుణాలు, మార్టిగేజ్ లోన్లు, మరియు క్రాప్ లోన్ల (పంట రుణాలు) పొందే విధానంపై రైతులకు బ్యాంకు అధికారులు వివరించారు. అర్హులైన ప్రతి రైతుకు బ్యాంకుల ద్వారా ఆర్థిక వెసులుబాటు కల్పించడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్, డైరెక్టర్లు, వివిధ గ్రామాల సర్పంచులు, మండల పార్టీ అధ్యక్షుడు, బ్యాంకు మేనేజర్లు, స్థానిక నాయకులు మరియు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

**సంగారెడ్డి అడిషనల్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన టి.ఎల్. సంగీత**



**సంగారెడ్డి, మే 06 ,వుదయం**

సంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ)గా టి.ఎల్. సంగీత బుధవారం బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా కలెక్టరేట్ కార్యాలయ అధికారులు, సిబ్బంది ఆమెకు స్వాగతం పలికారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం రెవెన్యూ శాఖ అధికారులు ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అధికారులతో ఆమె సన్నిహితంగా పరిచయం చేసుకున్నారు. అడిషనల్ కలెక్టర్‌గా జిల్లా అభివృద్ధి, రెవెన్యూ పరిపాలనను మరింత సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని టి.ఎల్. సంగీత తెలిపారు.

## తాళం వేసిన ఇంట్లో అగ్ని ప్రమాదం



**అక్బరుపేట/**
**భూంపల్లి వుదయం (మే 06)**

తాళం వేసిన ఇంట్లో అగ్ని ప్రమాదం చోటు చేసుకున్న సంఘటనఅక్బర్‌పేట భూంపల్లి మండలం భూంపల్లి గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది.బొమ్మర శ్రీకర్ ఇంట్లో ప్రమాదవశాత్తు మంటలు చెలరేగాయి.కుటుంబ సభ్యులు ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి వెళ్లారు.అదే సమయంలో ఒక్కసారిగా ఇంట్లో మంటలు ఎగసిపడ్డాయి. దట్టమైన పొగలు కమ్ముకోవడంతో గమనించిన గ్రామస్తులు వెంటనే అప్రమత్తమయ్యారు . జె సీ బీ సహాయంతో డోర్లు పగలగొట్టి, మంటలు ఆర్పేందుకు గ్రామస్తులు స్వయంగా రంగంలోకి దిగారు. మంటలు అదుపులోకి రాకపోవడంతో ఫైర్ సిబ్బందికి, పోలీసులకు సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకునే సరికే. ఇంట్లోని కిరాణం షాపుతో పాటు ఫర్నిచర్, బట్టలు, విలువైన వస్తువులు పూర్తిగా దగ్ధమయ్యాయి. అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పేందుకు తీవ్రంగా శ్రమించి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.ఈ ప్రమాదంలో భారీగా ఆస్తి నష్టం వాటిల్లే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఒక్కసారిగా రోడ్డున పడ్డ కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు.విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణమా? లేక మరేమైనా కారణం ఉందా? అన్నది
పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.





## మిరుదొడ్డి తొలి మహిళా ఎస్సై బదిలీ

**దుబ్బాక వుదయం (మే 06)**

: సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి పోలీస్ స్టేషన్‌లో కీలక మార్పు చోటుచేసుకుంది. మండల చరిత్రలో మొట్టమొదటి మహిళా ఎస్ఐగా సేవలందించిన సమత బదిలీపై వెళ్తున్నారు. గత ఏడాది కాలంగా మిరుదొడ్డి పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వర్తించిన SI సమత, యూరియా పంపిణీ సమయంలో రైతులకు అండగా నిలిచారు. మహిళా అధికారి అయినప్పటికీ డ్రగ్స్, బెట్టింగ్ యాప్స్, సోషల్ మీడియా దుర్వినియోగం పై గ్రామాల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించి మండల ప్రజల మన్ననలు పొందారు. జమ్మికుంట పోలీస్ స్టేషన్ నుంచి అందే సతీష్ మిరుదొడ్డి కొత్త ఎస్ఐగా బాధ్యతలు చేపట్టనున్నారు. త్వరలో ఆయన విధుల్లో చేరనున్నారు. అంకితభావంతో పనిచేసిన SI సమత సేవలను మిరుదొడ్డి మండల ప్రజలు గుర్తు చేసుకుంటున్నారు.

# బార్డర్లలో గట్టి నిఘా

### పశువులను అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవు

**జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా,**
**వికారాబాద్ మే 06**
**(వుదయం ప్రతినిధి)**




రాబోయే బక్రీద్ పండుగ సందర్భంగా జిల్లాలో శాంతి భద్రతలను పటిష్టంగా నిర్వహించేందుకు జిల్లా పోలీస్ శాఖ ,పశుసంవర్ధక శాఖల సంయుక్త సమన్వయంతో జిల్లా పోలీస్ కార్యాలయంలో కొ ఆర్డినేషన్ మీటింగ్ నిర్వహించబడింది. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ శ్రీమతి స్నేహ మెహ్రా, అధ్యక్షత వహించగా, పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి సదానంద్ సంబంధిత అధికారులు, పోలీస్ విభాగానికి చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు. . జిల్లాలో ఎక్కడైనా చట్ట విరుద్ధంగా ఆవులు, అలాగే అంగడి చిట్టంపల్లి, మైతాబ్ ఖాన్ గూడ, అంతరం, లక్ష్మీనారాయణపూర్ క్రాస్ రోడ్ ప్రాంతాల్లో 4 అంతర్ జిల్లా చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి, మొత్తం 7 చెక్‌పోస్టుల వద్ద 24 గంటల నిరంతర నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి చెక్‌పోస్టులో పోలీస్ సిబ్బందితో పాటు పశుసంవర్ధక శాఖ సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహిస్తూ వాహనాల తనిఖీలు కఠినంగా చేపడుతున్నట్లు వెల్లడించారు.జంతువుల రవాణా సమయంలో సంబంధిత చట్టాలు మరియు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. చెల్లుబాటు అయ్యే పత్రాలు లేకుండా పశువులను తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకోవడంలో ఎలాంటి రాజీ ఉండదని హెచ్చరించారు. అలాగే అక్రమ రవాణాను అడ్డుకునే క్రమంలో ఎవరూ చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకూడదని, వ్యక్తిగత దాడులు, గుంపుల దాడులుగా చేయడం కూడా శిక్షార్హమైన నేరమని ప్రజలకు సూచించారు.ప్రజలు అప్రమత్తంగా ఉండి పశువుల అక్రమ రవాణా, అనుమానాస్పద కార్యకలాపాలపై వెంటనే పోలీసులకు సమాచారం కల్పించాలని సూచించారు.సోషల్ మీడియా వేదికలైన వాట్సాప్, ఫేస్‌బుక్ తదితరాల్లో పశువుల అక్రమ రవాణాకు సంబంధించి విద్వేషాలను రెచ్చగొట్టేలా మార్ఫింగ్ ఫోటోలు, అసత్య ప్రచారాలు, ప్రేరేపిత పోస్టులు పెట్టినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇందుకోసం జిల్లా పోలీస్ మీడియా మానిటరింగ్ సెల్ నిరంతర నిఘా ఉంచిందని తెలిపారు. ప్రజల్లో భయాందోళనలు కలిగించే రూమర్లు వ్యాప్తి చేసిన వారిపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.అత్యవసర పరిస్థితుల్లో పోలీస్ అధికారులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని, డయల్ 100 లేదా సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని ప్రజలకు సూచించారు. బక్రీద్ పండుగను పరస్పరం మతాలను గౌరవించుకుంటూ, శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని ఆమె ఆకాంక్షించారు. జిల్లాలో శాంతి భద్రతలను కాపాడటానికి ప్రజలు పోలీసులకు పూర్తి సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలో పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి సదానంద్ జిల్లా అదనపు ఎస్పీ బి. రాములు నాయక్ , డీసీఆర్‌బీ డీఎస్పీ జనయ్య , డీటీసీ డీఎస్పీ శ్రీనివాస్ , వికారాబాద్ డీఎస్పీ అంజయ్య , తాండూర్ డీఎస్పీ యాదయ్య , పరిగి డీఎస్పీ శ్రీనివాస్ ,జిల్లా సిఐ లు, ఆర్ఐ లు, ఎస్ఐ లు,ఆర్ఎస్ఐ లు, తదితర అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.



# పీఏసీఎస్ కోహెడకు మళ్లీ పాత పాలకవర్గం బాధ్యతలు

**కోహెడ, మే 6 (వుదయం ప్రతినిధి)** ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) కోహెడ అధ్యక్షులుగా పేర్యల దేవేందర్ రావు మళ్లీ బాధ్యతలు చేపట్టారు. 1912 2025 తేదీన ప్రభుత్వం జారీ చేసిన జీఓ నంబర్ 597ను ఉపసంహరించుకోవడంతో, పాత పాలకవర్గాలకే బాధ్యతలు అప్పగించాలని కోర్టు ఆదేశించిన నేపథ్యంలో బుధవారం పాత పాలకవర్గం తిరిగి బాధ్యతలు స్వీకరించింది.బాధ్యతలు చేపట్టిన అనంతరం అధ్యక్షులు పేర్యల దేవేందర్ రావు వరిధాన్యం కొనుగోలు వ్యవహారంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా గొట్లమిట్టలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి, అక్కడ రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. వెంటనే సంబంధిత పై అధికారులకు ఫోన్ ద్వారా వివరాలు తెలియజేసి, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు మ్యాకల సురేందర్ రెడ్డి, నీరటి దేవయ్య, పబ్బతి సుగుణమ్మ, జేరిపోతుల మణెమ్మ, బొబ్బల కొండల్ రెడ్డి, సీఈఓ ముంజ మల్లికార్జున్, మాజీ సర్పంచ్ చింతలపెల్లి ప్రతాప్ రెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## మల్కాజిగిరి సీపీ సుమతిని వేధించిన 40 మంది పోకిరీలు

**హైదరాబాద్ మే 6 (వుదయం ప్రతినిధి)**

అర్ధరాత్రి సమయంలో మల్కాజ్‌గిరి సీపీ సుమతి కీలక ఆపరేషన్ చేపట్టారు. కమిషనర్‌గా బాధ్యతలు తీసుకున్న మొదటి రోజే మహిళల భద్రతపై దృష్టి పెట్టారు. సీపీగా కాకుండా.. సగటు మహిళగా ఆమె బస్టాండ్‌లో నిల్చున్నారు. సాధారణ మహిళలకు ఎదురయ్యే వేధింపులు ఎదుర్కొన్నారు. బస్టాండ్‌లో నిల్చున్నది సీపీ అని తెలియక సుమతి చుట్టూ పోకిరీలు చేరారు. సుమారు 40 మంది ఆమెను చుట్టుముట్టారు. రకరకాల ప్రశ్నలతో వేధించారు. వీరిలో ఎక్కువ మంది విద్యార్థులే ఉన్నారు.

# నారాయణఖేడ్ ప్రగతి

## 18,000 ఉద్యోగాల భర్తీకి ముహూర్తం ఖరారు!







- నారాయణఖేడ్‌లో ప్రగతి ప్రణాళిక కార్యక్రమం
- 18 వేల ఉద్యోగాలు భర్తీ – మంత్రి దామోదర్ రాజనర్సింహ వెల్లడి

**సంగారెడ్డి ,మే 6 (వుదయం ప్రతినిధి)**

నారాయణఖేడ్‌లో నిర్వహించిన ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమం సందర్భంగా రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పలు కీలక ప్రకటనలు చేశారు. రాష్ట్రంలో వైద్య, ఆరోగ్య శాఖలో సుమారు 18 వేల ఉద్యోగాల భర్తీ చేపట్టినట్లు తెలిపారు. త్వరలోనే మల్టీపర్పస్ ఏఎన్ఎం, నర్సింగ్ ఆఫీసర్ల ఫలితాలను విడుదల చేస్తామని వెల్లడించారు. బాలసదనం నూతన భవనాన్ని స్థానిక ఎమ్మెల్యే డా. సంజీవరెడ్డి, ఎంపీ సురేష్ షెట్కర్‌లతో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో విద్యా, వైద్య, మహిళా సాధికారత రంగాలకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. మహిళలు, శిశువులు, వికలాంగులు, వయోవృద్ధుల సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి పేర్కొన్నారు. అంగన్వాడీలు, బాలసదనాల అభివృద్ధికి ప్రభుత్వంతో పాటు CSR నిధులను వినియోగిస్తామని చెప్పారు. అంగన్వాడీల ద్వారా గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు పోషకాహారం, ఆరోగ్య సేవలు, ప్రీ స్కూల్ విద్య అందిస్తున్నామని వివరించారు.గ్రామీణ ప్రాంతాల్లో ఏఎన్ఎంలు, అంగన్వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు అందిస్తున్న సేవలను మంత్రి ప్రశంసించారు. కార్యక్రమంలో భాగంగా బాలసదనంలోని బాలికలతో మంత్రి ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. బాలసదనంలో తక్షణమే ఆర్ఓ ప్లాంట్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు అనంతరం వికలాంగులకు స్కూటీలను పంపిణీ చేశారు. జిల్లా వ్యాప్తంగా చైల్డ్ కేర్ ఇన్‌స్టిట్యూషన్ల శుభ్రత, ఆరోగ్య శిబిరాలు, పునరావాస చర్యలు, రెసిడెన్షియల్ స్కూళ్లలో చేర్పులు వంటి కార్యక్రమాలు నిర్వహించినట్లు అధికారులు మంత్రికి వివరించారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానిక నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పరిశోధన రంగంలో ప్రతిభ

## ఫార్మాస్యూటికల్ పరిశోధనలో పి.రాజ్యలక్ష్మి దేవికి పీహెచ్.డీ.



**పటాన్చెరు,మే 6 (వుదయం ప్రతినిధి)**

జీవక్రియ రుగ్మతల నిర్వహణలో గట్ మైక్రోబయోటా యొక్క చికిత్సా సామర్థ్యంపై పరిశోధనను విజయవంతంగా పూర్తిచేసిన హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీ పరిశోధక విద్యార్థిని పి. రాజ్యలక్ష్మీ దేవిని డాక్టరేట్ వరించింది. 'ఎలుకలలో స్థూలకాయం, మధుమేహ చికిత్స కోసం ప్రోబయోటిక్స్ తో కలిపి స్వల్పశృంఖల కొవ్వు ఆమ్లాలు (షార్ట్ చైన్ ఫ్యాటీ యాసిడ్స్ లేదా ఎస్సీఎఫ్ఏలు) పోషించే పాత్ర' అనే శీర్షికతో ఆమె అధ్యయనం చేసి, సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న ఫార్మసీ అధ్యాపకుడు డాక్టర్ ఎం.విన్యాస్ బుధవారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. ఊబకాయం, టైప్ II మధుమేహాన్ని పరిష్కరించడంలో ఎస్సీఎఫ్ఏలు, ప్రోబయోటిక్స్ యొక్క ఆశాజనకమైన పాత్రను ఈ అధ్యయనం దృష్టి సారించినట్టు తెలియజేశారు. స్థిరపడిన ప్రయోగాత్మక నమూనాలను ఉపయోగించి, గ్లైసెమిక్ నియంత్రణతో సహా కీలక జీవక్రియ పారామితులను మిశ్రమ చికిత్స గణనీయంగా . హిస్టోలాజికల్ పరిశోధనలు కాలేయం, ప్యాంక్రియాటిక్ కణజాలాలలో మెరుగుదలలను మరింతగా నిర్ధారించాయని తెలిపారు.ముఖ్యంగా, అధ్యయనం చేసిన ఎస్సీఎఫ్ఏలో ఒకటైన బ్యూటిరేట్, అత్యుత్తమ యాంటీడయాబెటిక్ కార్యాచరణను ప్రదర్శించిందన్నారు. మాలిక్యులర్ డాకింగ్ విశ్లేషణలో, ఇది లెప్టిన్, ఇన్సులిన్ రిసెప్టర్లు, న్యూరోపెప్టైడ్ వై రిసెప్టర్ల వంటి కీలక జీవక్రియ నియంత్రకాలతో బలంగా సంకర్షణ చెందుతుందని వెల్లడైనట్టు తెలియజేశారు .ఈ పరిశోధనల ప్రకారం, ఎస్సీఎఫ్ఏలు, ముఖ్యంగా ప్రోబయోటిక్స్ తో కలిపి వాడినప్పుడు, ఊబకాయం, ఇన్సులిన్ నిరోధకత, సంబంధిత జీవక్రియ రుగ్మతలను నివారించడానికి, నిర్వహించడానికి చికిత్సా ఏజెంట్లుగా గణనీయమైన సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయని సూచిస్తున్నట్టు వెల్లడించారు.డాక్టర్ రాజ్యలక్ష్మీ దేవి సమర్పించిన సిద్ధాంత వ్యాసం పీహెచ్డీ పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం విశ్వవిద్యాలయం, హైదరాబాద్ అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డీ.ఎస్. రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, ఫార్మసీ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ జి.శివకుమార్, పలు విభాగాల అధిపతులు, సిబ్బంది పలువురు అభినందించినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# యుద్ధం పేరుతో ధరల దందా..? గద్వాలలో నూనె కేక

**గద్వాల మే 06 (వుదయం ప్రతినిధి)**




అంతర్జాతీయ పరిస్థితుల ప్రభావమా లేక వ్యాపారుల కృత్రిమ కొరత సృష్టింపా అన్న సందేహాలు నెలకొంటున్న నేపథ్యంలో వంటనూనె ధరలు అమాంతం పెరిగి సామాన్యులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ముఖ్యంగా జోగులాంబ గద్వాల జిల్లా వ్యాప్తంగా నెల రోజుల్లోనే వంటనూనెల ధరలు దాదాపు 20 నుంచి 25 శాతం వరకు పెరగడం గృహిణుల బడ్జెట్‌ను తలకిందులు చేసింది. సన్‌ఫ్లవర్ ఆయిల్ ధర లీటరుకు రూ.180 నుంచి రూ.200కు చేరుకోగా, పామాయిల్ రూ.120 నుంచి రూ.145కు పెరిగింది. వేరుశెనగ నూనె ధరలు కూడా గణనీయంగా పెరిగాయి. 5 కిలోల డబ్బా రూ.1000 నుంచి రూ.1150కు, 15 కిలోల టిన్ హోల్‌సేల్ ధర రూ.2300 నుంచి రూ.2400కు పెరగడం గమనార్హం. రైస్ బ్రాన్ ఆయిల్ లీటర్ రూ.150 నుంచి రూ.165కు, వనస్పతి రూ.130 నుంచి రూ.160కు, సోయాబీన్ ఆయిల్ రూ.150 నుంచి రూ.170కు చేరింది. ఇప్పటికే వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధరలు పెరగడంతో హోటళ్లు, రెస్టారెంట్లలో వంటకాల ధరలు పెరుగుతుండగా, ఇప్పుడు వంటనూనె ధరలు కూడా అదే బాటలో పయనించడం ప్రజలపై ద్విగుణీకృత భారంగా మారింది. ఇదిలా ఉండగా, అంత ర్జాతీయ స్థాయిలో యుద్ధ పరిస్థితుల కారణంగా రవాణా ఖర్చులు పెరగడం, దిగుమతులపై ప్రభావం పడటం వంటివి ధరల పెరుగుదలకు కారణమని వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. అయితే, కొందరు వ్యాపారులు ఈ పరిస్థితిని సాకుగా చేసుకు ని నిల్వలు దాచిపెట్టి కృత్రిమ కొరత సృష్టి స్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.దీంతో అధికారులు వెంటనే స్పందించి మార్కెట్‌పై కట్టుదిట్టమైన తనిఖీలు చేపట్టి ధరలను నియంత్రించాలని ప్రజలు కోరుతు న్నారు. అవసరమైతే స్టాక్ పరిమితులు విధించి, అక్రమంగా నిల్వలు దాచిపెట్టే వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. వంటింటి ఖర్చులు రోజురోజుకీ పెరుగుతున్న నేపథ్యంలో పేద, మధ్యతర గతి కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. పరిస్థితి ఇలాగే కొన సాగితే జీవనం మరింత కష్టసాధ్యమవు తుందని గద్వాల పట్టణ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# అధికారులు, అన్ని వర్గాల ప్రజలను రెడ్ క్రాస్ లో భాగస్వాములను చేయాలి

**జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**

**గద్వాల ,మే 06 ,(వుదయం ప్రతినిధి)**



జిల్లాలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేసి, అన్ని వర్గాల ప్రజలు విస్తృతంగా పాల్గొనేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్, రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షులు రిజ్వాన్ బాషా షేక్ సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ రెడ్ క్రాస్ జిల్లా సంఘం చైర్మన్, పలువురు సభ్యులతో సమావేశమై మాట్లాడారు.

జిల్లాలో ఇప్పటికే సుమారు 1200 మంది రెడ్ క్రాస్ సభ్యులు ఉండగా, మరికొంత మంది నమోదు ప్రక్రియలో ఉన్నారని తెలిపారు. ఈ సంఖ్యను గణనీయంగా పెంచేందుకు ప్రభుత్వ ఉద్యోగులు, విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, యువత ముందుకు రావాలన్నారు. జీవితకాల సభ్యత్వం రూ.1000 మాత్రమే ఉండటం వల్ల ప్రజలు సులభంగా సభ్యత్వం పొందవచ్చని తెలిపారు. కలెక్టరేట్‌లో ప్రజాపాలన విభాగంలోనే ప్రత్యేక రెడ్ క్రాస్ నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేసి, అక్కడే నేరుగా రిజిస్ట్రేషన్ నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విధులు నిర్వహించేందుకు ప్రత్యేకంగా సిబ్బందిని నియమించి నమోదు ప్రక్రియ కొనసాగించాలని సూచించారు. రెడ్ క్రాస్ కార్యకలాపాలను గ్రామ స్థాయి వరకు విస్తరించేందుకు మండల స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. విద్యాసంస్థల్లో జూనియర్ రెడ్ క్రాస్, యూత్ రెడ్ క్రాస్ కార్యక్రమాలను చేపట్టి విద్యార్థులను సేవా కార్యక్రమాల్లో భాగస్వాములను చేయాలని తెలిపారు. ప్రభావవంతమైన వ్యక్తులు, సంఘాలు కూడా ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని సూచించారు. సభ్యత్వ నమోదు, విరాళాల సేకరణ పూర్తిగా పారదర్శకంగా జరగాలని, నగదు స్వీకరణ జరిగితే వెంటనే రెడ్ క్రాస్ ఖాతాలో జమ చేయాలని ఆదేశించారు. వార్షిక ఆడిట్ విధానాన్ని కచ్చితంగా అమలు చేయాలని, ఆర్థిక వ్యవహారాల్లో ఎటువంటి లోపాలు ఉండకూడదని పేర్కొన్నారు. రెడ్ క్రాస్ ద్వారా రక్తదాన, వైద్య శిబిరాలు, విపత్తు నిర్వహణ కార్యక్రమాలు మరింత విస్తరించాలని, అవసరమైతే బ్లడ్ బ్యాంక్, ఇతర మౌలిక సదుపాయాలను కల్పించేందుకు భవన నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. జిల్లాలోని అన్ని శాఖల ఉన్నతాధికారులు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని తమ బాధ్యతగా తీసుకుని ప్రతిరోజూ పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. చిన్న చిన్న సంస్థలు, సంఘాలు కూడా సభ్యత్వంలో భాగస్వాములు కావాలన్నారు. రెడ్ క్రాస్ సంస్థ యుద్ధాలు, ప్రకృతి విపత్తులు, అత్యవసర పరిస్థితుల్లో మానవతా సేవలు అందించే ప్రముఖ సంస్థగా నిలిచిందని, ఈ సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, రెడ్ క్రాస్ సొసైటీ నోడల్ అధికారి వేణుగోపాల్, మంజుల, అజారుద్దీన్, సంఘం జిల్లా చైర్మన్ అయ్యపు రెడ్డి, రాష్ట్ర ఈసీ మెంబర్ రమేష్, జిల్లా సభ్యులు మహేష్ నాయుడు, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

# పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు నిర్లక్ష్యంపై ప్రజల ఆగ్రహం

- తెలంగాణ రక్షణ సేన పార్టీ జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్

**నారాయణపేట ,మే6 (వుదయం ప్రతినిధి)**




పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్ నిర్లక్ష్యం పైన కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలపై దక్షిణ తెలంగాణ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని తెలంగాణ రక్షణ సేన పార్టీ నారాయణపేట జిల్లా అధ్యక్షులు గవినోళ్ల శ్రీనివాస్ అన్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్ పేరుతో దశాబ్దాలుగా దక్షిణ తెలంగాణ ప్రజలను అన్ని ప్రధాన రాజకీయ పార్టీలు మోసం చేస్తున్నాయని తెలంగాణ ఉద్యమ సమయంలో నీళ్లు, నిధులు, నియామకాలు, ఆత్మగౌరవం పేరుతో ప్రజల భావోద్వేగాలను రెచ్చగొట్టి అధికారంలోకి వచ్చిన బి ఆర్ యస్ పార్టీ , అధికారంలోకి వచ్చిన తర్వాత అదే హామీలను పక్కనబెట్టి దక్షిణ తెలంగాణను నిర్లక్ష్యం చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు నీళ్లు తరలిస్తున్న సమయంలో చూస్తూ ఉండిపోయిన తీరు దక్షిణ తెలంగాణపై జరిగిన బహిరంగ ద్రోహం అన్నారు. ప్రత్యేకంగా బీఆర్ఎస్ పార్టీ అధినేత కెసిఆర్ పది సంవత్సరాలు ముఖ్యమంత్రిగా కొనసాగుతూ పాలమూరు

వలసలు, కరువు, పేదరికాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకున్నారు అని గుర్తు చేశారు. అధికారంలో ఉన్నంతకాలం ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడంలో పూర్తిగా విఫలమయ్యారు అని ఆరోపించారు.ప్రాజెక్టను సక్రమ ప్రణాళిక లేకుండా, న్యాయపరమైన చిక్కుల్లోకి నెట్టే విధంగా అమలు చేశారన్నారు. త్రాగుని టి ప్రాజెక్ట్ గా చూపి సాగునీటి పనులు చేయడం తో కూడా సరైన హైడ్రాలజికల్ స్పష్టత లేకుండా డి పి ఆర్ సమర్పించడం వల్ల కృష్ణా జలాలపై స్పష్టత లేకుండా పోయిందన్నారు. దీని ఫలితంగా ఆంధ్రప్రదేశ్-తెలంగాణ మధ్య వివాదాలు పెరిగి, ట్రైబ్యునల్, కోర్టు కేసుల్లో ప్రాజెక్ట్ చిక్కుకుపోయిందన్నారు.సుమారు 90 టిఎంసి నీటిని లిఫ్ట్ చేయాలనే భారీ ప్రణాళిక 500 మీటర్లకు పైగా లిఫ్ట్ హెడ్,దేశంలోనే అత్యంత ఖరీదైన లిఫ్ట్ ప్రాజెక్టలలో ఒకటి 10-12 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలనే లక్ష్యం3000-4000 ఎం డబ్ల్యూ విద్యుత్ అవసరం ఉందన్నారు. ఇది రాష్ట్రంపై భారీ భారం పడినా ఇంత పెద్ద ప్రాజెక్ట్‌ను ప్రత్యామ్నాయాల పరిశీలన లేకుండా అమలు చేయడం పూర్తిగా నిర్లక్ష్యం, అజ్ఞానం, రాజకీయ ప్రయోజనాల కోసం తీసుకున్న నిర్ణయం అన్నారు.వాస్తవానికి ఈ ప్రాజెక్ట్‌ను విభజించి నాగార్జునసాగర్ నుండి నల్గొండ జిల్లా కు , శ్రీశైలం, జూరాల పాలమూరు రంగా రెడ్డి మిగిలిన జిల్లా లకు నీటిని సరఫరా చేసే విధంగా అమలు చేస్తే ఖర్చు తగ్గేది, విద్యుత్ భారం తగ్గేదన్నారు. ఈ సాంకేతికంగా సరైన మార్గాన్ని ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా పట్టించుకోలేదన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఈ ప్రాజెక్ట్‌కు జాతీయ హోదా ఇస్తామని చెప్పి మాట తప్పిందన్నారు. ప్రధాన మంత్రి ఇచ్చిన హామీ అమలు కాలేదని డిపిఆర్ కు అనుమతి ఇవ్వకుండా తిరస్కరించడం తెలంగాణపై చూపిన స్పష్టమైన వివక్ష అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించిన ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్ట్‌ను పూర్తి చేయలేదు. దాని స్థానంలో వచ్చిన పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్ కూడా పూర్తి కాలేదు. రెండు ప్రాజెక్టుల మధ్య దక్షిణ తెలంగాణ ప్రజలను బలిగా పెట్టారని,ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ ప్రజలకు సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

తెలంగాణ రక్షణ సేన పార్టీ అధ్యక్షురాలు కవిత రైతుల హక్కుల కోసం పోరాటం ప్రారంభించారని ,ఈ నెల 8న లక్ష్మీదేవి పల్లి గ్రామ సమీపంలో చౌదరి గూడెం వద్ద పాలమూరు రంగారెడ్డి సాధన సభ ఏర్పాటు చేసినట్లు ఇందుకుగాను రైతులు అధిక సంఖ్యలో పాల్గొనాలని తెలంగాణ రక్షణ సేన పార్టీ నారాయణపేట జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్ ఈ సందర్భంగా కోరారు.

# జహీరాబాద్ లో రైతు వారోత్సవాలు



**జహీరాబాద్ మే 6 (వుదయం ప్రతినిధి ) .**

పాల్గొన్న మార్కెట్ కమిటీ చైర్మన్ ఏ.సాయి చరణ్ నియోజకవర్గం రైతులు జహీరాబాద్ పట్టణంలోని మార్కెట్ కమిటీ ఆవరణలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల యాక్షన్ ప్లాన్, ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా రైతు వారోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సాయిచరణ్ మాట్లాడుతూ, రైతులు పండించిన పంటకు వ్యవసాయ కొనుగోలు కేంద్రాలలో సరైన గిట్టుబాటు ధర కల్పించి వ్యవసాయ ఉత్పత్తుల, మార్కెటింగ్ అవకాశాల పై అవగాహన కల్పించి, రైతులను రాజులను చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని వారు వ్యాఖ్యానించారు.. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తిరుపతి రెడ్డి , డైరెక్టర్లు శేఖర్ , జాఫర్ ,అఖిల్ , కిషన్ , ఆంజత్ ,శంకర్ పాటిల్ ,మార్కెట్ కమిటీ అధికారులు తదితరులు పాల్గొన్నారు..



# ఘనంగా మాజీ ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు

**మరికల్ ,మే 6 ( వుదయం ప్రతినిధి)**

మరికల్ మండల కేంద్రంలోని బుధవారం ఇందిరా గాంధీ చివరస్తాలో నారాయణపేట మాజీ ఎమ్మెల్యే ఎస్ రాజేందర్ రెడ్డి జన్మదిన వేడుకలు టిఆర్ఎస్ కార్యకర్తలు ఘనంగా జరుపుకున్నారు చౌరస్తాలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు ఈ కార్యక్రమంలో

మరికల్ మండల టిఆర్ఎస్ సీనియర్ నాయకులు

ప్రజా ప్రతినిధులు మాజీ ప్రతినిధులు సీనియర్ నాయకులు యువకులు, కార్యకర్తలు అధిక

సంఖ్యలో పాల్గొన్నారు

# పారిశ్రామిక ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

**సంగారెడ్డి ,మే6 (వుదయం ప్రతినిధి)**



సంగారెడ్డి, కంది మండలాల్లో బుధవారం టీజీఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి పర్యటించారు. సంగారెడ్డి మండలం కుల్పగూరు గ్రామంలో పిఏసీఎస్ ఆధ్వర్యం లో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ రైతులు ప్రైవేటు మిల్లర్ల వద్ద వడ్లు అమ్మ కూడదని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల వద్దనే ధాన్యం అమ్మాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్ లక్ష్మా రెడ్డి, కాంగ్రెస్ నాయకులు చిద్రుప్ప రఘు, బలరాం,

బుచ్చిరాం లు, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.బిఆర్ఎస్ కార్యకర్త కు చెందిన ఇందిరమ్మ గృహ ప్రవేశం లో పాల్గొన్న నిర్మలా జగ్గారెడ్డిఅనంతరం బేగంపేట గ్రామం లో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ గృహ ప్రవేశం లో నిర్మలా జగ్గారెడ్డి పాల్గొన్నారు. బిఆర్ఎస్ పార్టీ కి చెందిన గ్రామ కార్యకర్త ఎల్లా గౌడ్ కు ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాగా గృహం నిర్మాణం పూర్తయింది. ఎల్లా గౌడ్ ఇంటి గృహ ప్రవేశానికి నిర్మలా జగ్గారెడ్డి ముఖ్య అతిథిగా హాజరవడం విశేషం. ఈ సందర్భంగా నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం తన మన అనే బేధం లేకుండా అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను అందిస్తుందన్నారు. ఏ పార్టీకి చెందిన వారైనా ఎలాంటి వివక్ష లేకుండా ప్రభుత్వ పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ నాయకులు చిదృప్ప రఘు గౌడ్, మహేష్ గౌడ్ లు పాల్గొన్నారు... ఫోం వాష్ సర్వీస్ సెంటర్ ను ప్రారంభించిన నిర్మలా జగ్గారెడ్డి... సంగారెడ్డి బై పాస్ రోడ్ లో నూతనంగా ఏర్పాటు చేసిన ఫోం సర్వీసింగ్ సెంటర్‌ను నిర్మలా జగ్గారెడ్డి ప్రారంభించారు.

wఈ కార్యక్రమం లో కాంగ్రెస్ నాయకుడు మాజీ కౌన్సిలర్ వెంకట్ రాజు, కౌన్సిలర్ నవాజ్ లు పాల్గొన్నారు.

# బొమ్మరాసిపల్లె లో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల

**ఊర్కొండ, మే6 (వుదయం ప్రతినిధి)**



నాగర్ కర్నూల్ జిల్లా ఊరుకొండ మండలం ఈరోజుబొమ్మరాసిపల్లె రైతు వేదిక నందు ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ లో రైతు వారోత్సవాల లో భాగంగా మార్కెటింగ్ ఉత్పత్తుల పై అవగాహన: స్పెషల్ ఆఫీసర్ మార్కెటింగ్ శాఖా జేడీ Dr.పద్మ హర్ష వివరించడం జరిగింది మరియు 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమంలో ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయం, రాజేంద్రనగర చెందిన prof డాక్టర్ విజయలక్ష్మి గారు మరియు పల్లవి గారు బొమ్మరసిపాలె గ్రామ రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో ముఖ్యంగా ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ యూనివర్సిటీ 6 అంశాలపైన రైతులకు సాగుకు ముందు అవగాహన కల్పించారు అందులో ముఖ్యంగా యూరియా వాడకం తగ్గించాలి ,నేలను సంరక్షించాలి అదేవిధంగా నాణ్యమైన విత్తనాలను అలాగే మార్కెట్లో డిమాండ్ ఉన్న వరి రకాలను వాడాలి. సేంద్రీయ వ్యవసాయం పైన అవగాహన, మరియు పంట మార్పిడి సుస్థిర వ్యవసాయం సాగునీటి ఆదా చేయడం భవిష్యత్తరాలకు మేలు. అవసరం మేరకు రసాయనిక ఎరువులు వాడకం ,మరియు పంట మార్పిడి పై అవగాహన కల్పించడం జరిగింది .ఈ కార్యక్రమంలో రైతులు అడిగిన సందేహాలకు జేడీ మరియు శాస్త్రవేత్తలు సమాధానాలు తెలియజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి దీప్తి , వెటర్నరీ డాక్టర్ రాజేష్ , బొమ్మరాసిపల్లె, రాంరెడ్డిపల్లె, జగబోయినపల్లె సర్పంచ్ మరియు ఉపసర్పంచ్ సర్పంచ్ , నాగర్కర్నూల్ మార్కెటింగ్ సెక్రటరీ రవికుమార్ , ఏఈఓ ఆంజనేయులు , ప్రజాప్రతినిధులు, మండలంలోని రైతులు పాల్గొన్నారు.2)ఊర్కొండ రైతువేదిక నందు: TGVB బ్యాంక్ మేనేజర్ తిరుపతి రెడ్డి : రైతులకు బ్యాంకు వారు అందిస్తున లోన్ మరియు కొత్త స్కీమ్ లు వివరించడం జరిగింది, FPO ముచర్లపల్లి చైర్మన్ : శ్యామ్ సుందర్ రెడ్డి వారి బృందం మరియు

PACS ఊర్కొండ రిప్రెసెంటివ్ అభిషేక్ రైతులకు వారు చేస్తున సేవలనుw సహకారాలను వివరించడం జరిగిందిపాల్గొన్న వారు: గౌరవ గ్రామ సర్పంచ్,AEO: ఎ.అరుణమ్మ, గ్రామ రైతులు

### హీరో మోటోకార్ప్ తుది డివిడెండ్ రూ.75

ద్విచక్ర వాహన సంస్థ హీరో మోటోకార్ప్, జనవరి–మార్చి త్రైమాసికానికి రూ.1,473.92 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని ప్రకటించింది. 2024–25 ఇదే కాల లాభం రూ.1,168.75 కోట్ల కంటే ఇది 26% అధికం. మొత్తం వాహన విక్రయాలు 24% పెరిగి 17.14 లక్షలుగా నమోదయ్యాయి. కార్యకలాపాల ఆదాయం రూ.9,969.81 కోట్ల నుంచి రూ.12,978.28 కోట్లకు పెరిగింది. అమ్మకాలు పెరగడమే లాభాదాయాల వృద్ధికి కారణం. రూ.2 ముఖ విలువ గల ఒక్కో షేరుకు రూ.75ను తుది డివిడెండుగా చెల్లించేందుకు బోర్డు సిఫారసు చేసింది. ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా పవన్ ముంజాల్‌ను అక్టోబరు 1 నుంచి మరో అయిదేళ్ల కాలానికి నియమించేందుకు డైరెక్టర్ల బోర్డు ఆమోదం తెలిపింది.




# భారీగా పెరిగిన శాంసంగ్ షేర్లు

ప్రముఖ ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల సంస్థ శాంసంగ్ షేర్లు భారీగా పెరిగాయి. బుధవారం ఈ కంపెనీ షేర్లు ఏకంగా 15శాతం పెరగడంతో.. మార్కెట్ విలువ 1 ట్రిలియన్ డాలర్ల (రూ.95 లక్షల కోట్లకు పైగా) మార్క్‌ను దాటి పరుగులు పెడుతోంది. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ (AI) టెక్నాలజీ అంతకంతకూ విస్తరిస్తున్న నేపథ్యంలో మెమొరీ చిప్‌లకు భారీగా డిమాండ్ పెరుగుతుండడంతో శాంసంగ్ భారీగా లాభాలను దక్కించుకుంటోంది. తైవాన్ సెమీకండక్టర్ మాన్యుఫ్యాక్చరింగ్ కంపెనీ తర్వాత ఈ మార్కును చేరిన రెండో ఆసియా కంపెనీగా ఇది నిలిచింది. రాబోయే 12 నెలల్లో ఈ స్టాక్ సుమారు 30 శాతం పెరుగుతుందని బ్లూమ్‌బర్గ్ నివేదికలు పేర్కొంటున్నాయి. శాంసంగ్ సెమీకండక్టర్ విభాగం మార్చి త్రైమాసికంలో అంచనాలను మించి 48 రెట్ల చారిత్రక లాభాన్ని ఆర్జించింది. ఏఐ డేటా సెంటర్ ఆర్డర్లు భారీ మార్జిన్లను అందించడమే దీనికి కారణం. పరిమిత సరఫరా మధ్య కాంట్రాక్ట్ ధరలు మరింత వేగంగా పెరుగుతుండడంతో రాబోయే పలు త్రైమాసికాలలో ఈ విభాగం తన రికార్డు స్థాయి లాభాన్ని మరింత పెంచుకుంటుందని నిపుణులు పేర్కొంటున్నారు. ప్రపంచ మార్కెట్‌లో అధునాతన చిప్‌లు, కంప్యూటింగ్ సామర్థ్యానికి నిరంతరం డిమాండ్ పెరుగుతుండడంతో ఎస్కే హైనిక్స్, టీఎస్ఎంసీ వంటి ఇతర మెమొరీ సంస్థల షేర్లు కూడా ఈ నెలలో రికార్డు స్థాయి గరిష్ఠాలకు చేరుకున్నాయి. అమెరికాలో తన డివైజ్‌ల కోసం ప్రధాన ప్రాసెసర్‌లను ఉత్పత్తి చేయడానికి శాంసంగ్‌ను ఉపయోగించుకోవడంపై యాపిల్, ఆ సంస్థతో ప్రాథమిక చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. కాగా ప్రస్తుతం మెమొరీ మార్కెట్‌లో సరఫరా కొరత ఉందని జూపిటర్ అసెట్ మేనేజ్‌మెంట్ ఇన్వెస్ట్‌మెంట్ మేనేజర్ సామ్ కొన్రాడ్ పేర్కొన్నారు. ఈ ఏడాదితో పోల్చితే 2027లో దీని డిమాండ్ మరింత పెరిగే అవకాశం ఉందన్నారు.




# ఎం అండ్ ఎం లాభం రూ.5,260 కోట్లు

వాహన దిగ్గజం మహీంద్రా అండ్ మహీంద్రా, మార్చి త్రైమాసికంలో రూ.5,259.91 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని ప్రకటించింది. 2024–25 ఇదే కాల లాభం రూ.3,541.85 కోట్లతో పోలిస్తే ఇది 48.5% ఎక్కువ. ఇదే సమయంలో మొత్తం కార్యకలాపాల ఆదాయం రూ.42,585.67 కోట్ల నుంచి రూ.54,891.55 కోట్లకు పెరిగింది. మొత్తం వ్యయాలు రూ.39,113.61 కోట్ల నుంచి రూ.49,615.48 కోట్లకు చేరాయి. పూర్తి ఆర్థిక సంవత్సరం (2025–26)లో కంపెనీ లాభం రూ.18,621.71 కోట్లుగా నమోదైంది. 2024–25 లాభం రూ.14,073.17 కోట్ల కంటే ఇది 32.32% అధికం. ఇదే సమయంలో మొత్తం కార్యకలాపాల ఆదాయం రూ.1,58,749.75 కోట్ల నుంచి రూ.1,97,792.78 కోట్లకు చేరింది. రూ.5 ముఖవిలువ కలిగిన ఒక్కో షేరుకు రూ.33 తుది డివిడెండ్‌ను డైరెక్టర్ల బోర్డు సిఫారసు చేసింది. విభాగాల వారీగా: మార్చి త్రైమాసికంలో వాహన విక్రయాలు 21% పెరిగి 3.07 లక్షల యూనిట్లుగా నమోదయ్యాయి. 2025–26లో ఎస్‌యూవీ విభాగంలో కంపెనీ అగ్రస్థానాన్ని నిలబెట్టుకుంది. ట్రాక్టర్ల విభాగంలో కంపెనీ మార్కెట్ వాటా 43.6 శాతానికి పెరిగింది. 2025–26లో 5 లక్షలకు పైగా ట్రాక్టర్ల బిల్లింగ్‌తో సరికొత్త రికార్డు సృష్టించింది. భవిష్యత్తు అంచనాలు, ప్రణాళికలు: 2031 నాటికి 10 కొత్త ఐసీఈ ఎస్‌యూవీలు, 6 కొత్త విద్యుత్తు వాహనాలను తీసుకురావాలని కంపెనీ లక్ష్యంగా పెట్టుకుంది. ప్రస్తుత ఏడాదిలో ట్రాక్టర్ పరిశ్రమ స్వల్ప వృద్ధి నమోదు చేయొచ్చని కంపెనీ అంచనా వేస్తోంది. కృత్రిమ మేధ (ఏఐ) వినియోగాన్ని పెంచడం ద్వారా అన్ని వ్యాపార విభాగాలను ఆధునీకరించాలని కంపెనీ యోచిస్తోంది. ఫలితాల నేపథ్యంలో బీఎస్ఈలో ఎం అండ్ ఎం షేరు 3.41% లాభంతో రూ.3,211.65 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.13,168.98 కోట్లు పెరిగి రూ.3.99 లక్షల కోట్లకు చేరింది.




# దేశీయంగా వాహన రిటెయిల్ విక్రయాలు 26,11,317

ఏప్రిల్‌లో దేశీయంగా వాహన రిటెయిల్ విక్రయాలు 26,11,317గా నమోదయ్యాయి. 2025 ఇదే నెలలో విక్రయమైన 23,12,221 వాహనాల కంటే ఇవి 12.94% అధికమని డీలర్ల సంఘం ఫాడా తెలిపింది. ఆర్‌బీఐ సానుకూల వడ్డీ రేట్లు, జీఎస్‌టీ 2.0 ప్రయోజనాలు, పెళ్లిళ్ల సీజన్, గ్రామీణ డిమాండ్ ఇందుకు తోడ్పడ్డాయని వెల్లడించింది. ప్రయాణికుల వాహన (పీవీ) అమ్మకాలు 3,63,028 నుంచి 12.21% పెరిగి 4,07,355 కు చేరాయి. ద్విచక్రవాహన విక్రయాలు 13.01% వృద్ధితో 19,16,258 యూనిట్లుగా నమోదయ్యాయి. వాణిజ్య వాహన (సీవీ) అమ్మకాలు 15.02% పెరిగి 99,339 యూనిట్లకు చేరాయి. త్రిచక్రవాహన విక్రయాలు 7.19% వృద్ధితో 1,06,908గా ఉన్నాయి. మొత్తం 6 వాహన విభాగాల్లో 5, గత నెలలో జీవనకాల గరిష్ఠాలను నమోదు చేశాయని ఫాడా ఉపాధ్యక్షుడు సాయి గిరిధర్ పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో డిమాండ్ బలంగా ఉంది. ముఖ్యంగా పీవీ విభాగంలో గ్రామీణ అమ్మకాలు 20.40% పెరగ్గా, పట్టణ వృద్ధి 7.11% శాతంగా ఉంది. రాబోయే మూడు నెలలపై పరిశ్రమ ఆశాజనకంగా ఉన్నప్పటికీ, దేశవ్యాప్తంగా వడగాల్పుల హెచ్చరికలు, పశ్చిమాసియా యుద్ధ పరిస్థితుల వల్ల పెరిగే ఇంధన ధరలు, వాణిజ్య వాహన విభాగంలో నగదు లభ్యత వంటి అంశాలను గమనించాల్సి ఉంటుందని గిరిధర్ స్పష్టం చేశారు.



## తగ్గిన ఎల్ అండ్ టీ లాభం

మౌలిక రంగ దిగ్గజ సంస్థ ఎల్ అండ్ టీ, 2025–26 మార్చి త్రైమాసికంలో రూ.5,326 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని ప్రకటించింది. 2024–25 ఇదే కాల లాభం రూ.5,497 కోట్లతో పోలిస్తే ఇది 3% తక్కువ. గత ఆర్థిక సంవత్సరంలో రూ.475 కోట్ల అసాధారణ లాభం పొందడం వల్ల, ఇప్పుడు తగ్గినట్లు కనిపిస్తోందని కంపెనీ తెలిపింది. మొత్తం కార్యకలాపాల ఆదాయం రూ.74,392 కోట్ల నుంచి 11% పెరిగి రూ.82,762 కోట్లకు చేరింది. 2026 మార్చి 31కి కంపెనీ ఆర్డరు పుస్తకం రూ.7,40,327 కోట్లకు చేరింది. ఇందులో అంతర్జాతీయ ఆర్డర్ల వాటా 52 శాతంగా ఉంది. 2025–26 ఆర్థిక సంవత్సరానికి ఒక్కో షేరుకు రూ.38 చొప్పున తుది డివిడెండ్‌ను బోర్డు సిఫారసు చేసింది. వ్యూహాత్మక నిర్ణయాల్లో భాగంగా ఎల్ అండ్ టీ మెట్రో (హైదరాబాద్), నాభా పవర్ లిమిటెడ్‌ల్లో పూర్తి వాటాలను విక్రయించడానికి ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు ఎల్ అండ్ టీ సీఎండీ ఎస్ఎన్ సుబ్రమణ్యన్ తెలిపారు.

# ఎల్‌పీజీ ఉత్పత్తి పెంచుతున్న రిలయన్స్

పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో, ఏర్పడిన సరఫరా అంతరాయాల వల్ల మనదేశంలో వంట గ్యాస్ (ఎల్‌పీజీ)కు కొరత ఏర్పడుతోంది. అందుకే ఎల్‌పీజీ ఉత్పత్తి పెంచడంపై దృష్టి సారించిన రిలయన్స్ ఇండస్ట్రీస్, ఇందుకోసం ఆల్కలైట్స్ ఉత్పత్తిని తగ్గించుకుంటోంది. గ్యాసోలైన్‌లో మిశ్రమంగా ఆల్కలైట్స్‌ను వాడతారు. రిలయన్స్ తన రిఫైనింగ్ కాంప్లెక్స్‌లో ఆల్కలేషన్ యూనిట్‌ను నిర్వహిస్తోంది. ఇందులో ఉత్పత్తి చేసిన ఆల్కలైట్స్‌ను అమెరికాకు ఎగుమతి చేస్తోంది. ఎల్‌పీజీ ఉత్పత్తి పెంచేందుకు ఆల్కలైట్స్ ఎగుమతులను రిలయన్స్ ఇండస్ట్రీస్ తగ్గించుకుంటోంది. పశ్చిమాసియా యుద్ధానికి ముందున్న పరిస్థితులతో పోలిస్తే, ఎల్‌పీజీ ఉత్పత్తి మూడింతలకు పైగా పెరిగినట్లు రిలయన్స్ ఇండస్ట్రీస్ చెబుతోంది. దీంతో పశ్చిమాసియా దేశాల నుంచి తగ్గిన ఎల్‌పీజీ దిగుమతుల్లో కొంత మేర భర్తీ చేయగలిగామని కంపెనీ పేర్కొన్నట్లు ఓ ఆంగ్ల వెబ్‌సైట్ తెలిపింది. రోజుకు 6.60 లక్షల బ్యారెళ్ల ముడిచమురును శుద్ధి చేయగలిగిన తన రిఫైనరీ కాంప్లెక్స్‌లో ఉన్న క్రూడ్ యూనిట్, మరికొన్ని అనుబంధ యూనిట్లను వార్షిక నిర్వహణ పనుల కోసం కొంత కాలం మూసివేసే యోచనలో రిలయన్స్ ఇండస్ట్రీస్ ఉన్నట్లు తెలుస్తోంది. ఈనెల మధ్య నుంచి 3–4 వారాల పాటు ఈ యూనిట్లలో కార్యకలాపాలు ఆపేయనుందని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. అయితే దేశంలో ఇంధన కొరత సమస్య తలెత్తకుండా, నయారా ఎనర్జీ రిఫైనరీ కార్యకలాపాలు పునఃప్రారంభమయ్యాక ఈయూనిట్లలో కార్యకలాపాలను రిలయన్స్ నిలిపివేస్తుందని వెల్లడించాయి.







## అగ్రస్థానంలోనే భారత్




దుబాయ్: టీ20క్రికెట్‌లో తమకు తిరుగులేదని భారత్ మరోసారి నిరూపించింది. వరుసగా రెండోసారి పొట్టి ప్రపంచకప్ గెలిచి చరిత్ర సృష్టించిన టీమ్‌ఇండియా.. ఐసీసీ వార్షిక టీ20 ర్యాంకింగ్స్‌లో తమ ఆధిపత్యాన్ని కొనసాగిస్తూ అగ్రస్థానాన్ని నిలబెట్టుకుంది. 2025 మే నుంచి జరిగిన మ్యాచ్‌ల వెయిటేజీని పరిగణనలోకి తీసుకున్న ఐసీసీ ఈ ర్యాంకులను విడుదల చేసింది. 275 రేటింగ్ పాయింట్లతో మెన్ ఇన్ బ్లూ తొలి స్థానంలో ఉండగా ఇంగ్లండ్ (262), ఆస్ట్రేలియా (258), న్యూజిలాండ్ (247), సౌతాఫ్రికా (244) టాప్–5లో నిలిచాయి.

## చెన్నై పాంచ్ పటాకా..
# ఢిల్లీపై అలవోక విజయం

ఐపీఎల్–19లో పడుతూ లేస్తూ సాగుతున్న చెన్నై సూపర్ కింగ్స్.. వరుసగా రెండో విజయం సాధించి ప్లేఆఫ్స్ రేసును రసవత్తరంగా మార్చేసింది. మంగళవారం ఏకపక్షంగా జరిగిన మ్యాచ్‌లో సీఎస్‌కే.. ఢిల్లీ క్యాపిటల్స్‌ను వారి సొంతగడ్డపై 8 వికెట్ల తేడాతో చిత్తుచేసి సీజన్‌లో ఐదో విజయాన్ని తమ ఖాతాలో వేసుకుంది. ఢిల్లీ నిర్దేశించిన 156 పరుగుల ఛేదనను 17.3 ఓవర్లలో 2 వికెట్లే కోల్పోయి పూర్తిచేసింది. 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' ఓపెనర్ సంజూ శాంసన్ (52 బంతుల్లో 7 ఫోర్లు, 6 సిక్సర్లతో 87 నాటౌట్) మరో కీలక ఇన్నింగ్స్ ఆడగా కార్తీక్ శర్మ (31 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సర్లతో 41 నాటౌట్) అతడికి అండగా నిలిచాడు.తొలుత టాస్ నెగ్గి బ్యాటింగ్ ఎంచుకున్న ఢిల్లీ.. మరోసారి పేలవ బ్యాటింగ్‌తో నిర్ణీత ఓవర్లలో 155/7కే పరిమితమైంది. సమీర్ రిజ్వీ (24 బంతుల్లో 4 సిక్సర్లతో 40 నాటౌట్), ట్రిస్టన్ స్టబ్స్ (31 బంతుల్లో 1 ఫోర్, 2 సిక్సర్లతో 38) ఆదుకోకుంటే ఆ జట్టు పరిస్థితి మరీ దారుణంగా ఉండేది. చెన్నై బౌలర్లలో నూర్ అహ్మద్ (2/22) రెండు వికెట్లు తీయగా అకీల్ (1/19), ముకేశ్ (1/31) ప్రత్యర్థిని కట్టడి చేశారు. ఈ గెలుపుతో ప్లేఆఫ్స్ రేసులో సీఎస్‌కే ముందంజ వేయగా మరోవైపు ఆరో ఓటమితో క్యాపిటల్స్ తమ అవకాశాలను మరింత సంక్లిష్టం చేసుకుంది.నిలిచి గెలిపించిన శాంసన్ బంతి ఆధిపత్యం చెలాయించిన పిచ్‌పై ఛేదన అంత తేలికేమీ కాదని తెలియడానికి చెన్నైకి పెద్దగా టైమ్ పట్టలేదు. పవర్ ప్లేలో ఆ జట్టు రుతురాజ్ (6) వికెట్‌ను కోల్పోవడమే గాక చేసింది 44 పరుగులే. స్టార్క్, ఎంగిడి పొదుపుగా బౌలింగ్ చేయడంతో పర్యాటక జట్టు పవర్ ప్లేలో సైతం సింగిల్స్ మీదే దృష్టిపెట్టింది. ఎంగిడి బౌలింగ్‌లో స్కేర్ లెగ్, లాంగాన్ మీదుగా భారీ సిక్స్‌లు కొట్టిన ఉర్విల్ (17).. అక్షర్ ఓవర్లో ముందుకొచ్చి ఆడబోయి స్టంపౌట్ అయ్యాడు. 50 రన్స్ చేరడానికి ఆ జట్టు 7.2 ఓవర్లు ఆడాల్సి వచ్చింది. నటరాజన్ వేసిన 9వ ఓవర్లో రెండు ఫోర్లతో గేర్ మార్చిన అతడు, ఆ తర్వాత ఎక్కడా తగ్గలేదు. కుల్‌దీప్ 12వ ఓవర్లో అయితే 6, 6, 4తో విరుచుకుపడ్డాడు. 32 బంతుల్లో అర్ధ శతకం సాధించిన సంజూ.. స్టార్క్ మరుసటి ఓవర్లోనూ రెండు బౌండరీలు బాది స్కోరుబోర్డును వంద దాటించాడు. నట్టూ వేసిన 15వ ఓవర్లోనూ రెండు సిక్స్‌లు, ఫోర్‌తో 20 రన్స్‌ను రాబట్టి తన జట్టును గెలుపు దిశగా నడిపించాడు. నట్టూ బౌలింగ్ లోనే సిక్స్, ఫోర్‌తో కార్తీక్ లాంఛనం పూర్తిచేశాడు.మళ్లీ తడపడి..ఒక మ్యాచ్‌లో ధాటిగా ఆడితే మరోదాంట్లో తేలిపోతున్న ఢిల్లీ.. ఈ పోరులో అదే సంప్రదాయాన్ని కొనసాగించింది. బ్యాటర్లకు కఠిన సవాల్ విసిరిన పిచ్‌పై చెన్నై స్పిన్నర్లు చెలరేగడంతో క్యాపిటల్స్ క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోయి తక్కువ స్కోరుకే పరిమితమైంది. ఆ జట్టులో రిజ్వీ, స్టబ్స్ మినహా మిగిలినవారెవరూ 20 పరుగుల మార్కునూ దాటలేక చతికిలపడ్డారు. అకీల్‌కు తొలి ఓవర్లోనే రెండు బౌండరీలతో స్వాగతం పలికిన నిశాంక (19).. ముకేశ్ ఓవర్లో మిడాన్‌లో బ్రెవిస్ చేతికి చిక్కడంతో ఆ జట్టు వికెట్ల పతనం మొదలైంది. కేఎల్ రాహుల్ (12)ను అకీల్ బోల్తా కొట్టించాడు. ఇదే జోష్‌లో నూర్ తన వరుస ఓవర్లలో కరుణ్ నాయర్ (13), నితీశ్ రాణా (15)ను పెవిలియన్‌కు పంపడంతో మ్యాచ్‌పై సీఎస్‌కే మరింత పట్టుబిగించినట్లైంది. గుర్జప్‌నీత్ విసిరిన 11వ ఓవర్ ఆఖరి బంతిని ఆడబోయిన ఢిల్లీ సారథి అక్షర్ (2).. కవర్స్‌లో అకీల్ చేతికి చిక్కడంతో ఢిల్లీ 69/5తో పీకల్లోతు కష్టాల్లో పడింది.



## నగదు వాటా పెంచకపోతే
# గ్రాండ్‌స్లామ్స్ బహిష్కరిద్దాం



### టెన్నిస్ క్రీడాకారులకు సబలెంకా పిలుపు

గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నమెంట్లలో క్రీడాకారులకు నగదు బహుమతి రూపంలో ఇచ్చే రెవెన్యూ వాటను పెంచకపోతే ప్లేయర్లంతా టోర్నీలను బాయ్‌కాట్ చేయాలని ప్రపంచ నంబర్ వన్ టెన్నిస్ క్రీడాకారిణి అరీనా సబలెంకా పిలుపునిచ్చింది. ఈ నెల 28వ తేదీ నుంచి జరిగే ఫ్రెంచ్ ఓపెన్ టోర్నీ కోసం ఇటీవల ప్రకటించిన ప్రైజ్‌మనీపై సబలెంకా, పురుషుల నంబర్ వన్ యానిక్ సినర్ వంటి అగ్రశేణి ప్లేయర్లు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.2024 ఫ్రెంచ్ ఓపెన్‌లో 15.5 శాతంగా ఉన్న ఆటగాళ ?ల వాటా ఈ ఏడాది 14.9 శాతానికి పడిపోవడాన్ని నిరసిస్తున్నారు. ఏటీపీ, డబ్ల్యూటీఏ ఈవెంట్స్ మాదిరిగానే గ్రాండ్‌స్లామ్స్‌లోనూ 22 శాతం వాటా ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ఆటగాళ్లు లేకుండా టోర్నమెంట్ లేదని, తమ హక్కుల సాధన కోసం బహిష్కరణ ఒక్కటే మార్గమని సబలెంకా స్పష్టం చేసింది.

# డోప్ టెస్టు మిస్.. వినేశ్‌కు ఐటీఏ నోటీసులు

నేషనల్ ఓపెన్ ర్యాంకింగ్ టోర్నమెంట్‌తో తిరిగి మ్యాట్‌పైకి వచ్చేందుకు సిద్ధమవుతున్న భారత స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగాట్‌కు ఇంటర్నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఐటీఏ) షాకిచ్చింది. గతేడాది చివర్లో అవుట్–ఆఫ్–కాంపిటీషన్ డోపింగ్ పరీక్షకు అందుబాటులో ఉండనందుకు గానూ ఆమెకు నోటీసులు జారీ చేసింది.గత డిసెంబర్ 18న హర్యానా అసెంబ్లీ శీతాకాల సమావేశాల నిమిత్తం వినేశ్ చండీగఢ్ వెళ్లింది. కానీ, ఆ సమాచారాన్ని ఆమె సకాలంలో అప్‌డేట్ చేయకపోవడం వల్ల డోపింగ్ నియంత్రణ అధికారికి అందుబాటులో లేకుండా పోయింది.దీనిపై ఆమె ఇచ్చిన వివరణను తోసిపుచ్చిన ఐటీఏ వినేశ్ డోప్ టెస్టుకు గైర్హాజరైందని అధికారికంగా నమోదు చేసింది. గత 12 నెలల కాలంలో ఫొగాట్ తొలిసారి తన లొకేషన్ వివరాలు తెలపడంలో (వేర్ అబౌట్స్) విఫలమైంది. ఏడాదిలో ఇలాంటి వ*డు వేర్ అబౌట్స్ వైఫల్యాలు నమోదైతేనే దానిని నిబంధనల ఉల్లంఘనగా పరిగణించి గరిష్ఠంగా రెండేళ్ల వరకు నిషేధం విధిస్తారు. అయితే, ఈ నోటీసు డోపింగ్ నిబంధనల ఉల్లంఘన కిందకు రాదని, హెచ్చరిక మాత్రమేనని ఐటీఏ తెలిపింది.



# దేశవాళీ క్రికెట్ పవర్ హౌస్‌గా మారుస్తా
## మాజీ క్రికెటర్ అంబటి రాయుడు

హైదరాబాద్ క్రికెట్‌ను గాడిలో పెట్టేందుకు టీమిండియా మాజీ క్రికెటర్ అంబటి రాయుడు ముందుకొచ్చాడు. హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) క్రికెట్ ఆపరేషన్స్ హెడ్‌గా నియమితుడైన రాయుడు ఉప్పల్ స్టేడియంలో అపెక్స్ కౌన్సిల్ సభ్యుల సమక్షంలో బాధ్యతలు స్వీకరించాడు. ఈ పదవిలో కొనసాగనున్న రాయుడు ఇకపై హెచ్‌సీఏలో క్రికెట్‌కు సంబంధించిన అన్ని అంశాలను పర్యవేక్షించనున్నాడు. అన్నింటా పారదర్శకత, ఆటగాళ్లకే తొలి ప్రాధాన్యత అనే విధానంతో హైదరాబాద్‌ను దేశవాళీ క్రికెట్‌లో పవర్‌హౌస్‌గా తీర్చిదిద్దే బాధ్యత తీసుకుంటానని అంబటి పేర్కొన్నాడు. ఇందుకోసం క్రికెట్ ఆపరేషన్స్‌ను ఆటోమేట్ చేయనున్నట్లు, ముంబై క్రికెట్ సంఘం తరహాలోనే ఆధునిక ప్లేయర్ కాంట్రాక్ట్ విధానాన్ని తీసుకురానున్నట్లు తెలిపాడు. 'నేను పుట్టి పెరిగిన హైదరాబాద్ క్రికెట్‌కు సేవ చేసే అవకాశం రావడం నాకెంతో సంతోషాన్నిచ్చింది. నేను 13 ఏళ్ల వయసులో ఓపెన్ ట్రయల్స్ ద్వారానే ఎంపికయ్యాను. ప్రతిభావంతులైన యువ ఆటగాళ్లను గుర్తించడానికి మళ్లీ ఓపెన్ ట్రయల్స్ నిర్వహిస్తాం. బెంగళూరు తరహాలో హైదరాబాద్‌లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తాను. హైదరాబాద్, తెలంగాణలో ఎంతో క్రికెట్ నైపుణ్యం ఉంది. మన రాష్ట్రం నుంచి మరింత మంది క్రికెటర్లను దేశానికి అందించే బాధ్యతను ఉత్సాహంగా స్వీకరిసున్నా. హైదరాబాద్ జట్లను విజయపథంలో నడిపి అన్ని విభాగాల్లో ట్రోఫీలు నెగ్గేలా చేయడమే నా అంతిమ లక్ష్యం'అని రాయుడు పేర్కొన్నాడు.



# వుదయం సినిమా

## 22 నుంచి సిస్టం అమెజాన్ ప్రైమ్‌లో స్ట్రీమింగ్




**వుదయం సినిమా :** ఇండియాలో కోర్ట్ రూం డ్రామాలు చాలా అరుదుగా వస్తుంటాయి. కోర్ట్‌రూం థ్రిల్లర్లను ఇష్టపడే ఆడియెన్స్ ఎక్కువ సంఖ్యలోనే ఉంటారు. ఇక అమెజాన్ ప్రైమ్‌లో మే 22 నుంచి ఓ అద్భుతమైన కోర్ట్ రూం థ్రిల్లర్ 'సిస్టం' స్ట్రీమింగ్ కాబోతోంది. అశ్విని అయ్యర్ తివారీ దర్శకత్వంలో బావేజా స్టూడియోస్ బ్యానర్‌పై హర్మన్ బావేజా, పమ్మి బావేజా, స్మిత బలిగా నిర్మాతలుగా ఈ చిత్రం రూపుదిద్దుకుంది. ప్రత్యేక హక్కులు, సత్యం, న్యాయం నిజమైన అర్థాన్ని ప్రశ్నించే తీవ్రమైన కథనంతో ఈ సినిమా రాబోతోంది. ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా 240కి పైగా దేశాలు, ప్రాంతాలలో ప్రసారం కానుంది. 'సిస్టం' చిత్రంలో సోనాక్షి సిన్హా, జ్యోతిక, అశుతోష్ గోవారికర్ ప్రధాన పాత్రలలో అద్భుతమైన నటనను కనబరిచారు.

## #RN23 అనౌన్స్‌మెంట్



**వుదయం సినిమా :** కంటెంట్ ఓరియెంటెడ్ సినిమాలకు ప్రాధాన్యం ఇచ్చే రోహిత్ నారా, కరణ్ సి ప్రొడక్షన్స్ LLPతో తన తదుపరి ప్రాజెక్ట్‌ను అధికారికంగా ప్రకటించారు. ఈ బ్యానర్ లో ప్రతిష్టాత్మకమైన 5వ ప్రొడక్షన్ గా రూపొందుతున్న #RN23 కంప్లీట్ రొమాంటిక్ కామెడీ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్. ఈ ప్రాజెక్ట్‌ను భరత్ చౌదరి నిర్మిస్తుండగా, చినిమిల్లి మణికుమార్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఆయనే కథ, స్క్రీన్‌ప్లే కూడా అందిస్తున్నారు. యూనివర్సల్ ఎమోషన్స్ తో కూడిన కొత్త కాన్సెప్ట్‌తో వస్తున్న ఈ సినిమాపై ఇప్పటికే ఆసక్తి నెలకొంది.
"షాటింగ్ సూన్" అనే ఆసక్తికరమైన ట్యాగ్‌లైన్‌తో ఉన్న అనౌన్స్‌మెంట్ పోస్టర్ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. యూత్‌తో పాటు ఫ్యామిలీ ఆడియన్స్‌ను ఆకట్టుకునేలా హాస్యం, ప్రేమ, భావోద్వేగాలు, కుటుంబ అనుబంధాలను కలగలిపిన వినోదాత్మక కథతో ఈ సినిమా రాబోతోంది.

## నితిన్ - సితార కలయికలో కొత్త సినిమా ప్రారంభం






**వుదయం సినిమా :** ప్రముఖ కథానాయకుడు నితిన్ తదుపరి ఆసక్తికరమైన చిత్రం సాంప్రదాయ పూజా కార్యక్రమంతో అధికారికంగా ప్రారంభమైంది. నాణ్యమైన, విజయవంతమైన చిత్రాలను అందించడంలో పేరుగాంచిన ప్రతిష్టాత్మక నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి, ప్రతిభావంతులైన దర్శకులు నారి సిరిసవాడ మరియు సోమశేఖర్ టి దర్శకత్వం వహిస్తున్నారు. బలమైన సృజనాత్మక బృందం ఏకమవ్వడంతో, ప్రకటనతోనే ఈ ప్రాజెక్ట్ పై మంచి అంచనాలు ఏర్పడ్డాయి. ఈ చిత్రంలో నితిన్ కథానాయకుడిగా నటిస్తుండగా, రితికా నాయక్ కథానాయికగా నటిస్తున్నారు. సురేష్ బొబ్బిలి సంగీతం అందిస్తున్న ఈ చిత్రానికి ఛాయాగ్రాహకుడిగా అనిత్ మదాడి, కళా దర్శకుడిగా జానీ షేక్ వ్యవహరిస్తున్నారు. ప్రతిభావంతులైన సాంకేతిక బృందం తమ నైపుణ్యంతో దృశ్యపరంగా ఆకట్టుకునేలా ఈ చిత్రాన్ని రూపొందించనున్నారు.

## సతీ లీలావతి
### అందరూ ఎంజాయ్ చేస్తారు



**వుదయం సినిమా :** ప్రముఖ నిర్మాణ సంస్థ ఆనంది ఆర్ట్స్ సమర్పణలో దుర్గాదేవి పిక్చర్స్ బ్యానర్‌పై నాగమోహన్ నిర్మాణంలో లావణ్య త్రిపాఠి కొణిదెల, దేవ్ మోహన్ ప్రధాన పాత్రల్లో రానున్న చిత్రం 'సతీ లీలావతి'. భీమిలీ కబడ్డీ జట్టు, ఎస్.ఎం.ఎస్(శివ మనసులో శృతి) ఫేమ్ తాతినేని సత్య ఈ మూవీకి దర్శకత్వం వహించారు. ఈ చిత్రాన్ని మే 8న వరల్డ్ వైడ్‌గా గ్రాండ్ రిలీజ్ చేయబోతోన్నారు. ఈ క్రమంలో బుధవారం నాడు హీరోయిన్ లావణ్య త్రిపాఠి మీడియాతో ముచ్చటించారు. 'సతీ లీలావతి' మూవీని ఆల్రెడీ చూశాను. చాలా బాగుంది. నాకు ఎంతో నమ్మకం ఉంది. ఇక ఆడియెన్స్ ఎలాంటి రిజల్ట్ ఇస్తారో చూడాలి. ఈ మూవీ షూటింగ్ టైంలోనే నేను ప్రెగ్నెంట్ అని తెలిసింది. కానీ టీం ఇచ్చిన సపోర్ట్‌తో షూటింగ్ సాఫీగా చేశాను. ప్రతీ రోజూ షూటింగ్ అయిన తరువాత హాస్పిటల్‌కి వెళ్లి చెకప్ చేసుకుంటూ ఉండేదాన్ని. చిత్రీకరణలో చిన్న చిన్న గాయాలు అవ్వడం అనేది కామన్ కదా. అయితే ఈ కథ విన్నప్పుడు వరుణ్‌కి చెప్పాను. అప్పుడు నాకు ప్రెగ్నెంట్ అని తెలీదు, ఎలాంటి సింప్టమ్స్ కూడా లేవు. షూటింగ్ కూడా అంత ఈజీ కాదని అర్థమైంది. ఈ మూవీ కోసం వెయిట్ కూడా తగ్గాను. కానీ నాకు ఈ శక్తి ఎక్కడి నుంచి వచ్చిందో తెలీదు. ఇకపై ప్రెగ్నెంట్ అని తెలిస్తే మాత్రం షూటింగ్‌లకు బ్రేక్ ఇస్తాను.

## పెద్ది కోసం 70-80 పీరియడ్‌ని రిక్రియేట్ చేశాం
### ప్రొడక్షన్ డిజైనర్ అవినాష్ కొల్లా



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ రూరల్ యాక్షన్ డ్రామా 'పెద్ది'. బుచ్చి బాబు సానా దర్శకత్వంలో మైత్రి మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. ఇప్పటికే చార్ట్ బస్టర్ పాటలు, అద్భుతమైన గ్లింప్స్ తో సినిమాపై అంచనాలు భారీ స్థాయికి చేరుకున్నాయి. ఈ చిత్రం జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ఈ సందర్భంగా ప్రొడక్షన్ డిజైనర్ అవినాష్ కొల్లా విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు. నా పదేళ్ల కెరీర్‌లో ఒక కథకి ఇంతలా ఎక్సైట్ అవ్వడం ఇదే ఫస్ట్ టైం. డైరెక్టర్ గారు కథ చెప్పిన తర్వాత ఒక 20 నిమిషాల పాటు నేను మనిషిని కాలేకపోయాను. అంతలా కదిలించింది. కథలోనే ఇంత బలం ఉంది కాబట్టి ప్రొడక్షన్ డిజైన్ పరంగా అన్ని విషయాల్లో చాలా కేర్ తీసుకోవాలని అప్పుడే డిసైడ్ అయ్యాను. ఒక సినిమాకి సెట్ వేసినప్పుడు అది ఆడియన్స్‌కి సెట్ అని తెలియకపోవాలి. అప్పుడే ఒక ఆర్ట్ డైరెక్టర్ సక్సెస్ అయినట్టు. నా వరకు ఈ సినిమాకి వేసిన సెట్‌స్‌ను ఆడియన్స్ అవి సెట్ అని గ్రహించలేరు. అంత నేచురల్‌గా ఉంటాయి.

వుదయం సినిమా :

## 22న అగ్లీ స్టోరీ విడుదల



**వుదయం సినిమా :** ప్రేమలోని చీకటి కోణాన్ని ధైర్యంగా చూపించే 'అగ్లీ స్టోరీ' ట్రైలర్ ఆకట్టుకునే విధంగా, తాజాగా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. 'భీమ్లా నాయక్' డైరెక్టర్ సాగర్ కె చంద్ర చేతుల మీదుగా ట్రైలర్ విడుదల అయ్యింది. నందు, అవికా గోర్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ రొమాంటిక్ థ్రిల్లర్ ట్రైలర్ ఇప్పటికే సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇంటెన్స్ నెరేషన్, బలమైన ఎమోషన్స్, ఊహించని ట్విస్టులతో నిండిన ఈ ట్రైలర్ ప్రస్తుతం సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతుంది. సంగీత దర్శకుడు శ్రావణ్ భరద్వాజ్ స్కోర్ ట్రైలర్‌ను మరింత ఆకర్షణీయం చేసింది. ఉత్కంఠ, ఆందోళన, ఆకర్షణ మూడింటినీ సమానంగా కలిపి రూపొందించిన ఈ ట్రైలర్ సినిమా విజయాన్ని ముందే సూచిస్తోంది. రియా జియా ప్రొడక్షన్ వాల్యూస్ చాలా అద్భుతంగా ఉండేలా సూచిస్తున్నాయి. ఈ సినిమా కచ్చితంగా బ్లాక్ బస్టర్ హిట్ అయ్యే అవకాశాలు ఉన్నాయి. ట్రైలర్ లాంచ్ ఈవెంట్ ఘనంగా జరిగింది. ఈ ఈవెంట్లో మూవీ టీం సినిమా ఔట్ పుట్ పై సంతోషం వ్యక్తం చేసింది. సినిమా పట్ల తమ నమ్మకాన్ని తెలియజేసింది.

## అమరం టీజర్ రిలీజ్



**వుదయం సినిమా :** తేజేష్ రాజన్ హీరోగా పరిచయం అవుతున్న చిత్రం అమరం, తిరుఅరుల్ కృష్ణన్ దర్శకత్వం దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఈ చిత్రం టీజర్ రిలీజ్ చేశారు. ఇంటెన్స్ యాక్షన్ తో టీజర్ ఆద్యంతం ఆకట్టుకుంది. ఓ ట్రైబల్ స్మగ్లర్, కిల్లర్, ఓ యువతి ప్రయాణం చుట్టూ తిరిగే కథ ఇది. ఎర్రచందనం స్మగ్లర్ల జీవనశైలి, వారు ఎదుర్కొనే కష్టాలు, ప్రమాదాలు, వారి ప్రపంచంలో దాగి ఉన్న వాస్తవాలను కూడా బలంగా ప్రతిబింబిస్తుంది. ఈస్ట్రన్ ఘాట్స్ నేపథ్యంగా తెరకెక్కిన ఈ సినిమా అక్కడి సామాజిక సమస్యలను కూడా బలంగా ప్రజెంట్ చేస్తోంది. వెస్ట్రన్ ఘాట్‌స్‌లో కూడా కీలక సన్నివేశాలను చిత్రీకరించగా, కడప పరిసర ప్రాంతాల్లో భారీ సెట్స్ నిర్మించారు.

## లెనిన్ డిఫరెంట్ పోస్టర్ విడుదల



**వుదయం సినిమా :** మనం ఎంటర్‌ప్రైజెస్ ఎల్ ఎల్ పి, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్లపై అక్కినేని నాగార్జున, సూర్యదేవర నాగవంశీ నిర్మిస్తున్న చిత్రం 'లెనిన్'. ఈ సినిమాలో అఖిల్ అక్కినేని, భాగ్యశ్రీ బోర్స్ జంటగా నటిస్తున్నారు. ఈ సినిమాకి మురళి కిషోర్ అబ్బూరు దర్శకత్వం వహిస్తున్నారు. ఈ మూవీని జూన్ 26న గ్రాండ్‌గా రిలీజ్ చేయబోతోన్నారు. ఇప్పటి వరకు రిలీజ్ చేసిన పోస్టర్లు, సాంగ్స్ అన్నీ కూడా ఆడియెన్స్‌లో ఇంట్రెస్ట్‌ను క్రియేట్ చేశాయి. ఇక తాజాగా ఈ సినిమా నుంచి హీరోయిన్ బర్త్ డే సందర్భంగా ఓ స్పెషల్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. హ్యాపీ బర్త్ డే భాగ్య శ్రీ భోర్సే అని చెబుతూ.. రాజసం ఉట్టిపడేలా కిరీటీం, మీసం, డిఫరెంట్ వేషధారణతో భాగ్య శ్రీ ఉన్న లుక్‌ను రివీల్ చేశారు. ఇందులో భాగ్య శ్రీ ఆహార్యం అందరినీ ఆకట్టుకునేలా ఉంది. మరి ఈ లుక్ వెనకాల ఉన్న నేపథ్యం ఏంటి? సినిమాలో ఈ పోస్టర్‌కి ఉన్న ఇంపార్టెన్స్ ఏంటి? అన్నది త్వరలోనే తేలనుంది.

## బ్యూటీ విత్ బ్రెయిన్స్ అనిపించుకోవడమే నా లక్ష్యం




**వుదయం సినిమా :** ఇండియన్ ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారిన మూవీ "M4M (మోటివ్ ఫర్ మర్డర్)". అమెరికన్ నటి జో శర్మ ప్రధాన పాత్రలో, దర్శకుడు మోహన్ వడ్లపట్ల తెరకెక్కించిన సస్పెన్స్ థ్రిల్లర్ M4M చిత్రం మే 8న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. పివిఆర్ ఇనోక్స్ పిక్చర్ ద్వారా విడుదలవుతున్న ఈ సినిమా తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా ఈ మూఈలో ప్రధాన పాత్రలో నటించిన అమెరికన్ నటి జో శర్మ మీడియా ప్రతినిధులకు ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. అందరికీ నమస్కారం. నా పేరు జో శర్మ. నేను శాన్‌ఫ్రాన్సిస్కో (అమెరికా) నుంచి వచ్చాను. బాలీవుడ్ తరహాలో వస్తున్న నా డెబ్యూ మూవీ "M4M ". ఈ సినిమా తెలుగు, హిందీ, కన్నడ, మలయాళం, తమిళ భాషల్లో విడుదలవుతోంది. మోహన్ వడ్లపట్ల గారు ఈ సినిమాకి దర్శకత్వం వహించారు. ఈ సినిమాలో నా పాత్ర పేరు 'రాధ', నేను ఒక క్రైమ్ ఇన్వెస్టిగేటివ్ జర్నలిస్ట్‌గా కనిపిస్తాను. ఈ సినిమాలో M4M అంటే "మోటివ్ ఫర్ మర్డర్". ఈ హత్యల వెనుక ఉన్న ఉద్దేశం ఏమిటి అనేది అసలు పాయింట్. ఈ టైటిల్‌కే అందరూ కనెక్ట్ అవుతున్నారు. ఈ చిత్రం ప్రతి ఒక్కరికీ ఒక కొత్త అనుభూతిని ఇస్తుంది. నన్ను, మా టీమ్ అందరినీ ఆశీర్వదించాలని కోరుకుంటున్నాను. బ్యూటీ విత్ బ్రెయిన్స్ అనిపించుకోవడమే నా లక్ష్యం.

## దేవిశ్రీకి జోడీగా మృణాల్ ఠాకూర్!



**వుదయం సినిమా :** సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్ ప్రధాన పాత్రలో 'బలగం' ఫేం వేణు ఎల్దండి తెరకెక్కిస్తోన్న చిత్రం 'ఎల్లమ్మ'. ప్రముఖ నిర్మాత దిల్‌రాజు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమాకు సంబంధించిన ఓ తాజా అప్‌డేట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇందులో కథానాయికగా మృణాల్ ఠాకూర్ నటించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. గతంలో దేవిశ్రీకి జోడీగా సాయి పల్లవి, కీర్తి సురేశ్ నటిస్తారని జోరుగా ప్రచారం జరిగింది. ఇప్పుడు తెర పైకి మృణాల్ పేరు వచ్చింది. ప్రస్తుతం మేకర్స్ ఆమెతో చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. ఒకవేళ ఆమె ఈ ప్రాజెక్ట్‌కు గ్రీన్ సిగ్నల్ ఇస్తే, సినిమాపై అంచనాలు మరింత పెరుగుతాయి. మొదట 'ఎల్లమ్మ'లో హీరోలుగా నాని, నితిన్ పేర్లు వినిపించినప్పటికీ, చివరికి ఈ విభిన్నమైన పాత్ర కోసం డీఎస్పీని ఎంపిక చేశారు. ఈ సినిమాకు దేవిశ్రీనే స్వరాలు అందిస్తున్నారు. ఇప్పటికే సంక్రాంతికి విడుదలైన ఫస్ట్ గ్లింప్స్ ప్రేక్షకుల్లో అంచనాలు పెంచింది. త్వరలోనే ఇందులోని హీరోయిన్‌కు సంబంధించిన అధికారిక ప్రకటన రానుంది.

## సెయాన్ ఫస్ట్ లుక్ రిలీజ్



**వుదయం సినిమా :** వెర్సటైల్ స్టార్ శివకార్తికేయన్, దర్శకుడు శివకుమార్ మురుగేశన్ దర్శకత్వంలో, కమల్ హాసన్, ఆర్. మహేంద్రన్ నిర్మిస్తున్న 'సెయాన్' కోసం చేతులు కలిపారు. బ్లాక్‌బస్టర్ విజయం సాధించిన అమరన్ తర్వాత శివకార్తికేయన్ మరోసారి రాజ్‌కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్‌తో కొలాబరేట్ కావడం విశేషం. విమర్శకుల ప్రశంసలతో పాటు కమర్షియల్ విజయాన్ని అందుకున్న ఆ చిత్రంతో ఏర్పడిన క్రియేటివ్ జర్నీ ఇప్పుడు మరింత బలపడింది.
గ్రాండ్ రూరల్ కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో హీరోయిన్ గా భాగ్యశ్రీ బోర్సే నటిస్తున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఆమెకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ మేకర్స్ రిలీజ్ చేసిన ఫస్ట్ లుక్.. ట్రెడిషన్, డివైన్ వైబ్ మేళవింపుగా ఆకట్టుకుంటోంది. గాజుల షాప్ బ్యాక్‌డ్రాప్‌లో ఆమె కనిపించిన తీరు పాత్రలోని ధైర్యం, ఆత్మవిశ్వాసాన్ని ప్రతిబింబిస్తోంది. మురుగన్ స్వామి ప్రతీకను గుర్తు చేస్తూ ఆమె కూర్చున్న తీరు మరింత ఆసక్తిని పెంచింది.

Printed, Published & Owned by Sirikonda Maria, Printed at LAKSHYAM TELUGU DAILY, D. No.1227/1, 11 GPR Flats, Pedakakani Village and Mandal, Guntur, Andhra Pradesh - 522509 and Published from : H. No. 25-17-343/18, 60 Feet Road, Srinivasa Thota, Guntur - 522004, Andhra Pradesh. Editor : Sirikonda Augustin, RNI No. APTEL/2014/57702. E-mail : voodayam2007@gmail.com Cell : 9247698676.